తెలుగు రాష్ట్రాలలో భాషావిధానం

గారపాటి ఉమామహేశ్వర రావు

అద్దంకి శ్రీనివాస్

ముందడుగు

తెలుగు భాషను అభివృద్ధిపరచాలి. తెలుగు వ్యవహారాన్ని పెంచాలి. అందరి నినాదమూ ఇదే.

అందుకు అనుసరించవలసిన మార్గం ఏమిటి? రాజ్యాంగపరంగా, చట్టాలపరంగా ఉన్న అవరోధాలు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? మాతృభాషావ్యవహారం అన్న అంశంపై రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు ఏమిటి? మనం వాటిని సద్వినియోగం చేస్తున్నామా ! దుర్వినియోగం చేస్తున్నామా ? ఇలా ఎన్నో ప్రశ్నలు. వీటిపై స్పష్టత లేదు.

తెలుగు భాషకు సంబంధించిన చట్టాలు ఏవో అవి ఎంతవరకు అమలులో ఉన్నాయో ఆ సమాచారమూ అందరికీ అందుబాటులో లేదు.

తెలుగు భాషావిధానం ఎలా ఉండాలి? అసలు భారతదేశంలోనూ, తెలుగురాష్ట్రాలలోనూ ఇప్పటిదాకా ఉన్న భాషావిధానాలు ఏమిటి? ఇతర దేశాలలో మాతృభాషల విషయంలో తీసుకున్న చర్యలు మనం ఆచరించదగ్గవిగా ఉన్నాయా? ఆ విషయాలు మనకు తెలియాలి.

ఆధునిక సాంకేతిక సమాచార విప్లవం, ప్రపంచీకరణ, స్థానికీకరణ, ప్రయివేటీకరణ మొదలైన నేపథ్యాలనుంచి భాషలను అధ్యయనం చేయడం అవసరం. ఆ అధ్యయనం వల్ల దేశభాషలకు అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడానికి మార్గాలు తెలుస్తాయి. దేశభాషలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలి.

భాషల ఆధారంగానూ ఉపాధి భద్రతను సాధించాలి. ఈ దిశగా పటిష్టమయిన భాషావిధాన రూపకల్పన శాస్త్రీయపద్ధతులలో ఇప్పటిదాకా జరగలేదు. వాటి ఆచరణ సఫలీకృతమయ్యే దిశగా ఆలోచనలుగానీ వ్యూహాలుగానీ లేవు.

మాతృభాషాకే పట్టం కడుతూ అభివృద్ధిపథంలో అందరికంటే ముందంజ వేస్తున్నాయి చైనా, జపాన్ వంటి దేశాలు. మరి వారు ఆచరించిన భాషావిధానం ఏమిటి ?

ఇటీవల అంతరించిపోయే భాషల జాబితా విడుదల చేసింది యునెస్కో. అందులో తెలుగు కూడా ఉందని పదే పదే అందరూ చెప్తూ వస్తున్నారు. అసలు యునెస్కో ఏం చెప్పింది? ఒక భాష అంతరించిపోతోందా లేదా అని నిర్ధారించడానికి కొలమానాలు ఏమిటి ?

తెలుగు భాషకు రెండు రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా) ఆవిర్భవించాయి. అంతకు ముందు సంయుక్తాంధ్రప్రదేశ్ లోనూ తెలుగు అధికార భాషగా ఉంది. ఇప్పుడూ

రెండు రాష్ట్రాలలోనూ తెలుగు అధికార భాష. ఇప్పుడు ఇరు రాష్ట్రాలలో మంత్రిత్వశాఖలు రెట్టింపు అయ్యాయి. వీటిలో ఒక్క భాషాసాంస్కృతికశాఖకు తప్ప తక్కిన శాఖలకూ భాషకూ ఏమీ సంబంధం లేదనే ధోరణి ఉంది. కానీ ఆయా శాఖలు ఏమిటి ? ఆయా శాఖలలో భాషపరంగా తీసుకోవలసిన చర్యలు ఏమిటి ?

ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఈ తెలుగు రాష్ట్రాలలో భాషావిధానం (ప్రాథమిక ముసాయిదా). దీనికి ప్రేరణ తెలుగు అకాడమీ వారి ద్వారా జరిగింది. అకాడమీ వారికి సూత్రప్రాయంగా భాషావిధానం ఇలా ఉండాలని సూచించిన తర్వాత ఇంకా కొంత విపులంగా ఒక చేపొత్తంలాగా తయారుచేయాలని అనిపించింది. దానికి కార్యరూపమే ఈ ముసాయిదా.

భాషాదృక్పథం, విధానం, ఆచరణ అనే మూడు మార్గాలను ఎంచుకొని వాటిని ప్రస్తుత భాషా స్థితికి సమన్వయిస్తూ రావలసిన మార్పులూ, కావలసిన చేర్పులూ సూచిస్తూ తయారుచేసిన ముసాయిదా ఇది. ఈ ఆలోచనకు బీజం వేసిన తెలుగు అకాడమి సంచాలకులు ఆచార్య కె. యాదగిరి గార్కి, తెలుగు అకాడమి పూర్వ సహాయ సంచాలకులు ఎ. పాండయ్యగార్లకూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

భాషాసేవలో ఎప్పుడూ ముందు నిలబడే మాన్యమహోదయులు, శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఉప సభాపతిగారికీ, ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి పూర్వ సంయుక్తాంధ్రప్రదేశ్ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి కె. వి రమణగారికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ భాషాభిమానులు అందరినీ స్వాగతిస్తూ..

మీ

గారపాటి ఉమామహేశ్వర రావు

అద్దంకి శ్రీనివాస్

తెలుగు రాష్ట్రాలలో భాషా విధానం

రాష్ట్ర భాషా దృక్పథం – భాషా విధానం

(ప్రాథమిక ముసాయిదా)

విషయసూచిక

1.0 ప్రవేశిక

1.1 తెలుగు భాషకు పునరుద్ధానం

2.0 తెలుగు భాష చారిత్రక నేపథ్యం

3.0 దృక్పథం

3.1 భాషాదృక్పథం – మౌలికాంశాలు

4.0 విధానం

4.1 భాషా విధానం – రూపకల్పన

5.0 ఆచరణ

5.1 భాషా విధానం : అమలుకావలసిన ప్రాథమిక రంగాలు

5.1.1 విద్యారంగంలో భాషా విధానం

5.1.1.1 దేశంలో భాషావిధానం

5.1.1.2 రాష్ట్రంలో భాషావిధానం

5.1.1.3 కొఠారీ కమిషను

5.1.1.4 విద్యా పరిశోధన – శిక్షణా మండలి

5.1.1.5 పాఠ్యాంశ ప్రణాళికలు: భాషలవ్యాప్తి – వినియోగం

5.2 పాలనా రంగంలో భాషా విధానం

5.2.1 దేశంలో భాషావిధానం

5.2.2 రాష్ట్రంలో భాషావిధానం

5.3 సమాచార ప్రసార రంగాలలో భాషా విధానం

5.3.1 దేశంలో భాషావిధానం

5.3.2 రాష్ట్రంలో భాషావిధానం

5.4 న్యాయపాలన రంగంలో భాషా విధానం

5.4.1 దేశంలో భాషావిధానం

5.4.2 రాష్ట్రంలో భాషావిధానం

5.5 వృత్తి, వ్యవసాయ, వాణిజ్యాది రంగాలలో భాషా విధానం

6.0 సమస్యలు – పరిష్కారాలు

7.0 ఉపసంహారం

8.0 ఉపయుక్త గ్రంథ సూచిక

9.0 అనుబంధాలు :

9.1 అనుబంధం 1 భారతరాజ్యాంగం – భారతీయ భాషలు

9.2 అనుబంధం 2 ఐరోపా రాజ్య సమితి భాషా విధానం

9.3 అనుబంధం 3 చైనా లో భాషా ప్రణాళిక

9.4 అనుబంధం 4 జాపనీయ జాతీయ భాషా విధానం

9.5 రాజ్యాంగం గుర్తించిన భాషల పట్టిక

9.6 తెలుగు వ్యవహారంలో ఉన్న రాష్ట్రాలలో భాషా విధానం

9.7 కొన్ని ప్రధానమైన భాషాశాస్త్ర గ్రంథాలు

9.8 కొన్ని ప్రధానమైన నిఘంటువులు

9.8 మాండలిక వృత్తి పదకోశాలు, మాండలికభాషా పరివర్తనాల తయారీ

9.9 భారతదేశంలోని అధికార భాషల పట్టిక

9.10 తెలుగు మాన చిత్రం

9.11 తెలుగు లిపి పరిణామ క్రమం చిత్రం

9.12 తెలుగు రోమను లిపి

9.13 తెలుగు wx notation

9.14 యూనికోడ్ పటం

9.15 తెలుగు అధికారభాషా చట్టాలు మరికొన్ని మైలురాళ్ళు

9.16 మాండలిక వృత్తిపదకోశాలు

9.17 కొన్ని ప్రధానమైన వ్యాకరణ గ్రంథాలు

9.18 అధికార భాషాసంఘం చేపట్టవలసిన లక్ష్యాలు

9.19 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షుల జాబితా

9.20 మంత్రిత్వ శాఖలు సత్వరం చేపట్టవలసిన భాషా విధానాలు

9.20.1 వ్యవసాయ శాఖ:

9.20.2 పర్యటక శాఖ:

9.20.3 విద్యాశాఖ:

9.20.4 ఆర్థిక శాఖ:

9.20.5 రోడ్లు భవనాల శాఖ:

9.20.6 పశు సంవర్ధక శాఖ:

9.20.7 ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ

9.20.8 పరిశ్రమల శాఖ:

9.20.9 న్యాయశాఖ:

9.20.10 పంచాయితీ గ్రామీణాభివృద్ధి శాఖ:

9.20.11 గిరిజన అల్పసంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ:

9.20.12 కార్మిక ఉపాధి శాఖ:

9.20.13 విద్యుత్ అణుశక్తి శాఖ:

9.20.14 రెవెన్యూ వాణిజ్యశాఖ:

9.20.15 హోం మంత్రిత్వ శాఖ:

9.20.16 భాషా సాంస్కృతిక శాఖ:

1.0 ప్రవేశిక

ఉద్దేశ్యం

తెలుగు భాష వ్యవహారవ్యాప్తికీ, అభివృద్ధికీ సంబంధించిన ప్రణాళికలు, కార్యాచరణ మార్గదర్శకాలూ, సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి ప్రత్యేక తెలంగాణా, అవశిష్ట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడిన నేటివరకూ ఆశించినంతగా కృషి జరగలేదన్నదీ అందువల్ల ఆశించినంత ఫలితం అందలేదన్నదీ అందరూ అంగీకరించే విషయమే. దీనికి కారణాలను అన్వేషిస్తూ కూర్చొనే కన్నా ఇప్పటివరకూ ఉన్న ఆలోచనలన్నింటినీ క్రోడీకరించి ఆచరణయోగ్యమైన ప్రణాళికను సిద్ధం చేయడమే మన ముందున్న కర్తవ్యం. భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించడం భాషాభివృద్ధికి తొలిదశ అనుకొంటే ఒకే భాషను వ్యవహరించే రెండు రాష్ట్రాలు తెలుగు భాషకు ఆవిర్భవించడం మలిదశ. ఈ మలిదశను వికాసదశగా మార్చుకొని అన్ని విధాలా భాషాభివృద్ధిని సాధించడానికి మూడు కీలక సోపానాలు ఉన్నాయి. అవి దృక్పథం, విధానం, ఆచరణ. ఈ మూడింటిలో ప్రయోగాత్మకంగా అడుగులు వేసేలా మార్గదర్శనం చేయడం కోసమే ఈ ప్రయత్నం.

1.1 తెలుగు భాషకు పునరుద్ధానం

ఇప్పుడు తెలుగు భాష రెండు రాష్ట్రాలలో ప్రధాన భాష. మరికొన్ని రాష్ట్రాలలో ముఖ్య భాష. భారతీయ భాషలలో విశిష్ట భాష. ప్రపంచంలో ఉన్న ఆరువేల భాషలలో తెలుగుది పదమూడవ స్థానం. పదమూడు కోట్లమంది ప్రధాన వ్యవహర్తలు గల భాష.

మొదటిసారి క్రీపూ.200 – క్రీశ. 200 మధ్య శాతవాహనుల నాణేలపై కనిపించిన తెలుగు ఇప్పటికి 2000 సంవత్సరాల నాటికే అధికార భాషగా ప్రజల వినియోగంలో ఉన్నట్లు రుజువు చేస్తోంది.

భాష, మానవ వికాస పరంపరలో అత్యంత ముఖ్యమైనదే గాక, జీవనోపాధికీ, జ్ఞానసృష్టికీ, సమాచార వినిమయానికీ వినోదానికీ మొదటి చిరునామా.

సమాచార ప్రసార సాంకేతిక యుగంలో అంతర్జాల ప్రగతిని అన్వయించుకొంటూ ఆధునిక అవసరాలకు అనువుగా వాడుకకు అవసరమైన వనరులతో తెలుగు భాష సాగుతోంది. సాంకేతికంగా ఆంగ్లభాషకు ఉన్న ఉపకరణాలను, సౌలభ్యాలనూ

రూపొందించుకునే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. ఇలాంటి తెలుగు భాష మనుగడ, కొన్ని తప్పుడు విధానాల వలన గాలిలో దీపంలా తయారైంది. తెలుగు భాషకు సముచిత స్థానాన్ని తీసుకురావడానికీ తద్వారా జాతి ప్రతిష్ఠనూ, ప్రజలలో జీవన విశ్వాసాన్ని పెంచడానికీ, బాషాభిమానాన్నీ, జాతిసమైక్యతనూ పెంపొందించడానికీ తెలుగు జాతి వారసత్వ సంపదను పరిరక్షించడానికీ, ఆధునికీకరించడానికీ తగిన విధంగా భాషా విధానం రూపొందించాలి. అది అమలయ్యే విధంగా శాసనాలు పనిచేయాలి.

అందుకు కావలసిన విధి విధానాలనూ మార్గదర్శకాలనూ శాస్త్రీయంగా, సోపపత్తికంగా అందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం.

2.0 తెలుగు భాష చారిత్రక నేపథ్యం

భారతదేశం సంక్లిష్ట బహుభాషా దేశం. హిందార్య, ద్రావిడ, ఆస్ట్రో–ఆసియా, టిబెటీయ–బర్మీయ భాషా కుటుంబాలకు చెందిన వెయ్యికి పైగా భాషలతో 120 కోట్ల జనాభాతో భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద భాషా కుటుంబాలకు అటపట్టు. ఇక్కడ అనేక భాషలకు చెందిన భిన్న భాషావ్యవహర్తల సమూహాలు వేలాది సంవత్సరాలుగా కలిసి మెలసి జీవనం సాగిస్తున్నాయి. ఈ అవిచ్ఛిన్న భాషా సమూహాల చరిత్రే సుదీర్ఘమైన, వైవిధ్యభరితమైన భారతదేశ చరిత్రకు సాక్ష్యం. పైగా, భారతీయ భాషలలో అనేక సాదృశ్య లక్షణాలు వ్యాపించడానికి ఇది సహాయపడింది. సమాన లక్షణాలను కలిగి ఉంటూనే ఒకదానికి ఒకటి భిన్నంగా ఉంటూ భారతదేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపించడంలో భారతీయ భాషలు ప్రధానమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. ఇవి కేవలం వాగ్వ్యవహారానికి మాత్రమే ఉపయోగపడేవి అనుకొంటే పొరపాటే.

గత కొన్ని వేల సంవత్సరాల భారత ఉపఖండ చరిత్రను గనుక పరిశీలిస్తే– చిన్న చిన్నరాజ్యాలను కలిపి ఒకే పెద్ద రాజ్యం కిందికి చేర్చడం, అలాగే ఒకే పెద్ద రాజ్యాన్ని చిన్న చిన్న రాజ్యాలుగా విడగొట్టడం జరిగినట్లు తెలుస్తోంది. అయితే దీనివల్ల ఎప్పుడూ ఏ ఒక్క భాషా దాని మనుగడా మంట గలిసేలాంటి ప్రత్యేక పరిస్థితులు భారతదేశంలో ఏవీ ఏర్పడలేదు. ఇతరదేశాలలో (ఉత్తర, దక్షిణ అమెరికాలు, ఆస్ట్రేలియా లాంటి దేశాలలో) జరిగినట్లు దేశభాషలను అణచివేసే పద్ధతీ లేదు.

భారతీయ భాషలు ప్రపంచ భాషా చరిత్రలో ఒక విలక్షణ సంప్రదాయానికి తెరతీశాయి. ప్రపంచ పటంపై భారతీయ ***'భాషా ప్రాదేశికత'*** కు (India as a Linguistic Area) ఒక గుర్తింపు తెచ్చాయి. ఈ విలక్షణత, భాషలు కనుమరుగు కాకుండా ఉండేందుకు అవలంబించిన ఒక ప్రణాళిక అని భాషా శాస్త్రజ్ఞులు అంటారు.

అదే తెలుగు విలక్షణత. అఖండ భారతదేశంలో ఉత్తర దక్షిణాలమధ్య వారధిలా నిలబడిన తెలుగుభాష, భాషాప్రాదేశికతకు గీటురాయిగా నిలిచింది. భాషల మనుగడ హేతుబద్ధమైన కారణాలపై ఆధారపడి ఉండాలి. భారతీయ భాషలు విలక్షణతనీ, సంస్కృతినీ, జీవనాడినీ పట్టి చూపుతాయి. ఇంటువంటి వైవిధ్యం ఉన్న భాషలలో ఏ ఒక్క ప్రత్యేక లక్షణం కనుమరుగైపోయినా కొన్ని వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదలను కోల్పోయినవారం అవుతాం. ప్రాచీన మానవ జీవవికాసానికి సంబంధించిన ఎన్నో సత్యాలు ఇంకా ఇప్పటికీ వెలుగు చూడలేదు. పైగా చరిత్ర వక్రీకరింపబడిన సందర్భాలూ ఉన్నాయి. అందుకు కారణం భాషలను చరిత్రరచనలోనూ పునర్నిర్మాణంలోనూ వాగ్రూప సాక్ష్యాలుగా స్వీకరించకపోవడమే. ఈ దిశగా ఆయా భాషలపై లోతైన పరిశోధనలు జరగకపోవడం ఒక ఎత్తయితే సమాజంలో అన్ని స్థాయిలకూ భాషలను విస్తరించనివ్వకపోవడం, పరిపూర్ణంగా ఆమోదించకపోవడం మరో ఎత్తు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు రెండూ రెండింతల కృషితో తెలుగు చెట్టుకు వెలుగు పూలు పూయించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలి.

3.0 దృక్పథం

ప్రజల భాషలో సాగని పాలన ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామ్యంలో పరిపాలన, విద్య, సమాచారప్రసార వినిమయం, వృత్తి – వాణిజ్య రంగాలలో అన్ని స్థాయిలలోనూ మొత్తం వ్యవహారాలు ప్రజల భాషలోనే సాగాలి.

3.1 భాషాదృక్పథం – మౌలికాంశాలు

నియమాలు :

రాష్ట్ర భాషా విధానం – పంచసూత్ర విధానం

1. భారత రాజ్యాంగ బద్ధంగా ఉండాలి.
2. హేతుబద్ధంగా ఉండాలి.
3. సామాన్యుల బతుకు తెరువుకు వనరుగా ఉండాలి
4. ఆధునిక సాంకేతిక వ్యవస్థకు ఆలంబన కావాలి.
5. ప్రజాస్వామ్య మనుగడను పటిష్ట పరచేదిగా ఉండాలి.

ప్రాతిపదిక :

భారతరాజ్యాంగంలోని 345వ ప్రకరణం, రాష్ట్రాలలోని భాషావిధానం గురించి ఇలా చెబుతోంది.

ఒక రాష్ట్రం – తన ఆధికారిక అవసరాలకు గాను ప్రాంతీయ భాషను గానీ లేదా దేశ అధికార భాషను గానీ స్వీకరించే స్వేచ్ఛను కల్పిస్తోంది. ఐతే, అల్పసంఖ్యాక వర్గాల భాషలు పరిరక్షింపబడాలి. దానితో పాటు కనీసం ప్రాథమిక విద్యవరకైనా వాళ్ళు తమ మాతృభాషలో చదవుకొనేందుకు తగిన సదుపాయాలు కల్పించాలి. (భారత రాజ్యాంగంలోని 345 వ ప్రకరణం, చూ. అనుబంధం1).

భారతరాజ్యాంగానికి అనుగుణంగా ఆధికారిక భాషగా తెలుగును అన్నిరంగాలలో అభివృద్ధి పరుచుకోవటం మన కర్తవ్యం.

సూచనలు :

1. ఒక రాష్ట్రంలోని అధిక సంఖ్యాకుల భాషను అధికారబాషగా గుర్తించడం, అల్పసంఖ్యాకుల భాషలను పరిరక్షించడం రాజ్యాంగం నిర్దేశించిన భాషావిధానం. ఆలా అధికారభాషగా గుర్తించకపోవడం, పరిరక్షించకపోవడం, రాజ్యాంగ నిర్దేశకాలను అతిక్రమించడమే. అందువల్ల అధికార భాషాచట్టాలను ఉల్లంఘించడం నేరపూర్వకప్రవృత్తిగా గుర్తించాలి. ఇలాంటి నేరప్రవృత్తిని దేశద్రోహంగా, సమాజంపట్ల అనైతిక ప్రవర్తనగా పరిగణించాలి.

2. హేతుబద్ధత అంటే కొద్దిమంది ఇష్టానిష్టాలకు అతీతంగా జాతి, కుల, మతాలకు అతీతంగా నిర్దేశించబడినది. భాషల ఎంపికకూ అభివృద్ధికీ ప్రత్యక్ష సంబంధం కనబడుతోంది.

3. ఆర్థిక అభివృద్ధికి భాష కూడా ఒక సాధనం. అంటే బతుకు తెరువు చూపించేదే భాష. అంటే తెలుగు వెలగాలంటే బతుకుతెరువుకు సాధనం కావాలి. అదే జరగాలంటే పరిపాలన, విద్య, సమాచార ప్రసారరంగాలలోనూ వృత్తి వాణిజ్యాది రంగాలు అన్నింటిలోనూ తెలుగే మాధ్యమంగా సాగాలి. తెలుగులో చదివిన వారికే ఉద్యోగాలు, ప్రజాసేవకుల కొలువులలోనూ తెలుగు వాడే వారికే ప్రాధాన్యం ఉండాలి. ఇంగ్లీషు చదువులతో విదేశీ ఉద్యోగం చేయవచ్చుగానీ దేశీయ ఉద్యోగాలు కాదు. ఎవరిసేవకోసం ఇక్కడి ఇంగ్లీషు చదువులు?

4. భాష ఆధునిక సాంకేతికతకు ఆలంబనగా మారాలి. ప్రజాభాషలలో పరిపాలన, విద్యార్జన సాగాలి. సమాచార ప్రసార వృత్తి వాణిజ్యాది రంగాలలో తెలుగుకు సముచితస్థానం రావాలంటే అన్ని రకాలుగా అన్ని సాంకేతిక వ్యవస్థలలోనూ తెలుగే మాధ్యమం కావాలి. ప్రజల భాషలలోనే ఆధునిక సాంకేతిక వ్యవస్థల వాడకం అత్యంత వేగవంతం అవుతుంది. అలాంటి ప్రజాభాష మాధ్యమంగా ఉండే

సాంకేతిక వ్యవస్థను చౌకగానూ వేగవంతంగానూ అందిస్తే అది ఎక్కువమందికి చేరువ అవుతుంది.

4.0 విధానం

భాషాసామర్థ్యం మానవ జన్మసిద్ధం. అలా సంక్రమించిన భాషా నైపుణ్యాలను అణగదొక్కడం అంటే భాషను ధ్వంసంచేయడమే. భాషాధ్వంసమూ జీవ విధ్వంసమే. దీనిని అరికట్టేందుకు ఒక సమయ బద్ధ భాషావిధానం ఉండాలి. అది కొన్ని నియమాలపై ఆధారపడి ఉండాలి. అంటే జీవ విధ్వంసాన్ని అరికట్టేందుకే భాషా విధానం. ఇదే ఐక్యరాజ్య సమితి భాషా విధానం.

4.1 భాషా విధానం – రూపకల్పన

నియమాలు:

రాష్ట్ర భాషా విధానం – పంచసూత్ర విధానం

ఆచరణలో అధికార భాష

1. సామాన్యులతోసహా అధికసంఖ్యాక ప్రజలకు మాతృభాషగా ఉండాలి.
2. నిత్యజీవితంలో అన్ని అవసరాలకూ పనికి వచ్చేదిగా ఉండాలి.
3. సామాజిక సమానత్వాన్ని పెంపొందించేట్లుగా ఉండాలి.
4. తెలుగువారి చరిత్ర, సాంస్కృతిక నేపథ్యానికి తగినట్లుగా ఉండాలి.
5. ఐక్య రాజ్య సమితి భాషావిధానాన్ని గౌరవించేటట్లు ఉండాలి (చూ. N అనుబంధం 2).

ప్రాతిపదిక :

రాష్ట్రభాషా ప్రతిష్ఠను పెంపొందించే విధంగా హెచ్చుతగ్గులు లేని సమ సమాజ నిర్మాణానికి మాతృభాషే ప్రధాన భూమిక. మాతృభాష మానవ అస్థిత్వానికి మూలం. సామాన్య ప్రజలకు నిత్య వ్యవహారంలో ఉపయోగపడే ఒక సులభమైన ఉపకరణం మాతృభాషే. (అందుకే సాంకేతికంగా భాషను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతో ఉంది.) మానవీయ విలువలతో కూడిన జీవన ప్రమాణాలు, మాతృ భాష ద్వారా మాత్రమే నిరూపితం అవుతాయి. ఒక వ్యక్తి ప్రాదేశికత, ప్రాంతీయత మాతృ భాషలోనే ప్రతిబింబిస్తాయి. భావ వ్యక్తీకరణకే కాదు, జీవనానికి బుద్ధివికాసానికీ భాష ఓ మాధ్యమం. వ్యక్తిత్వ వికాసాన్నీ నడవడికలో మార్పునూ తీసుకురాగల సత్తువ భాషకు ఉంది. భాషను

బట్టి సంస్కారం, విద్య ఇనుమడిస్తాయి. భాషాచరిత్రే సమాజ చరిత్ర, దేశ చరిత్ర కూడా. మండలిక వ్యవహారాలలో మనకెవరికీ చెవినపడని అపారమైన పదసంపద ఉంది. అది జాతి ఉనికినీ, పరిణామాన్నీ, పరిణతినీ తెలియజేస్తుంది.

భాషను విభజన సాధనంగా వాడటాన్ని ఐరాస వ్యతిరేకిస్తోంది. అలా వాడటాన్ని నిరోధించడంపై ఒక నివేదికనూ తయారుచేసింది. దాని సారాంశం ఇది.

ఆధిపత్య/ఆధికారిక భాషావ్యవహారంలో కొన్ని పరిమితులు ఉంటాయి. ఆ పరిమితులు విద్య, రాజకీయం, న్యాయం మొదలైన రంగాలలోనికి స్థానిక భాషావ్యవహర్తలను రానివ్వవు. దూరంగా ఉంచుతాయి. ఆంగ్లం నేడు ఆధిపత్య భాషకూ, తెలుగు స్థానిక భాషకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

మౌఖిక, సంకేత భాషలు వ్యవహారంలో నిలిచి ఉండాలి. ఆ భాషల పరిరక్షణ తల్లిదండ్రుల నుండి పిల్లలకు వారసత్వంగా అందించడంపై ఆధారపడి ఉంటుంది. ఇది ముఖ్యమైన అంశం. భాషా పరిరక్షణ జరగాలి. భాషా సాంస్కృతిక విధ్వంసం ఆగిపోవాలి. భాషలకు సంబంధించిన మానవ హక్కుల హరణాన్ని నిరోధించాలి. మాతృభాషా మాధ్యమంలో చదువుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. దశాబ్దాలుగా లేదా శతాబ్దాలుగా మాతృభాషలలో సాధారణ విద్యాబోధన జరగని భాషలు అదృశ్యమైపోతాయి. ఆధునికీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ హక్కులు మరింత త్వరగా హరించుకు పోతున్నాయి. మాతృభాషా మాధ్యమంలో విద్యార్జన చేసే అవకాశాలను కాలరాయడం అంటే మాతృభాషలకు మరణ శాసనాలను రాయడమే.

సాంఘిక – రాజకీయ నేపథ్యాలనుంచి చరిత్రనూ, సంస్కృతినీ, ప్రజాజీవితాన్ని పునర్మూల్యాంకనం చేసుకోవాలి. దీనికి సామాజిక భాషా శాస్త్ర దృష్టికోణమూ ఎంతో అవసరం. ఇప్పటిదాకా చీకటికోణాలలో మగ్గిపోయిన వాస్తవాలకూ, ఆ వాస్తవాల అట్టడుగున ఉన్న జనులు మాట్లాడే భాషలకూ ఆయా వర్గాలకూ ఒక గుర్తింపు, గౌరవం, సమప్రాధాన్యం కలిగేలా మన ఆలోచనలూ విధానాలూ ఆచరణలూ ఉండాలి. ఇలా చేయడం వల్ల సహానుభూతి కలుగుతుంది. అది జాతి సమైక్యతకు దోహదం చేస్తుంది. మాండలికాల అధ్యయనం వల్ల భాషా సామరస్యాన్నీ, వర్గసామరస్యాన్నీ సాధించటం సాధ్యమవుతుంది.

సూచనలు:

1. భాష ఒక సాధనం. మనిషికి ఒక అవయవం. దాన్ని మానవ మనుగడకు ఒక ఆనవాలుగా గుర్తించాలి. మాతృభాషాభివృద్ధి మన అభివృద్ధిలో భాగం.

మాతృభాషానైపుణ్యాలు మన జీవన సోపానాలు.

2. భాష వేరు సాహిత్యం వేరు. జీవన సమరంలో భాష ఒక ఆయుధం. భాషను అభివృద్ధి పరచే ప్రణాళికా రూపకల్పనల విషయంలో సాహిత్యం, సంస్కృతుల నుంచి భాషను వేరుగా చూడాలి. అలా చూస్తేనే భాషాభివృద్ధి సాధ్యం.

3. ప్రజల భాషలోనే జ్ఞానసృష్టీ, సమాచార వినిమయం జరగాలి.

4. ప్రపంచీకరణ భావానికి సంబంధించినది కానీ భాషకు సంబంధించినది కాదు. ప్రపంచీకరణకు ప్రజలభాషలు/ మాతృభాషలు ఆలంబనం కావాలి. ప్రజాస్వామ్యదేశాల లక్ష్యం తమ ప్రజాసంక్షేమమే. ప్రజాసంక్షేమంలో ప్రజల మాతృభాషలూ ఇమిడి ఉన్నాయి. ప్రపంచీకరణ పేరుతో ఆంగ్లభాషావ్యాప్తి వలసవాదానికి మారుపేరు. నిన్నటి వలసవాదం కంటే నేటి ఆంగ్ల మాధ్యమ విద్యలే బడుగుదేశాల స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నాయి. ఆ దిశగానే రేపటి అడుగులు పడబోతున్నాయి. దాన్ని అడ్డుకోవాలి.

5. చరిత్రా సంస్కృతుల మూలాన్వేషణలో భాషా ప్రాధాన్యాన్ని గుర్తించే స్థాయిలో పరిశోధనలు ఎదగాలి. వాటిని ప్రోత్సహించాలి.

6. ప్రజల భాషకు సాంకేతిక పరికరాల రూపకల్పన స్వావలంబనకు గీటురాయి. రాష్ట్ర భాషావిధానం దానిని ప్రోత్సహించేదిగా ఉండాలి.

5.0 ఆచరణ

భారతరాజ్యాంగం ఏర్పరచిన మార్గదర్శకాలనూ నియమ నిబంధనలనూ అనుసరిస్తూ ప్రభుత్వ ప్రభుత్వేతర రంగాలలో ప్రాంతీయభాషలకు వ్యవహారగౌరవం, అవసరం కలిగేలా చేయటం, ప్రాయోజకత్వం కలిగించడం ప్రథమ కర్తవ్యం. దీని సాధనకు తగిన భాషావిధానాలను రూపొందించుకొని ప్రభుత్వమూ ప్రజలూ ప్రయివేటు సంస్థలూ స్వచ్ఛందంగా ఆచరించే భాషావిధానాన్ని శాస్త్రీయభూమికల ఆధారంగా నిర్మించడం అవసరం.

5.1 భాషా విధానం : అమలుకావలసిన ప్రాథమిక రంగాలు

భాషా చేతనత్వమూ (Language Vitality) భాషా ఆపన్నత (Language endangerment) అనే అంశాల ఆధారంగా భాషల మనుగడ గురించి 2000–2001, 2003, 2005 సంవత్సరాలలో సర్వేలను ఐరాస నిర్వహించింది. ఏదైనా ఒక భాష సజీవంగా ఉంటుందా ఆపన్న భాష(endangered Language) కాబోతుందా

అని తెలుసుకోవడానికి కొన్ని సూత్రీకరణలు చేసింది. వాటిని తెలుగు భాషకు వర్తింపజేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ కింది పట్టిక ద్వారా చూడవచ్చు.

క్రమ.సం	సూత్రీకరణ	తెలుగుకు వర్తింపు
1	అనువంశిక భాషా ప్రసారం (తల్లిదండ్రుల నుండి బిడ్డలకు) 10 20 30 40 50 60 70 80 **90** 100	పాక్షికం
2	భాషావ్యవహర్తల సంఖ్యా పరిపూర్ణత 10 20 30 40 50 60 70 80 **90** 100	ఉంది
3	మొత్తం జనాభాలో ఆ భాషా వ్యవహర్తల సంఖ్య 10 20 30 40 50 60 70 **80** 90 100	ఉంది
4	భాషా వినియోగ రంగాలలోకి పరివర్తనం/విస్తరణ 10 20 30 40 50 **60** 70 80 90 100	పాక్షికం
5	కొత్త రంగాల మాధ్యమాల విషయంలో స్పందించే లక్షణం 10 20 30 40 50 **60** 70 80 90 100	ఉంది
6	భాషాభ్యసనం / అక్షరాస్యతల కోసం వనరుల లభ్యత 10 20 30 40 50 60 70 80 **90** 100	పాక్షికం
7	హోదా/ వినిమయ సందర్భాలలో ప్రభుత్వ, ఆధికారిక, సంస్థా పరమైన భాషా ప్రవృత్తులు / విధానాలు 10 20 30 40 50 **60** 70 80 90 100	పాక్షికం (అన్నింటా తెలుగు వాడకం లేదు)
8	స్వీయ భాషా విషయంలో జాతి, కుల సంఘ సభ్యుల వైఖరులు 10 20 30 40 50 60 70 **80** 90 100	పాక్షికం (అంతా ఒక్కతాటిపై లేదు)
9	పత్రీకరణలో భాషను ఎంతగా వినియోగిస్తున్నారు, దాని నాణ్యత 10 20 30 40 50 60 70 **80** 90 100	పాక్షికం
10	సాంస్కృతిక పరమైన అంశాల, సంప్రదాయాల, జాతి కులమత పరమైన కళల ఆలంబన 10 20 30 40 50 60 70 **80** 90 100	పాక్షికం

9 + 9 + 8 + 6 + 6 + 9 + 6 + 8 + 6 + 8 = 75.00%

ఈ సూత్రీకరణలకు వివరణ.

1. ఆనువంశిక భాషాప్రసారం అంటే పుట్టిన ప్రతిబిడ్డా తల్లిదండ్రులనుండి తెలుగుభాష నేర్చుకొంటున్నాడా లేదా అన్నది.
2. తెలుగుభాషా వ్యవపర్తలు సంఖ్యాపరంగా ఒక బలీయమైన సమూహంగా ఉందా లేదా అన్నది.
3. ఆ భాషావ్యవహర్తలు ప్రాంతీయ జనాభాలో అధికసంఖ్యాకులుగా ఉన్నారా లేదా అన్నది.
4. భాషను వాడవలసిన చోట్ల తెలుగును వాడుతున్నారా లేదా అన్నది.
5. ఆధునికీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో వస్తున్న కొత్తరంగాలలో తెలుగు వాడకం జరుగుతోందా లేదా అన్నది.
6. తెలుగు భాషను నేర్పేందుకూ నేర్చుకొనేందుకూ ఆధునిక వనరుల తయారీ ఎప్పటికప్పుడు అవసరాలకు తగినవిధంగా జరుగుతోందా లేదా అన్నది.
7. ప్రభుత్వపరమైన ఆధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలోతెలుగు వాడకంజరుగుతోందా లేదా అన్నది.
8. తెలుగుకు సంబంధించినంతవరకూ సమాజంలో వివిధవర్గాల స్పందన ఎలా ఉంది అన్నది.
9. ఆధునిక ప్రపంచంలో రాతకోతలకు వినియోగించే తెలుగు శాతం ఎంత అన్నది.
10. సాంస్కృతిక, సాంప్రదాయిక రచనల సమర్థన ఉందా లేదా అన్నది. (ఉదాహరణకు అరబిక్ భాషకు ఖురాన్, పంజాబీ భాషకు గురుగ్రంథ్ లాంటివి ఆలంబనగా నిలుస్తున్నాయి.

అలాగే తెలుగుభాషలో వేలకొలదిగా ఉన్న అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం, త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసుల రచనలు తెలుగువారి తరతరాల తాత్త్వికచింతనకు అద్దంపడతాయి).

ఈ పది సూత్రీకరణలను తెలుగు భాషకు అన్వయించుకొని చూస్తే ఆశాజనకంగానూ సంతృప్తికరంగా ఉండే సమాధానాలు రావడం లేదు. కాబట్టి తెలుగు భాష గురించి వ్యవస్థీకృతమైన నిర్ణయాలతో వివిధ (విద్య, పాలన, న్యాయవ్యవస్థ, సమాచార ప్రసార సాంకేతిక, వ్యావసాయిక, వృత్తి, వాణిజ్యాది) రంగాలలో భాషా విధానాన్ని అమలుచేయాలి.

5.1.1 విద్యారంగంలో భాషా విధానం

తెలియని విషయాన్ని తెలియజెప్పేదే విద్య. అది మాతృభాషలో ఉండటమే శాస్త్రీయం. కొన్నిసామాజిక కారణాలవల్ల అది పరభాషలో జరగడం తప్పనిసరి అయితే అది పెద్ద తప్పు. ఎందుకంటే, తెలియని దాన్ని తెలియని భాషలో నేర్చుకోవడంఎంతో కష్టం. ఒక రకంగా చెప్పాలంటే అదే అవిద్య. సమాజంలోని ఎన్నో రుగ్మతలకు ఇదే కారణం. వినే వాడికి చెప్పే విషయం అర్థం కాదు. కొద్దోగొప్పో అర్థమైనా దాన్ని విస్తరించి ఆచరణలో పెట్టడం చేతకాదు. ఒకవేళ చేతనైనా దానిని ప్రభావవంతంగా ప్రపంచానికి తెలిసేటట్టు రాయడం చేతకాదు. ఇదంతా విద్యారంగంలో వెనుకబాటుతనానికి కారణం. ఇలాంటి ఆంగ్ల మాధ్యమం మనకు నూటికి తొంబైశాతం ఎందుకూ కొరగాని మాధ్యమం అయిపోయింది. అదే సమాజంలో ప్రజలను విభజిస్తోంది. ఇంటిభాష, బడిభాష వేరు కావడంతో భాష వల్లనే సమాజంలో అంతరాలు ఎర్పడుతున్నాయి. ప్రతివాడికీ బతికే హక్కూ, అమ్మభాషలోనే పనిచేసే హక్కూ పుట్టుకతో సిద్ధించేవే. అయితే అవి ఆంగ్లమాధ్యమం ద్వారా కాకూడదు. కొన్ని సామాజిక కారణాలవల్ల అలా కావడం దురదృష్టకరం. దానిని సరిదిద్దవలసిందే.

నియమాలు:

1. ఇంటర్మీడియట్ స్థాయి వరకు తెలుగు మాధ్యమం తప్పనిసరిగా ఉండాలి.
2. తెలుగు మాధ్యమం వీలు కాని చోట అన్ని స్థాయిలలో తెలుగును ఒక భాషగా బోధించడం తప్పనిసరిగా ఉండాలి.
3. తెలుగు ఒక భాషగా గానీ తెలుగుమాధ్యమంలో గానీ చదవనివారికి తెలుగు సామర్థ్యపరీక్ష తప్పనిసరి చేయాలి.

ప్రాతిపదిక

ప్రపంచీకరణ ప్రభావం వల్ల శీఘ్రగతిన విస్తరిస్తున్న ఆంగ్లభాష ఆధిపత్య పదఘట్టనల కింద దేశీయభాషలన్నీ నలిగిపోతున్నాయి. విద్యావిధానంలో మాతృభాషావ్యవహారానికి అవకాశం లేనప్పుడు భాష అంతరించిపోతుంది. దానితోపాటుగా జాతీ సంస్కృతీ అస్తిత్వాన్ని కోల్పోతాయి. తద్వారా భావి భారతం దేశీయభాషా సుజల జలాలు లేని ఎడారిగా మారిపోతుంది. దేశీయ భాషా వ్యవహార జాతులన్నీ త్వరితగతిన అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇది ముమ్మాటికీ జీవవిధ్వంసమే. అందుకే ఒక భాషావిధానం అవసరం.

5.1.1.1 దేశంలో భాషా విధానం

బహు భాషా వ్యవహర్తలు గల భారతదేశంలో 200 పైగా భాషలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఎక్కువమంది ఏ భాష మాట్లాడితే ఆ భాష ప్రాంతీయ భాష. ఐతే దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధాన భాషగా హిందీనీ అంతర్జాతీయ కార్యకలాపాలకు ఆంగ్లాన్నీ వినియోగిస్తున్నారు. శాస్త్రసాంకేతిక వికాసంవల్ల అవసరాల నిమిత్తం ఒక ప్రాంతీయ భాషతోపాటు ఇతర భాషలూ నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది.

భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో ఒకటికంటే ఎక్కువ భాషలు మాట్లాడే సందర్భాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం కూడా భాషా సమస్య ఉంది. బోధన మాధ్యమంగా ఆంగ్లం, సంస్కృతం, అరబిక్ లలో ఏది ఉండాలన్న దానిపై వివాదాలు తలెత్తాయి. చివరకు మెకాలే(1935) ప్రతిపాదనల ద్వారా ఆంగ్లం అధికార భాషగా బోధనా భాషగా స్థిరపడింది.

20 వ శతాబ్దిలో ద్విభాషా సూత్రం అమలులో ఉండేది. ఆంగ్లం ప్రథమ భాష. ప్రాంతీయభాష ద్వితీయభాష. కానీ ఆంగ్లానికే ప్రాధాన్యం ఉండేది. స్వాతంత్రోద్యమ కాలంలో ప్రజలకూ, నాయకులకూ, ప్రభుత్వానికీ ఆంగ్లం అనుసంధానంగా ఉన్నప్పటికీ ఆ భాష తెలిసినది కొద్దిమందికే. ఏదో ఒక దేశ భాష మాత్రమే అధికార భాషగా ఉండాలనే అభిప్రాయం బలపడింది. అధిక సంఖ్యాకుల మాతృభాష హిందీ కావడంతో హిందీ వెలుగులోనికి వచ్చింది. హిందీ ఒక భాష గాదు. అది కొన్ని భాషలసమూహానికి మారుపేరు. ఆ సమూహంలో ఖడీబోలీ, అవధీ, రాజస్థానీ, హర్యానవీ, మగక్, మైథిలీ, చత్తీస్ గఢ్, బుందేలీ, భోజపురీ, పహాడీ లాంటివి ఎన్నో ఉన్నాయి. వీటిని మాండలికాలు అనడం కన్నా భాషలు అనడం మేలు. కేంద్రసాహిత్య అకాడమీ కూడా వీటిని ప్రత్యేకభాషలుగా గుర్తించి సాహిత్యపురస్కారాలను అందిస్తోంది.

స్వాతంత్ర్యానంతరం హిందీ అధికార భాష అయ్యింది. దేశమంతటా హిందీభాషను అమలు చేయాలనీ పాఠశాలలో తప్పనిసరి చేయాలనీ నిర్ణయించారు. హిందీయేతర ప్రాంతాలలో దీనికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమిళనాడులో ఏకంగా హిందీ వ్యతిరేక ఉద్యమాలు చెలరేగాయి. హిందీ భాషా వాదుల బలం ఎక్కువగా ఉన్నప్పటికీ హిందీని ఇతర భాషా రాష్ట్రాలపై రుద్దడానికి కేంద్రప్రభుత్వం ఒప్పుకోలేదు. ఈ పరిస్థితిని సమీక్షించడానికి కేంద్రప్రభుత్వం కొఠారి కమిషన్ ను వేసింది. వారి సిఫార్సుల మేరకు ఏర్పడినదే త్రిభాషా సూత్రం. దీని ప్రకారం:

హిందీయేతర రాష్ట్రాలలో పిల్లలు నేర్చుకోవలసిన భాషలు:

1. మాతృభాష లేదా ప్రాంతీయ భాష
2. జాతీయ అధికార భాష(Union Official Language) హిందీ
3. అంతర్జాతీయ భాష ఆంగ్లం

హిందీ మాతృభాషగా గల రాష్ట్రాలలో నేర్చుకోవలసిన భాషలు

1. మాతృభాష లేదా ప్రాంతీయభాష – హిందీ
2. అంతర్జాతీయ భాష–ఆంగ్లం
3. ఒక భారతీయ భాష (దక్షిణ భారత భాషకు ప్రాధాన్యం)

1964లో కొఠారీ కమీషన్ ప్రతి విద్యార్థి ప్రాంతీయ భాషతోపాటు విధిగా హిందీ, ఆంగ్ల భాషలను అభ్యసించాలని ప్రతిపాదించింది. 1978లో ఎన్సిఈఆర్టీ (NCERT) వారు రూపొందించిన 10+2+3 విద్యాప్రణాళికలో కూడా త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. 1986 జాతీయ విద్యావిధానం (NPE 1986) కూడా త్రిభాషా సూత్రానికి ఆమోదం తెలిపింది.

5.1.1.2 రాష్ట్రంలో భాషా విధానం

స్వాతంత్ర్యం తర్వాత భాషా ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరణ చెందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అయితే ఆంధ్రప్రదేశ్ లో నైరుతి సరిహద్దులో కన్నడం – తెలుగు, దక్షిణ ప్రాంతంలో తమిళం – తెలుగు వాడకంలో ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో తెలుగు, మరాఠీ, కన్నడ, ఉర్దూభాషలు వ్యవహారంలో ఉండేవి. పూర్వం నైజాం పాలనకాలంలో ఉర్దూ అధికారభాష. అందువల్ల పాలన, బోధనాది రంగాలలో తెలుగు వెనకబడింది.. ఆంగ్లేయుల పాలనలో ఆంగ్లం అధికార భాషగా బోధనభాషగా ఉండటంవల్ల దేశ భాషలకంటే అధికంగా అది ప్రాచుర్యం పొందింది. దేశ భాష అయిన తెలుగు వెనకబడింది. ఉపాధి సముపార్జన ఆంగ్ల మాధ్యమంలో చదివినవారికే పరిమితం. తెలుగు మాధ్యమంలో చదివినవారికి ఉద్యోగ భద్రత లేదు. దీనివల్ల బోధనలోగానీ పాలనలోగానీ ఆశించినంతగా తెలుగు వ్యవహారంలో లేదు. దేశంలోని చాలా రాష్ట్రాలలో హిందీని తృతీయభాషగా ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో వారానికి మూడు గంటలు హిందీకి కేటాయించారు. అంటే కొఠారి కమీషను సూచనల ప్రకారం హిందీయేతర రాష్ట్రాల విద్యా విధానం, భాషావిధానం, ఆచరణలలో భాగంగా త్రిభాషా సూత్రం జాతీయ స్ఫూర్తిని కలిగిస్తుంది. ఇతర ప్రాంతాలతో సంబంధ బాంధవ్యాలు కలిగేలా చేస్తుంది. అనువాదాలను, మాతృభాషా ప్రాధాన్యాన్నీ ప్రోత్సహిస్తుంది. తద్వారా అంతర్జాతీయ అవగాహన కలుగుతుంది.

దీనితోపాటు ఉన్నత విద్యాస్థాయిలో కూడా విద్యా బోధన ప్రాంతీయ భాషల్లోనే జరగాలని సిఫారసు చేసిన మొట్టమొదటి నిపుణుల కమిటీ డా. రాధాకృష్ణన్ కమిషన్ (క్రీ.శ.1948). దీనికి మద్దతుగా కాశ్మీర్, నాగాలాండ్ లలో ఆంగ్లభాషా మాధ్యమం విఫలమయ్యిందని విద్యావేత్త శ్రీ.ఎం.వి. రాజగోపాల్ గారు పేర్కొన్నారు. ఇవన్నీ మాతృభాషా మాధ్యమం లేకపోవడం వల్ల కలిగే అనర్థాలు.

మనోవైజ్ఞానికంగా చూస్తే –అజ్ఞాత విషయాన్ని అపరిచిత మాధ్యమం ద్వారా సాధించటం అవాంఛనీయం. అందుకే కొఠారి కమిషన్ కూడా మాతృభాషా ప్రాధాన్యాన్ని ఉద్ఘాటిస్తోంది.

5.1.1.3 కొఠారీ కమిషను

త్రిభాషా సూత్రం జాతీయ సమగ్రతనూ, సమైక్యతనూ ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. భారతీయ మాతృ భాషల అభ్యసనాన్ని ప్రోత్సహిస్తూ నూతన విద్యావిధానంలో భాగంగా భారతదేశ ప్రభుత్వం 1964లో జాతీయ విధానాన్ని అమలుచేయడానికి డా. కొఠారీ అధ్యక్షతన ఒక కమిటీని వేసింది.

హిందీ వ్యవహృత రాష్ట్రాలలోని పిల్లలు హిందీ, ఆంగ్లం, మరి ఏదైనా ఒక ప్రాంతీయ భాషను ఎంపిక చేసుకోవాలి. తక్కిన రాష్ట్రాల్లోని పిల్లలు తమ ప్రాంతీయభాషనూ, హిందీనీ, ఆంగ్ల భాషలను ఎంచుకోవాలి. అయితే ఈ విధానం ఆంధ్రప్రదేశ్ ఇంకా మరికొన్ని రాష్ట్రాలలో మాత్రమే అమలులో ఉంది. హిందీ వ్యవహృత రాష్ట్రాలలో ఈ విధానం నీరుగారిపోయింది. తమిళనాడులో కూడా దీనిపట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడడంతో అక్కడా ద్విభాషా విధానాన్నే ఎంచుకోవలసివచ్చింది. ఇలా రాష్ట్రాలలో త్రిభాషా సూత్రం అమలు చేయాలన్న కేంద్రప్రభుత్వ సంకల్పం చాలావరకూ నీరు గారిపోయిందనే చెప్పాలి.

5.1.1.4. విద్యా పరిశోధన శిక్షణా మండలి (పాఠశాల విద్యా పాఠ్యాంశ కార్యాచరణ ప్రణాళిక):

ఈ సంస్థ1999లో దేశవ్యాప్తంగా బహిరంగ చర్చ కోసం ఒక చర్చా నివేదిక విడుదల చేసింది. ఈ చర్చ ఎక్కువగా " ప్రచ్ఛన్న రాజకీయ నియమావళి " చుట్టూ ఉన్న భాషా బోధన సంబంధిత సమస్యలపై కేంద్రీకృతం కావడంవల్ల అంత పెద్దగా ఆకర్షించలేకపోయింది. విద్యా పరిశోధన శిక్షణా మండలి 1999 నివేదికను సరిదిద్ది డిసెంబర్ 2000 లో మరో నివేదికను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలకు అలాగే కేంద్రపాలిత ప్రాంతాలకూ రాబోయే దశాబ్దంలో అనుసరించవలసిన పాఠశాల విద్యా పాఠ్యాంశ కార్యాచరణ ప్రణాళిక అది. ఈ నివేదికలో ఉన్న మార్గదర్శక సూత్రాలను కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని విద్యా

సంస్థలు అనుసరిస్తాయి, ఇప్పటికే త్రిభాషా సూత్రం వర్తిస్తోంది కాబట్టి తగిన విధంగా దీన్ని అమలు చేసే ప్రయత్నాలు మరింత తీవ్రతరం చేయాలని ఈ నివేదిక సారాంశం.

5.1.1.5. పాఠ్యాంశ ప్రణాళికలో భాషల వ్యాప్తి – వినియోగం

పాఠశాల పాఠ్య ప్రణాళికలో ప్రతిపాదించిన భాషాసమితులు – వినియోగం

ప్రాథమిక విద్య – I – Vతరగతులు :

I – II ఒక భాష : మాతృభాష / ప్రాంతీయ భాష

III – V మాతృభాష / ప్రాంతీయ భాష

ప్రాథమికోన్నత విద్య– VI –VIII తరగతులు :

VI –VIII మూడు భాషలు :

1. మాతృభాష / ప్రాంతీయ భాష (లేక హిందీ ప్రాంతాలలో హిందీ).
2. ఆధునిక భారతీయ భాష (హిందీయేతర ప్రాంతాలలో హిందీ).
3. అంతర్జాతీయభాష (ఆంగ్లం).

సెకండరీ (ఉన్నత పాఠశాల) విద్య :

సెకండరీ (ఉన్నత పాఠశాల) విద్య – IX, X తరగతులు :

IX – X మూడు భాషలు :

1. మాతృభాష / ప్రాంతీయ భాష (లేక హిందీ ప్రాంతాలలో హిందీ).
2. ఆధునిక భారతీయ భాష (హిందీయేతర ప్రాంతాలోలో హిందీ).
3. అంతర్జాతీయభాష (ఆంగ్లం).

హైయర్ సెకండరీ (రెండవ ఉన్నత పాఠశాల) విద్య XI, XII తరగతులు

XI, XII రెండు భాషలు

1. మాతృభాష లేదా ప్రాంతీయ భాష
2. ఆంగ్లం

ఈ భాషా యోజన వ్యవస్థ నిజానికి కొత్తది కాదు. అనేక సిఫారసుల మీదట అంతకుముందు అవకాశం కల్పించినదే.

సంస్కృత భాషా అధ్యయనం :

సంస్కృతభాషాధ్యయనానికి అవకాశమూ ప్రోత్సాహమూ అందించాలి. ప్రాథమిక లేదా ప్రాథమికోన్నత విద్యలో తగిన స్థాయిలో హిందీ, మాతృభాషలైన ప్రాంతీయ భాషలతో కలిపి ఒక మిశ్రమ పాఠ్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టవచ్చు.

సంస్కృతాన్ని సెకండరీ (ఉన్నత పాఠశాల) విద్యాస్థాయిలో అధ్యయనం చేయాలనుకునే విద్యార్థులకోసం ఒక అదనపు ఐచ్ఛికంగానూ హైయర్ సెకండరీ (రెండవ ఉన్నత పాఠశాల) దశలోనూ తగిన ఐచ్ఛికాంశంగా అందించవచ్చు.

విదేశీ భాషల అధ్యయనం :

ఆదరణ ఉండి, తగిన మౌలిక ఉపకరణాలతో బోధనావకాశం ఉన్న చైనీసు, జాపనీసు, రష్యను, ఫ్రెంచి, జర్మను, అరబ్బీ, పారశీకం, స్పానిషు మొదలైన భాషలను సెకండరీ (ఉన్నత పాఠశాల) విద్యాస్థాయిలో అదనపు ఐచ్ఛికాలుగా అందించవచ్చు.

బోధన మాధ్యమం :

పాఠశాల విద్యలోని అన్ని దశలలోనూ మాతృభాష మాధ్యమంగా ఉండాలి. ఒకవేళ భాషావ్యవహర్తలకు మాతృభాష/ప్రాంతీయ భాష ఒకటే అయితే అదే భాష, ప్రాథమికవిద్య పూర్తి అయ్యేవరకూ అన్ని స్థాయిలలోలనూ మాధ్యమంగా ఉంటుంది. మాతృభాష, ప్రాంతీయ భాష ఒకటి కాని వ్యవహర్తల విషయంలో ప్రాంతీయ భాషను మూడవ తరగతి నుండీ బోధనా మాధ్యమంగా స్వీకరించవచ్చు.

చర్చ :

జాతీయ విద్యా విధాన ప్రణాళిక 1968, విద్యా విధాన ప్రణాళిక 1986, త్రిభాషాసూత్రం అమలు కోసం విద్యావిధానంపై పునరుద్ఘాటిస్తూ 1992లో భారత పార్లమెంటు చేసిన కార్యాచరణ ప్రణాళికా ఇవన్నీ అక్షరాలా చిత్తశుద్ధితో అమలులోకి రావాలి. కనీసం ప్రాథమిక విద్యాస్థాయిలోనైనా మాధ్యమంగా మాతృభాష ఉండాలి.

పాఠశాల ప్రక్రియలో మరిన్ని భాషలు నేర్చుకోవడం విద్యార్థికి భారం కాకుండా చూడటమే సరైన పద్ధతి. భాషా శాస్త్రవేత్తలూ, విద్యావేత్తలూ రాజకీయవేత్తలూ తరచుగా విద్యార్థులకు మాతృభాషా మాధ్యమమే తగినదని చెప్తుంటారు. అలాకాదని ఆంగ్లమాధ్యమం ద్వారా చదివితే ఆంగ్లం బాగా వస్తుందని కొందరు చెప్తుంటారు. కానీ అది అసంబద్ధం. ఈ విధానం జాతీయస్ఫూర్తికీ మానవతావిలువలకూ విరుద్ధం. అసలు ఎవరికీ మాతృభాషకాని ఆంగ్లమాధ్యమం ఎవరికోసం? ఎందుకోసం? దీనికి కొందరు చెప్పే జవాబు ఉద్యోగభద్రత. భారతదేశం లోపలా భారతదేశం బయటా ఉద్యోగాలకోసం భారతీయభాషలను వాడే పద్ధతికి తగిన విద్యావిధానం భారతదేశంలో లేదు. దీనికి చైనా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ వంటి ఆంగ్లేతర భాషలు మాట్లాడే దేశాలే తార్కాణాలు. ఉదాహరణకు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో రెండు భాషలలో ఒకటిగా కన్నడ (ప్రాంతీయ భాష) భాషను పరిచయం చేసింది. ఆ స్థాయిలో మార్గదర్శకాలుగా మూడు భాషలు ఉన్నాయి. అవి,

మాతృభాష / ప్రాంతీయ భాష, ఒక ఆధునిక భారతీయ భాష మరియు విధిగా ఆంగ్లం. మూడు భాషలు బోధించడం ప్రాథమిక విద్యావిధానంలో సర్వసాధారణం. ప్రాంతీయభాషా మాతృభాషా ఒకటి కాని విద్యార్థులు తమ మాతృభాషను ఎంచుకుంటే గనక తమ రాష్ట్ర అధికార భాషనే ప్రాంతీయభాష లేక ఆధునిక భారతీయ భాషల విభాగంలో ఏదో ఒక దానిలో విధిగా స్వీకరించాలనే నియమం రాష్ట్రప్రభుత్వమే విధించవచ్చు.

కన్నడ మాతృభాషగా కలవారు, కన్నడం మాతృభాష కాకపోయినా కర్ణాటక రాష్ట్రంలో నివసించేవారు అందరూ తప్పనిసరిగా త్రిభాషాసూత్రంలో భాగంగా కన్నడభాషను చదవాలని కర్ణాటకప్రభుత్వం నియమం పెట్టింది. అందుకు కావలసిన ఉత్తర్వులను జారీ చేసింది. ప్రాథమికోన్నత, సెకండరీ విద్యాస్థాయిలలో అన్నిపాఠశాలలు దీన్ని పాటించాలి.

పరోక్షంగా జీవవిధ్వంసానికి కారణమయ్యే భాషా విధానాల పట్ల న్యాయస్థానాలూ చట్టసభలూ పునరాలోచన చేయాలి. జీవవిధ్వంసాన్ని అరికట్టేందుకు మాతృభాషామాధ్యమం తప్పనిసరి చేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి.

సూచనలు:

1. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పోరేట్ పాఠశాలల్లో కూడా అన్ని స్థాయిల్లో పదో తరగతి వరకు తెలుగు మాధ్యమం తప్పనిసరిగా ఉండాలి.
2. మొదట మాతృభాషలో చదవడం రాయడం నేర్చుకున్న విద్యార్థికి పాఠశాల విద్యాభ్యాసంలో ఉత్తీర్ణత మెరుగ్గా ఉంటుంది. అలాగే ద్వితీయ భాషాధ్యయనం సులభతరం ఔతుంది. ప్రాథమిక స్థాయిలో శాస్త్రీయ, ఆధునిక పద్ధతుల ద్వారా భాషను బోధించేలా చూడాలి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతవిద్యా స్థాయిలలో భాషా సాంకేతికతలు వినియోగించే వీలు కల్పించాలి.
3. అన్ని విద్యా విభాగాలలో తెలుగును ఒక భాషగా బోధించే విధానం ఉండాలి.
4. వృత్తి/సాంకేతిక/ తంత్ర విద్యా కళాశాలలలోనూ, భాషాధ్యయనం, పరిశోధనలకు అవకాశం కల్పించాలి.
5. నియత, అనియత, వయోజన, పాఠశాలేతర విద్యాబోధనలలోనూ, కళారంగాలలోనూ భాషకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, మాతృభాషానైపుణ్యాలనూ పెంచుకొనేలా చూడాలి. వీటి వల్ల తెలుగు మాధ్యమంలో చదవడం, తెలుగు చదివినవారికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. దేశప్రగతికి ఇది దోహదం చేస్తుంది.

ఇటీవల భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం ఎవరికి నచ్చిన మాధ్యమంలో వాళ్ళు చదువుకోవడానికి రాజ్యాంగం కల్పించిన హక్కును ఉట్టంకిస్తూ ఒక తీర్పు చెప్పింది. అది నిజమే. కానీ దానివల్ల దేశ భాషలన్నీ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అది ప్రస్తుతం వ్యక్తిస్వేచ్ఛనూ హక్కునూ పరిరక్షిస్తున్నట్లు ఉన్నా కొద్దికాలంలోనే ప్రాంతీయభాషల విధ్వంసానికి దారితీసేటట్లుగా ఉంది.

5.2 పాలనా రంగంలో భాషా విధానం

ప్రజాస్వామ్య మనుగడనూ పరిరక్షణనూ పటిష్ట పరిచేవిధంగా భాషావిధానం ఉండాలి (భాషాదృక్పథంలోని ప్రథమసోపానంలో చెప్పుకున్న విధంగా). సామాన్యప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వారి నిత్యజీవితంలోని అవసరాలను తీర్చేవిధంగా ఉండాలి.

నియమాలు:

1. ప్రజల భాషలో పరిపాలన ప్రజల కనీస హక్కు.
2. గ్రామస్థాయి నుంచి సచివాలయ స్థాయి వరకు అన్ని పాలనా విభాగాలలో తెలుగు వాడకం విధిగా జరగాలి.
3. సమస్త ప్రజా సంబంధాలలో తెలుగు అనుసంధాన భాషగా ఉండాలి. ప్రజలకూ ప్రభుత్వానికీ సంబంధించి వ్యవహారమంతా తెలుగులోనే నడవాలి.
4. తెలుగు రాష్ట్రాల మధ్య తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నడపాలి.
5. చట్టాలు అన్నీ తెలుగులోనే తయారు కావాలి.

ప్రాతిపదిక:

భారత రాజ్యాంగం 345–350 అధికరణాలలో దేశంలోనూ రాష్ట్రాలలోనూ అనుసరించదగిన భాషావిధానంపై కొన్ని మౌలికసూచనలు చేసింది. రాష్ట్రప్రభుత్వం చేతా పౌరులందరిచేతా తమ సొంత ఆధికారిక భాషా విధానవ్యాప్తిని అమలు చేయడానికి రాష్ట్రానికి ఇది ఒక అవకాశం కల్పిస్తోంది. దీనివల్ల పాలన వ్యవహారాలలో అధికార భాషావిధానాన్ని కచ్చితంగా అమలుచేయడానికి రాష్ట్రానికి ఇదో అవకాశం కల్పిస్తోంది.

5.2.1. దేశంలో భాషావిధానం

భారతదేశంలో వివిధ ప్రాంతాల ప్రజలు అనేక భాషలు మాట్లాడతారు. వీటిలో కనీసం 800 భాషలు, 2000 వరకూ మాండలికాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పాలనావ్యవహారాలకు హిందీ లేక ఆంగ్ల భాషలను వాడవచ్చని భారత రాజ్యాంగం నిర్దేశించింది. రాష్ట్రాలు తమతమ అధికార భాషలను వాడుతూ కేంద్ర ప్రభుత్వంతో సంపర్కించేందుకు హిందీ లేక ఆంగ్లం వాడవచ్చు. హిందీ, ఆంగ్లాలతో కలిపి భారత్ లో

24 అధికార భాషలు ఉన్నాయి. అధికార భాషా కమిషను వద్ద ఈ భాషలకు ప్రాతినిధ్యం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో అభ్యర్థులు పై భాషల్లో దేనిలోనైనా సమాధానాలు రాయవచ్చు.

భారత రాజ్యాంగం లోని 343 వ అధికరణం దేవనాగరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. 1950 లో రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా 1965 లో యూనియన్ అధికార భాష హోదా ఆంగ్లం నుంచి హిందీకి మారింది. హిందీని పూర్తి స్థాయిలో అమలుపరచాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే, హిందీయేతర దక్షిణాది రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకించడంతో జంట అధికార భాషల పద్ధతి ఇంకా కొనసాగుతూ వస్తోంది. శీఘ్ర పారిశ్రామికీకరణ, ఆర్థిక వ్యవస్థపై బహుళజాతి సంస్థల ప్రభావం మొదలైన కారణాలవల్ల ప్రభుత్వంలోనూ, బయటా కూడా దైనందిన కార్యకలాపాల్లో ఆంగ్ల ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. దాన్ని తొలగించాలన్న ప్రతిపాదనలు అటకెక్కక తప్పలేదు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో చేసే భాషా వ్యవహారం ఈ కింది విధంగా ఉంటుంది:

1. **హిందీ:** హిందీయేతర రాష్ట్రాలతో వ్యవహరించేటపుడు హిందీ భాషను వాడుతుంది. అరుణాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, చండీగడ్, చత్తీస్ గడ్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, రాష్ట్రాల్లో కూడా హిందీ యే అధికార భాష.

2. **ఆంగ్లం:** ఇతర రాష్ట్రాలతో వ్యవహరించేటపుడు కేంద్రం ఆంగ్లాన్ని వాడుతుంది. లోక సభ, రాజ్యసభలు రెండింటిలోనూ ఆంగ్లమూ హిందీ రెండూ వాడుకోవచ్చు. ఈ రెండు భాషలలోనూ వ్యక్తం చేయలేని పక్షంలో మాతృభాషకు అనుమతి ఉంది (రాజ్యాంగ ప్రకరణం 20). హిందీ భాషను వ్యాప్తి చేయడం, ఆంగ్ల వినియోగాన్ని తగ్గించడం (రాజ్యాంగ ప్రకరణం 344) స్థూల ఉద్దేశ్యం. (ఈ మధ్యనే భారతీయ సార్వజనీన సేవా మండలిలో హిందీ, ఆంగ్లేతర భాషల మాధ్యమాలకు సంబంధించిన పరీక్షలను కేంద్రం తీసివేయడానికి సిద్ధపడింది. అందుకు వ్యతిరేకంగా హిందీయేతర భాషలవారు ఉద్యమించడంతో కేంద్రం విరమించుకుంది).

5.2.2 రాష్ట్రంలో భాషావిధానం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాష (తెలుగు) ఆధికారిక పత్రాల రచనలపై శ్వేతపత్రం విడుదల చేసింది(1965). ఈ శ్వేతపత్రం పరిపాలనావసరాల నిమిత్తం ఆయా కాలాలలో తెలుగు భాష ఉపయోగాన్ని గురించిన చరిత్రను కూడా పట్టిక రూపంలో ఇచ్చింది.

సుమారు వెయ్యి సంవత్సరాలు అంటే తూర్పు చాళుక్యుల పరిపాలన ప్రారంభమైన క్రీ.శ. 650 నుండి విజయనగర సామ్రాజ్యం అంతమైన 17 వ శతాబ్దం వరకు తెలుగు ఆధికారిక భాషాగానే ఉంది అని చెప్పవచ్చు. పరిపాలన అవసరాల నిమిత్తమై ఆయా కాలాల్లో తెలుగు భాష ఉపయోగాన్ని గురించిన చరిత్రను ఈ శ్వేతపత్రం సంగ్రహంగా తెలియజేస్తుంది. దీనిని 1968లో ప్రచురించారు.

భారతదేశ భాషల జాబితా రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో చేర్చబడింది (చూ. 345 నుంచి 348 ప్రకరణాలు, అనుబంధం 1). రాష్ట్రప్రభుత్వానికి చెందిన అధికార కార్యకలాపాలకు ఈ భాషలలో వేటినైనా స్వీకరించవచ్చు. అందువల్ల వివిధ స్థాయిలలో ప్రభుత్వ పరిపాలన తెలుగులో సాగించడానికి అంధ్రప్రదేశ్ విధాన సభ 1955 సెప్టెంబర్ 29 న ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

అంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగును అధికార భాషగా స్వీకరించాలి అనే అభ్యర్థన పెరిగింది. అందువల్ల ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులో సాగించే విషయంలో ఎదుర్కొనే సమస్యలను అధ్యయనం చేయడానికి 1959 లో ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని నియమించింది. మొదట, తాలూకా దాని కన్నా దిగువ స్థాయిలో తెలుగును ప్రవేశపెట్టాలనీ, తెలుగును పరిపాలన భాషగా ప్రవేశపెట్టడంలో తోడ్పడే యంత్ర పరికరాలనూ, పారిభాషిక పదావళినీ సమకూర్చుకోవాలనీ ఆ అధికారి సూచించారు. ప్రజలతో నిత్యసంబంధం ఉండే 27 శాఖలలో తాలూకా దానికింది స్థాయిలలో తెలుగును ఉత్తర ప్రత్యుత్తరాలకు వినియోగించాలనీ ప్రభుత్వం 1960లో ఉత్తర్వులు ఇచ్చింది. దానిని మరో 4 శాఖలకు విస్తరిస్తూ మరుసటి సంవత్సరం 1961లో మరో ఉత్తర్వు జారీచేసింది. అధికార కార్యకలాపాలలో సాధరణంగా వాడే ముసాయిదాలు వాటి తెలుగు పాఠాలుగల పుస్తకాలు 1962లో ప్రచురించి ఆ శాఖలన్నింటికీ అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో తెలుగు రాని ఉద్యోగులు ఉండటంతో 1960 నుంచే వారికి శిక్షణ ఏర్పాటు చేశారు. చివరకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషాచట్టం (1966) ఈ రాష్ట్రానికి తెలుగును అధికార భాషగా ప్రకటించింది.

రాజ్యాంగంలో హిందీ ఆంగ్లం రెండింటికీ ప్రాధాన్యం ఉంది. పార్లమెంటరీ వ్యవహారాలు, న్యాయవ్యవస్థ, కేంద్రప్రభ్యుత్వ సంస్థల మధ్య కార్యకలాపాలు, ఆధికారిక కార్యకలాపాలు ఆంగ్లంలోనూ, జాతీయ అధికార భాష అయిన హిందీలోనూ జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు, మెమొరాండాలు, లోక సభ, రాజ్యసభ వ్యవహారాలు, ఎక్కువగా ఆంగ్లంలోనే జరుగుతుంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర లేఖలు, ప్రకటనలు, సవరణలు ఆంగ్లంలోనూ అలాగే హిందీ భాషలోనూ జరుగుతుంటాయి.

తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాలు లాంటి రాష్ట్రాలు ప్రాంతీయ భాషలకు అధిక ప్రాధ్యాన్యం ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రకటనలు, ఉత్తర్వులు మొదలైన కార్యకలాపాలన్నీ ఆంగ్లంలోనే జరుగుతున్నాయి. అన్ని పాలనా వ్యవహారాలలోనూ తెలుగును తప్పనిసరిగా వాడాలనే నియమం ఉన్నప్పటికీ తెలుగు వాడకం అంతంత మాత్రమే. ప్రభుత్వంలో ఉన్న వివిధ రంగాలకు సంబంధించిన ఆంగ్లపదాలకు సరైన తెలుగు పదాలు తెలియక పోవటం అనేది ఎప్పటికీ ఒక కారణం కాదు. ప్రభుత్వ నేతలూ అధికారుల అలసత్వమే దీనికి ప్రాథమిక కారణం. కొన్ని కోట్లమంది ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేసినట్లే.

అంధ్ర ప్రదేశ్ 1951 లో, ఒడిశా 1954లో, తమిళనాడు 1956లో, అస్సాం లో 1960, గుజరాత్ 1961 లో, కర్ణాటక 1962 లో, మహారాష్ట్ర 1965లో అధికార భాషా చట్టాలు చేశాయి. అంధ్ర ప్రదేశ్ 1966లో అధికార భాషాచట్టం చేసింది. అందులోని ఏడవ విభాగంలో రాష్ట్ర అధికార భాష తెలుగు అని స్పష్టంగా పేర్కొంది. అందులోనే ఇతర భాషల వాడుక గురించి పేర్కొంది.

1988 అక్టోబర్ 2 న అంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషగా తెలుగు వాడకం పై ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ఇది.

1988 నవంబరు 1 నుండి రాష్ట్ర పరిపాలనలో అన్ని స్థాయిలలోనూ ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలి, వాటికి ఇంగ్లీషు వాడకూడదు. ఇంగ్లీషు భారత ప్రభుత్వం లేక ఇతర ప్రభుత్వాలతో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలకు మాత్రమే పరిమితం.

ఏ తెలుగు వాడాలి? ఏ మాండలికం వాడాలి? అనే ప్రశ్నలకు సమాధానం, అధికారికి వచ్చిన నచ్చిన తెలుగు వాడాలి. ఈ ఆధునిక సాంకేతిక సమాజంలో ఏ తెలుగు వాడాలా అనే ప్రశ్న అసందర్భం. అనవసరం. సంగణక ఉపకరణాల ద్వారా ఒక మాండలికంలో ఉన్న తెలుగును మరో మాండలికంలోనికి కోరినవిధంగా మార్చుకోవచ్చు. అలా మార్చుకోవడం మాండలిక పరివర్తనాల వల్ల సాధ్యం.

సూచనలు :

ప్రభుత్వ శాఖలలో తెలుగు వాడకానికి ఆరు సూత్రాలు, అవి :

1. తెలుగు వాడకమే ప్రజా స్వామ్య ఉనికికి గీటురాయి.
2. ఏ తెలుగు రాయాలి, ఎలాంటి తెలుగు రాయాలి అనే సందిగ్ధతకు తావులేదు. సామాన్య ప్రజలకు అర్థం కావడమే పరిపాలన భాష పరమ ప్రయోజనం.

3. ఒకరి తెలుగును మరొకరు గౌరవించాలి. రాతకోతలలో సైతం మాండలికం, గ్రామీణ తెలుగు భాషా శైలి తళుకులీనవచ్చు. శైలీభైదాలూ మాండలికమిశ్రమాలూ వాడవచ్చు.

4. తెలుగుపదం తట్టనప్పుడు ఆంగ్ల పదాలను తెలుగు లిపిలో రాయాలి. ఆంగ్లానికి సరైన తెలుగు మాట లభ్యం కానప్పుడుగానీ దానికి సరైన తెలుగు మాట కల్పించినప్పుడుగానీ ఆ ఆంగ్లం మాటను కుండలీకరణాలలో చూపించాలి.

5. ప్రభుత్వ విభాగాలన్నింటా తెలుగులో పరిపాలనా భాషావ్యాసంగానికి సంబంధించి ఉపకరణాల వాడకాన్ని పెంచాలి.

5.3 సమాచార ప్రసార రంగాలలో భాషా విధానం

ఆధునికయుగంలో అత్యంత కీలకమైనదీ ప్రభావశీలమైనదీ సమాచార ప్రసార రంగం. ఇది ప్రజలకూ పాలకులకూ మధ్య వారధి లాంటిది. ఈ రంగంలో భాషావిధానం భాషావికాసానికి ఇతోధిక సహకారాన్ని అందిస్తుంది.

నియమాలు:

1. ప్రసార మాధ్యమాలలో ప్రజల భాష ఉండాలి.
2. అవి అన్ని ప్రసారమాధ్యమాలవారికీ అందుబాటులో ఉండాలి.
3. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని ప్రసారమాధ్యమాలు విధిగా తెలుగు/ప్రజల భాషే వాడాలి.
4. ప్రైవేటురంగాలప్రసారమాధ్యమాలు ప్రభుత్వనిధులనుగానీ, ప్రభుత్వప్రకటనలనుగానీ పొందాలంటే ప్రజలభాషనే వాడాలన్న నియమం ఉండాలి.
5. యూనికోడ్ వినియోగించేవారికి ప్రభుత్వనిధులను, ప్రభుత్వప్రకటనలను పొందడానికి అర్హులుగా పరిగణించాలి.

ప్రాతిపదిక :

తొలినాళ్ళలో పత్రికలు, రేడియో, చలనచిత్రాలు, టీవి, ప్రసారమాధ్యమాలుగా ప్రముఖ పాత్ర వహించాయి ఆధునికంగా పెరిగిన సాంకేతికాభివృద్ధిలో భాగంగా సంగణకాలు, ఈమెయిళ్ళు, అంతర్జాల సేవలు, పొట్టిసందేశాలు మొదలైన వాటివల్ల ప్రసారమాధ్యమాల ప్రాధాన్యం పెరిగింది. అందువల్ల సాంకేతిక విజ్ఞానమే లక్ష్యంగా దూసుకు పోతున్న సమాజంలో సమాచార సృష్టితో పాటు సమాచార ప్రసార వినిమయాలకు విశేష ప్రాధాన్యం ఉంది. పూర్వం రేడియో, తంతి తరువాత టీవీ, ఫోను,

ఇప్పుడు సెల్ ఫోను, అంతర్జాలం వచ్చాయి. కంప్యూటరుతో పాటు అంతర్జాల విస్తృతి పెరగడంవల్ల సాంకేతిక, విద్యారంగాలతో పాటు జీవ, ఖగోళ, భౌతిక, నృశాస్త్ర, సామాజిక, తత్వశాస్త్రాలు, సాహిత్యం మొదలైన అన్ని రంగాల్లో మౌలికమైన మార్పులు వచ్చాయి.

సాధారణంగా కంప్యూటరు, దాన్ని ఆధారంగా చేసుకున్న 'అంతర్జాలం' – జ్ఞాన వినిమయ వ్యాప్తికీ తద్వారా జ్ఞాన సృజనకూ వీలు కలిగిస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు అభివృద్ధి చెందిన దేశాలను చేరుకోవడానికి సమాచార సాంకేతికత ఓ సాధనం. ఇది జ్ఞానాధిక్యం లోనే కాదు, సాంకేతిక వైవిధ్యంలోనూ ఎన్నడూ లేనంత గుర్తింపు పొందింది. దీనిని వివిధ ప్రాయోజక సేవలకి సంబంధించిన ఏ అంశానికైనా అనువర్తింప చేయవచ్చు. అంతర్జాలానికి అనుసంధించిన కంప్యూటర్లు ఎటువంటి జ్ఞానాన్నయినా వాడుకకు వీలుగా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. కంప్యూటర్లూ అంతర్జాలమూ ప్రజల అవసరాలను తీర్చేదిశలో దిశానిర్దేశం చేస్తున్నాయి. కంప్యూటరీకరణలో భారతీయ భాషలు ప్రవేశించాయి. దానితో జాతీయ బహుళ భాషల, బహుళ మాధ్యమాల కంప్యూటరీకరణ ఆధునిక అవసరంగా మారిపోయింది.

శాస్త్ర సాంకేతిక విద్య, వాణిజ్యాది రంగాలలో కలిగిన మార్పులు భాషకు దిశానిర్దేశం చేస్తున్నాయి. సమాచార విప్లవానికి వాహికలుగా ప్రసారమాధ్యమాలు నేటి తెలుగుపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతున్నాయి. అలాగే శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధీ, విదేశీ విద్య, సంస్కృతి, జీవనవిధానం, వాణిజ్యం, మొదలైన రంగాలలో ప్రసారమాధ్యమాలు తెలుగు భాష మీద అధిక ప్రభావం చూపుతున్నాయి.

5.3.1 భారతదేశంలో భాషావిధానం

భారతదేశంలో తొలినాళ్ళ నుంచీ సమాచార ప్రసార రంగాలలో భాషాపరంగా దేశభాషల విషయంలో చెప్పుకోదగ్గ ప్రాధాన్యం కనిపించదు. సమాచార ప్రసార రంగాలలో ఆధునికంగా పెద్ద విప్లవమే వచ్చింది. అయితే ఇది భారతదేశంలో గత 63 ఏళ్ల కాలంలో సాధించిన ప్రగతి కంటే ఇటీవలి 15 ఏళ్ల కాలంలో సాధించిన పురోగతి ఎక్కువ. శాస్త్ర సాంకేతిక విద్య, వాణిజ్యాది రంగాలలో కలిగిన మార్పులు భాషపై ప్రభావం చూపుతున్నాయి. సమాచారవిప్లవ వాహికలయిన ప్రసారమాధ్యమాలు ప్రాంతీయభాషలపై విపరీతమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. దీనివల్ల ప్రాంతీయభాషలలోని ప్రత్యేక లక్షణాలు క్రమంగా తగ్గిపోతాయి. అందుకే ప్రసారమాధ్యమాలు మాండలిక పదాలను వ్యాప్తిలోకి తేవాలి. ఆకృషి పత్రికలలో జరగలేదు. నేడు కేవలం రాజకీయవార్తలే కాక శాస్త్ర సాంకేతిక రంగాల విషయాలు కూడా పత్రికలలో వస్తున్నాయి. కాబట్టి ఇలాంటి వార్తలు, ప్రపంచవార్తలు రాసేటప్పుడు సమానార్థకపదాలను సృష్టించుకోవలసిన అవసరం ఎంతో

ఉంది. ఆ కృషీ పెద్దగా జరగలేదు. ఒక ఉదాహరణ చూడండి. సోవియట్ యూనియన్లో గోర్బచెవ్ సంస్కరణలు చేసినప్పుడు ఆ వార్తలు మన పత్రికలలోనూ వచ్చాయి. అవి 1. గ్లాస్ నోస్త్, 2. పెరిస్త్రోయికా. ఈ రెండుమాటలూ రష్యన్ పదాలు. వీటిని మనపత్రికలు యథాతథంగా వాడాయి. అలాకాకుండా 1. గోప్యరాహిత్యం లేదా దాపులేమి 2. పునర్వ్యవస్థీకరణ అని కొత్తపదాలను కల్పించి ఉంటే ప్రాంతీయ సాధారణ పాఠకులకు కూడా అర్థమయ్యేవి.

ప్రసారమాధ్యమాలలో అవసరం లేకున్నా ఆంగ్లపదాల వాడకం పెరిగింది. ఆంగ్లభాషా ప్రాచుర్యం అత్యంత ప్రభావం చూపిన తొలినాళ్ళలో సమానార్థక పదనిర్మాణానికి ప్రాంతీయభాషలలోని పత్రికా రచయితలు కొన్ని విధానాలను రూపొందించారు. కాని అది ఆచరణలో మృగ్యం. మదరాసు ఆకాశవాణిలో ప్రతిరోజూ కొత్త పారిభాషిక పదాలను గురించిన ఒక కార్యక్రమం జరిగేది. కిందటిరోజు ఆంగ్లపత్రికలో వచ్చిన కొత్త పారిభాషిక పదాలకు తమిళంలో సమానార్థక పదాలను సృష్టించి ప్రసారం చేసేవారు. హిందీలో భా. జ. పా; మా. క. పా. మొదలైన హిందీపొడి అక్షరాలు వాడేవారు. తెలుగులో ఐరాస, ఐకాస అని కొన్నాళ్ళు పత్రికలు వాడాయి. హిందీ, తమిళం, కన్నడం, బెంగాలీ మొదలైన భాషలలోని పత్రికలు ఆంగ్లపదాలు చాలా తక్కువ వాడుతున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం జాతీయస్థాయిలో వార్తాపత్రికలు ఆంగ్లభాషలోనే ఎక్కువ. ప్రాంతీయభాషలపట్ల ఆదరణ జాతీయస్థాయి ప్రసారమాధ్యమాలలో ముఖ్యంగా పత్రికలలో కనిపించదు. అయితే జాతీయోద్యమంకోసం ప్రజలను చైతన్య పరచవలసిన అవసరంపై దృష్టి పెట్టిన కారణంగా అన్ని ప్రాంతీయ భాషలలోనూ వార్తాపత్రికలు ప్రారంభమయ్యాయి. వాటిలో భాషావిధానంపై ఒక సార్వజనీనమైన దృక్పథం గానీ ఆచరణ గానీ లేదు. సామాన్యులకు అవి అందుబాటులోనికి రాలేదు. దానికి కారణం ఆయా పత్రికలు తొలినాళ్ళలో గ్రాంథికభాషను వాడడమే. అయితే స్త్రీలకోసం పిల్లలకోసం ప్రత్యేక పత్రికలు రావడం ఆనందించదగ్గ విషయం. ప్రస్తుతం జాతీయస్థాయి అత్యున్నత ప్రమాణాలు కల పత్రికలు అన్ని దేశీయ భాషలలోలనూ వస్తున్నాయి గానీ వాటిలో భాషపై శ్రద్ధ పెద్దగా కనిపించదు. ఆంగ్ల పదప్రయోగాలు వాటిలో అధికంగా ఉంటున్నాయి.

1947నాటికి భారతదేశంలో టెలిఫోన్ అనేది అందరికీ అందుబాటులోలేని పనిముట్టు. లేదు. ఇప్పుడు టెలిఫోన్, పేజర్ల దశ దాటిపోయింది. చరవాణుల విప్లవం దేశవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం భారతదేశంలో 52 కోట్లకు పైగా ప్రజలు చరవాణులను వాడుతున్నారని ఒక అంచనా. ఇంకా 50 కోట్లమందికి కావాల్సి ఉంది. వీటిలో మాతృభాషా వినియోగం కావలసినంత స్థాయిలో ఇప్పటికీ లేదు.

టెలివిజన్లు కూడా నేడు అతిసామాన్యుడికి సైతం అందుబాటులోకి వచ్చాయి. 1995 సంవత్సరం వరకు కేవలం దూరదర్శన్ సంబంధిత ప్రభుత్వ ప్రసార సాధనాలు మాత్రమే సమాచార సాధనాలు. ఇప్పుడు 24 గంటల వార్తా ప్రసారాలు, స్టింగ్ ఆపరేషన్లు, లైవ్ కవరేజీలు గల ప్రయివేటు ఛానళ్ళు రంగప్రవేశం చేశాయి. వీటిలో కచ్చితమైన భాషావిధానంగానీ చిత్తశుద్ధితో కూడిన ఆచరణగానీ కనిపించవు. ఎక్కువగా ఆంగ్లభాషను వినియోగించడమే ఆధునికత అనే చెడుసంకేతాన్ని ఇవి ప్రజలకు అందించడం దురదృష్టకరం.

5.3.2 రాష్ట్రంలో భాషావిధానం

సమాచార సాంకేతిక రంగాలలో ప్రసార వినిమయ వ్యాప్తికీ భారతీయ భాషల అభివృద్ధికీ, వాటి సహజ స్థానాన్ని అందించే ప్రయత్నాలు జరుగుతున్న సంధి కాలంలో మనం ఉన్నాం. కంప్యూటర్లూ *అంతర్జాలం* విశ్వవ్యాపిత విపంచి (www) అక్షరాస్యతని పెంచడానికేగాక, మానవ వనరుల బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగపడుతున్నాయి. ఈ సందర్భంలో వీటిని ప్రజలందరికీ చేరువ చేయాలి. జాతీయ లక్ష్యాలను చేరుకోవడానికి తగినవీ ప్రయోజనకరమైనవీ అయిన సాంకేతిక విజ్ఞాన వీథులుగా వీటిని భావించాలి. ఇవి భాషల మధ్యనున్న సాంకేతికతకు సంబంధించిన సాంఖ్యిక వ్యత్యాసాన్ని (డిజిటల్ డివైడ్) తగ్గించడానికి ఉపయోగపడతాయి.

సమాచారం ఎక్కువమందికి చేరువకావడమే లక్ష్యంగా గల పత్రికలు, రేడియోలూ, చలనచిత్రాలు, టీవి, మొదలైన ప్రసారమాధ్యమాలు ప్రజల వ్యవహారభాషనే వాడాలి. ప్రభుత్వ రేడియోకేంద్రాలలో దూరదర్శన కేంద్రాలలోనూ కేంద్రంనుంచి ప్రసారమయ్యే కార్యక్రమాలు హిందీ ఆంగ్ల భాషలలో ఉంటాయి. ప్రాంతీయ కార్యక్రమాలు మాత్రం ప్రాంతీయ భాషలలో ఉంటాయి. ఈ విధంగా బహుభాషా వ్యవహారానికి వీటిలో అవకాశం ఉంటుంది. అయితే ప్రాంతీయ కార్యక్రమాల రూపకల్పనలో స్థానిక మాండలికాలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా సమాచారం ఎక్కువగా ప్రజలకు చేరువచేయవచ్చు. వీటి శ్రోతలు కూడా ఎక్కువగా గ్రామీణప్రాంతాలకు చెందినవారే. కేంద్రనుంచి ప్రసారమయ్యే కార్యక్రమాలకు అనువాదాలు అందించే వ్యవస్థ కూడా అన్ని ప్రాంతీయకేంద్రాలలో ఉంటే భాషాభివృద్ధి, ఉపాధి కల్పన పెరుగుతుంది. ప్రయివేటు సంస్థలు నడిపే ఎఫ్ ఎమ్ రేడియోలు, టీవీఛానళ్ళు దీనికి భిన్నం. ఇప్పుడు ఇవన్నీ జనబాహుళ్యాన్ని బాగా ఆకర్షిస్తున్నాయి. కాబట్టీ వీటిద్వారా భాషావికాసానికి దోహదంచేసే భాషావిధానాన్ని రూపొందించుకోవాలి. భాషకోసం కృషిచేసే మాధ్యమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించాలి. ప్రజలభాషలలోనే కార్యక్రమాలు విధిగా రూపొందించాలనీ స్థానిక మాండలిక భాషలకు

అందులో ప్రాధాన్యం కల్పించాలనీ వాటికి ప్రసారమాధ్యమాలకు అనుమతులను జారీచేసేటప్పుడు ప్రభుత్వం నిబంధనలను పెట్టాలి. అనుమతులను కొనసాగించేటప్పుడు భాషాపరంగా వాటి పనితీరును సమీక్షించాలి.

కేంద్రప్రభుత్వరంగ సంస్థలు హిందీ, ఆంగ్లం, ప్రాంతీయ భాషలను సందర్భానికి తగినవిధంగా వాడతాయి. పత్రికలయితే సాధారణంగా ఏదైనా ఒక భాషకే పరిమితమై ఉంటాయి. అయితే ప్రాంతీయ వార్తలను ఆయా ప్రాంతాలలో ఉండే స్థానిక విలేకరులే రాస్తారు. దానివల్ల పత్రికలలో కొంత మాండలికపదాల రంగప్రవేశం జరుగుతుంది. మెయిన్ ఎడిషన్లను కూడా మాండలిక భాషలవారీగా ముద్రిస్తూ వాటిలో మాండలిక పదాలకు తగిన ప్రాధాన్య కల్పించాలి. అలాగే చలనచిత్రాలు, టీవీ కార్యక్రమాలు వార్తలను ధారావాహికాలను ప్రత్యేక కార్యక్రమాలను ప్రత్యేకంగా మాండలిక భాషలలోనే రూపొందించుకోవాలి. ప్రసార మాధ్యమా లన్నింటా భాషామారకం (code switching), భాషామేళనం (code mixing) కాస్త అతిగా ఉంటుంది. లేఖనంలో కంటే మౌఖికంలో ఇది ఎక్కువ. సంస్థలు ప్రాంతీయభాషలలోనూ మాండలికాలలోనూ సరైన పదాలు అందుబాటులో ఉన్నప్పుడు ఆ పదాలనే వాడేలా ప్రసారమాధ్యమాలలో భాషావిధానం ఉండాలి. ఇలా చేస్తే భాషాభివృద్ధి, పరిరక్షణ సులభమవుతుంది. ప్రాంతీయభాషా నిపుణులకూ తెలుగు మాధ్యమంలో చదువుకొన్నవారికీ ఉపాధి లభిస్తుంది.

సూచనలు:

1. సాధారణ ప్రజానికానికి ఉపయోగపడేలా సమస్యలకు పరిష్కారాలు తెలుగు లోనే అందించే, చర్చావేదికలూ, సైట్లూ రావాలి.
2. ఎలక్ట్రానిక మాధ్యమం ద్వారా తెలుగులో అంతర్జాతీయ భాషలకు సమాంతరంగా సమస్త విషయాలనూ సృష్టించాలి.
3. సమాచార సాంకేతిక సేవికలు (సర్వర్లు) తెలుగు భాషలో అందుబాటులో ఉండాలి.
4. భాషా సంగణక అంతర్జాల సాంకేతికతలపై దృష్టి సారించి ఈ సాంకేతిక వసతులను తక్కువ ధరలో ప్రజల భాషలలో అందించాలి.
5. కనీసం తెలుగుపత్రికలలో వాడుతున్న ఆంగ్లపదాలను గుర్తించి వాటికి ప్రత్యామ్నాయాలను సూచించే దిశగా ఈ ప్రయత్నం ఉండాలి.
6. సమయానుసారంగా ప్రజలనుండి ఆంగ్లపదాలకు తగిన మాటలను సేకరిస్తే వ్యవహారానికి దగ్గరగా ఉన్న పదాలు వ్యాప్తిలోకి వచ్చే అవకాశం ఏర్పడుతుంది.

7. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగు అధికసంఖ్యాకవర్గ భాషగానూ ఉర్దూ అల్ప సంఖ్యాక వర్గ భాషగానూ ఉంది. ఈ భాషల మధ్య సాంఖ్యికనిఘంటువులు విరివిగా కావాలి. ప్రసార మాధ్యమాలకు ఇవి ఎంతగానో సహకరిస్తాయి.
8. ఇప్పటిదాకా విశ్వసంకేతఖతులలో (Unicode fonts) లేని తెలుగు సాహిత్యాన్ని విశ్వసంకేత ఖతులలోనికి మార్చే మార్పిడి సాధనాలు కావాలి.
9. ఆన్ లైన్ లోనూ ఆఫ్ లైన్ లోనూ విరివిగా నిఘంటువులను వాడుకునే సౌలభ్యాలు కలగాలి.
10. ఎన్ని ఎక్కువ తెలుగు నిఘంటువులు అంతర్జాలికలో చేరితే తెలుగు అంతగా బలపడుతుంది.
11. ఆధునిక అవసరాలకు ధీటుగా తెలుగు భాష తయారు కావాలి.
12. తెలుగు మాధ్యమంలో కంప్యూటర్ చదువులు కూడా రావాలి.
13. విశ్వవ్యాప్తంగా తయారవుతున్న జ్ఞాన సృష్టిని యంత్రానువాదాలతోనూ లిప్యంతరీకరణతోనూ సమాచారప్రసార సాధనాలు తెలుగులో అందించగలగాలి.
14. ముద్రణ మాధ్యమానికి దూరమైన మాండలికాలు ప్రసార అర్హతను పొందాలి. ఆ మేరకు టీవీ మాధ్యమాలు ఆయా ప్రాంతాల ప్రేక్షకులను ఆకర్షించేలా మాండలిక భాషావ్యాప్తిచేయడానికి కృషిచేయాలి.

5.4 న్యాయపాలన రంగంలో భాషా విధానం

ప్రజలకోసం ప్రజలచేత ప్రజాప్రతినిధులు సాగించే పాలనలో న్యాయాన్ని త్వరితంగా పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా అందించగలగడం సుపరిపాలనకు గీటురాయి. ఇది వాస్తవంగా జరగాలంటే ప్రజలభాషలోనే జరగాలి. ఫిర్యాదు స్వీకరణ నుండి ఋజుసేకరణ, వాదాలూ తీర్పులూ అన్నీ ప్రజలభాషలో జరగాలి. జిల్లా న్యాయస్థానంవరకూ పై విధానం అమలులో ఉన్నా ఆచరణలో తక్కువ. హైకోర్టు పరిధిలో ప్రత్యేక అనుమతులతో ప్రజలభాషలో న్యాయ పాలన సాధ్యమే. అయితే కొన్ని ఇబ్బందులను అధిగమించాలి.

నియమాలు:

1. న్యాయస్థానాలలో అన్ని విభాగాలలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అన్నింటిలో తెలుగు ఉండాలి.
2. పిర్యాదుల స్వీకరణా ఋజుసేకరణా, వాదాలూ, తీర్పులూ ప్రజలభాషలోనే జరగాలి.

ప్రజాప్రభుత్వంలో దిగువస్థాయి న్యాయస్థానాలలో న్యాయం దొరకని పైరుడు ఉన్నతన్యాయస్థానాన్ని ఆశ్రయింస్తాడు. అలాంటప్పుడు దేశభాషలో ఫిర్యాదు చేయడం తనకు తెలిసినభాషలోనే వాదోపవాదాలు జరుపుకొని తీర్పు పొందడం, పొందాలని కోరుకోవడం అతడి ప్రాథమిక హక్కు.

5.4.1. భారత దేశ భాషావిధానం

రాజ్యాంగంలోని 17 వ విభాగం, 2 వ అధ్యాయం, 348 వ ప్రకరణం ప్రకారం (చూ. అనుబంధం 1) భారతదేశంలోని న్యాయస్థానాలలో సుప్రీంకోర్టు, హై కోర్టులలో ఆంగ్లం వాడాలని రాజ్యాంగం స్పష్టం చేసింది. ఫిర్యాదితరపు న్యాయవాదులు ఫిర్యాదులను, ఆంగ్లంలోనే సమర్పించాలి. అయితే దిగువ న్యాయస్థానాలలో ఆయా ప్రాంతాల అధికార భాషలకు అవకాశం ఉంది.

కానీ రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హైకోర్టులలో హిందీకి అనుమతి ఉంది. అయితే గవర్నరు అనుమతితో రాష్ట్ర అధికార భాషను హైకోర్టులో వాడే వీలు ఉంది. దీనిని ఆసరాగా తీసుకొని ప్రజల వద్దకు న్యాయవ్యవస్థను మరింత చేరువ చేయాలంటే ప్రాంతీయ భాషలు ఉన్నత న్యాయస్థానాలలో వాడాలని తమిళనాడు వాదించింది.

5.4.2 రాష్ట్రంలో భాషావిధానం

ఆంధ్రప్రదేశ్ అధికార చట్టం 1966 ప్రకారం రాష్ట్రానికి తెలుగు అధికార భాష. దీనితో తెలుగును విధాన నిర్మాణ భాషగా న్యాయ పాలన భాషగా ఉపయోగించడానికి మార్గం ఏర్పడింది. అయితే న్యాయపాలనా భాషగా తెలుగును వినియోగించటంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. చట్టాలు అన్నీ ఆంగ్లంలో ఉన్నాయి. వాటిని తెలుగు చేయాలి, తరువాత చట్టాలను తెలుగులో రూపొందించాలి. ఆంగ్లంలో ఉన్న చట్టాలను తెలుగులో వర్తింపచేసి వ్యాఖ్యనించటంలో ఆచరణపూర్వకమైన ఇబ్బందులు ఉన్నాయి. అందువల్ల 1964లో రాష్ట్ర ప్రభుత్వం అనువాద సంఘాన్నీ న్యాయశాఖలో ఒక అనువాద విభాగాన్నీ ఏర్పాటు చేసింది. అయితే ఈ అనువాదాలు 1966 అధికార భాషా చట్టం ప్రకారం గవర్నరు ఆధ్వర్యంలో ప్రచురితం అయినప్పుడు అధికార పాఠాలు అవుతాయి. అదీకాక చట్టాల, ఆధికారిక ప్రకటనల విషయంలో మరొక సమస్య ఉంది. శాసనసభలో ఏ భాషలో చట్టం చేస్తే ఆ భాషలోనే అది అధికార ప్రకటన అవుతుంది. అయితే ఆ భాష – బిల్లులలోనూ, చట్టాలలోనూ వాడవలసిన భాషగా శాసనసభ ద్వారా నిర్ణయించబడి ఉండాలి. అదే అధికార

భాష అవుతుంది. శాసనసభలో ఆంగ్లంలో ప్రవేశపెట్టిన బిల్లు గానీ, ఆమోదించిన చట్టం గానీ ఇతర భాషలలోనికి అనువదించినప్పుడు ఆ అనువాదం ఆధికారిక పాఠం అవ్వదు. అది ఆ భాష రానివారికి చట్టాన్ని తెలిపేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. అంతేకానీ న్యాయశాస్త్రరీత్య లేదా రాజ్యాంగపరంగా ఆ అనువాదానికి ఎలాంటి ప్రామాణికత ఉండదు. అందువల్ల అ చట్టాల అనువాదాలను కోర్టులు ప్రామాణికంగా స్వీకరించవు. అలాగే తెలుగులో చేసిన చట్టాలు ఉంటాయి. వాటి ఆంగ్ల పాఠాలు గవర్నరు అధికారం కింద రాష్ట్ర గెజిట్ లో ప్రచురించబడతాయి. అలా ప్రచురించబడిన ఆంగ్ల అనువాదాన్ని ఆ చట్టానికి సంబంధించిన ఆంగ్ల అధికార పాఠంగా భావించాలని 348(3) అధికరణం నిర్దేశిస్తోంది. ఇలాంటివాటినే హైకోర్టులు, సుప్రీంకోర్టు అధికార పాఠాలుగా స్వీకరించవలసి ఉంటుంది. ఈ విధంగా ఈ సమస్యను అధిగమించవచ్చు. అలాగే కేంద్ర అధికార భాష అయిన హిందీలోకి అనువాదం జరగవలసి ఉంది. ఈ విధంగా పాలన, న్యాయశాఖలలో అధికార భాషగా తెలుగు వాడకానికి అవకాశాలు ఉన్నాయి. త్వరలో తెలుగులో చట్టాలు చేసేందుకు తెలుగు చట్ట సభల్లో నిర్ణయం చేయాలి.

2012లో అప్పటి అంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ. ఎన్. వి. రమణ గారు తీసుకున్న విధాన నిర్ణయం న్యాయ పాలనలో తెలుగు వ్యాప్తికి మార్గదర్శనం.

సూచనలు:

1. ఆలోచన మాతృభాషలోనే పుడుతుంది. వ్యక్తీకరణ అదే భాషలో ఉండటం సుఖం. అందుకే న్యాయస్థానంలో వాద ప్రతివాదాలూ తీర్పులూ అధికార భాషలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
2. న్యాయ, పాలన రంగాలకు పారిభాషిక పదకోశాలు విరివిగా రావాలి.
3. ప్రజలభాషలో న్యాయపాలన పరిభాషకై కృషి చేసిన తెలుగు పత్రికలకు, వ్యక్తులకు, విద్యాలయాలకు, సంస్థలకు, విద్యార్థులకు, న్యాయస్థానాలకూ ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించాలి.
4. జన వ్యవహారాన్ని దృష్టిలో పెట్టుకొని తెలుగులో న్యాయపాలనా పదకోశ నిర్మాణాలు జరగాలి.
5. హైకోర్టులో వచ్చిన అనేక తీర్పులకు తెలుగు అనువాదాలు రావలసిన అవసరం ఉంది.
6. రాష్ట్ర శాసనసభలలో చేసిన అన్నిరకాల చట్టాలకు, బిల్లులకు సంబంధించిన తెలుగు పాఠాలు అందరికీ అందుబాటులోనికి రావాలి.

7. దేశంలోనూ, రాష్ట్రాలలోనూ ఉన్న చట్టసభలలో దేశభాషలు వాడేందుకు వీలుకల్పించిన రాజ్యాంగమే ఉన్నత న్యాయస్థానాలలో దేశభాషలు వాడేందుకు ఎన్నో అడ్డంకులు ఏర్పరచింది. రాష్ట్ర, దేశ ఉన్నత న్యాయస్థానాలలో దేశభాషలు వాడాలంటే గవర్నరు, రాష్ట్రపతుల ఆమోదం కావాలి. ఈ పరిస్థితి మారాలి. ప్రతిచట్టం తెలుగులో చేయాలి. దానికి ప్రతిగా ఆంగ్ల అనువాదం తయారవ్వాలి. న్యాయస్థానాలలో ఫిర్యాదులూ వాదోపవాదాలూ తీర్పులూ అన్నీ తెలుగులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి.

5.5 వృత్తి, వ్యవసాయ, వాణిజ్యాది రంగాలలో భాషా విధానం

ఈ రంగాలలో తరతరాలుగా ప్రజలు మాతృభాషనే వాడడం ముఖ్యంగా గమనించదగ్గ విషయం. అయితే ఆధునికీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక వృత్తి, వ్యవసాయ వాణిజ్యాది రంగాలు మౌలికమైన మార్పులకు లోనవుతున్నాయి. వివిధ వృత్తులు వ్యవస్థీకృతం కావడంవల్లా వ్యవసాయవాణిజ్యాలు ప్రపంచీకరణ ముంగిట్లో చేరడంవల్లా భాషల ప్రాధాన్యం పెరిగింది. ఈ ప్రాంతీయ అంతర్జాల అవసరాలకు అనుగుణంగా ఈ రంగాలలో భాషావిధానం ఉండటం అవసరం.

నియమాలు:

1. వృత్తి, వ్యవసాయ, వాణిజ్య రంగాలలో సేవలందించేవారికి స్థానీయ/ప్రాంతీయ భాషలే ప్రాథమిక భాషలు. ఈ రంగాలలో సేవలందుకోనే వారు ప్రజలే. అందువల్ల ఈ రంగాలలో భాషావిధానం ప్రజల భాషకే పట్టం కట్టాలి.
2. ప్రపంచీకరణ, స్థానికీకరణ నేపథ్యంలో ప్రజల/స్థానిక భాషలోనే వర్తక వాణిజ్య వ్యవహారాలు జరిపేలా నియంత్రించాలి.
3. వాణిజ్యంతో సంబంధం ఉన్న వ్యవసాయ, ఆర్థిక, సామాజిక, వ్యాపార శాస్త్రాధ్యయనం తెలుగు మాధ్యమంలో చదివే అవకాశం అన్ని స్థాయిలలోనూ కల్పించాలి.
4. వృత్తులకు సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ, తెలుగుభాషను సాంకేతికంగా ఉపయోగించేలా పరిశోధనలు జరగాలి, వాటిని ప్రోత్సహించాలి. అందుబాటులోనికి తేవాలి.
5. వృత్తివ్యవసాయ విశ్వవిద్యాలయాలలో వాడే ప్రత్యేక పారిభాషిక తెలుగును తప్పనిసరిగా బోధించే విధానం ఉండాలి.

ప్రాతిపదిక:

మానవజీవితంతో అనేక రంగాలు ముడివడి ఉన్నాయి. ఆ రంగాలలో వ్యక్తులు నైపుణ్యం సాధించాలంటే సహజంగా భాషా దక్షత ఉండాలి. అందుకు దేశీయ భాషలు ఎంతగానో సహకరిస్తాయి. ఏదో ఒక రంగ ప్రమేయం, ప్రభావం లేకుండా మానవ జీవితం సాగదు. ఎంచుకొన్న రంగాలలో నిరంతరం శ్రమించడం మానవజీవన పరమ కర్తవ్యాలలో ఒకటి. ఈ ప్రక్రియ కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా మరికొన్నిసార్లు అనుద్దేశ పూర్వకంగా జరుగుతుంది. ఈ రంగాలు వృత్తిని బట్టి ప్రవృత్తిని బట్టి ఏర్పడేవి కూడా ఉంటాయి. కేవలం వృత్తి ఆధారిత రంగాలలోనే కృషి ఉపాధి కేంద్రకంగా జరుగుతుంది. ప్రవృత్తి ఆధారిత రంగాలలో కృషి బహుముఖీనంగా ఉంటుంది. దీనికి కారణం ఆ రంగంపై ఉండే ఆసక్తి. వీటిలో రెండో కోవకి చెందిన ప్రవృత్త్యాధారిత రంగమే విద్యారంగం. మిగిలిన అన్నిరంగాలూ విద్యారంగంపైనే ఆధారపడి ఉన్నాయి. అన్నిరంగాలకూ వెళ్ళే వ్యక్తులను విద్యారంగమే తయారుచేస్తుంది. విద్యాపరమైన రంగాలలోనేకాక సామాన్యంగా వృత్తి, వ్యవసాయ వాణిజ్య రంగాలతో సంబంధం ఉన్న ప్రతివ్యక్తికీ భాష ఉపయోగపడడం ప్రస్తుతం సాంకేతికత సాధించిన విజయం.

5.5.1 దేశంలో భాషావిధానం

ఆధునికీకరణ తెచ్చిన మార్పులకు లోనుకాని రంగం అంటూ భారతదేశంలోఏమీ లేదు. వృత్తి, వ్యవసాయ, వాణిజ్య రంగాలలో కూడా విపరీతమైన మార్పులు సంభవించాయి. కేంద్రంలో పంచవర్ష ప్రణాళిక సంఘం ఉంది. సహకార పరపతి సంఘమూ ఉంది. పాడి పంటలకు సంబంధించిన సేవలూ, వ్యవసాయ ఆధారిత సేవలూ, ఉద్యానవన సేవలూ, ఇంకా మత్స్య పరిశ్రమసేవలూ ఇలా ప్రతి వృత్తికీ వ్యవసాయ వాణిజ్య రంగాలవారికీ అనేక సేవాకార్యక్రమ ప్రణాళికలు ఉన్నాయి. ఈ సేవలను అందుకోవలసినవారిలో చిన్నాకారు, సన్నకారు రైతులున్నారు. వీరితోపాటుగా అవకాశబాహ్యులూ అసంఘటిత రంగాల వారూ ఉన్నారు. వారికి అందించవలసిన సేవలు వారికి సరిగ్గా అందాలన్నా ఆ అవకాశాలను వారు నూటికి నూరుశాతం అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నా భాష వారికి కొంచెం కూడా అడ్డుకట్ట వేయకూడదు. అలా వేస్తే అది వారి అభివృద్ధికే గొడ్డలిపెట్టు అవుతుంది. అందుకే వారికి భాషా పరమైన సహకారం సంపూర్ణంగా అందాలి. అది వారి వారి మాతృ భాషలలోనే ఉండాలి. వృత్తి, వ్యవసాయ, వ్యాపార విషయాలలో భాషా పరమైన కష్టాలను అధిగమించడానికి వారికంటూ ఎటువంటి ఏర్పాట్లూ లేవు. ఆయా రంగాలు చాలా వరకూ నేరుగా రాష్ట్రాల పరిధిలోనే ఉండడం దీనికి ఒక కారణం కావచ్చు.

5.5.2 రాష్ట్రంలో భాషావిధానం

కేంద్రంలో లాగా రాష్ట్రంలో కూడా ఎటువంటి ప్రత్యేక భాషా విధానం లేదు. కూరగాయల పెంపకం, పూల పెంపకం లాంటివి అన్ని రాష్ట్రాలలోనూ పరిశ్రమలుగా రూపాంతరం చెందుతున్నాయి. అవి వ్యాపారాలుగానూ మారుతున్నాయి. ఎందరో రైతులు చేపల పెంచడం, కూరగాయలు పండించటం, పూలు పూయించడం వాటిని ఇతర దేశాలకు, రాష్ట్రాలకు ఎగుమతి చేయడం ద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. ఇవి ఇంకా బాగా ఎదిగి పరిశ్రమల స్థాయిని పొందాలంటే వారికి కావలసిన విషయపరిజ్ఞానాన్ని వారి వారి భాషలలోనే అందించాలి. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తెలుగులో అందించాలి. ఈ పరిశ్రమలతో సంబంధం ఉన్న పాలనాశాఖలు అన్నీ తెలుగులోనే వారికి అందించాలి. ప్రస్తుతానికి ఈ రంగంలో ప్రత్యేకించి ఎలాంటి భాషా విధానం లేదు కానీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ రంగాలలో పనిచేసే వారికి శిక్షణ నివ్వడం అవసరం. అంతర్జాతీయంగా ఆయా రంగాలలో వస్తున్న ఆధునిక పోకడలూ, ఆధునిక సదుపాయాలూ పనిముట్లూ, ఆధునిక పరిశోధనల ఫలాలూ ఇవన్నీ వారికి అందించగలిగితే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రక్రియ మొత్తం ప్రాంతీయభాషలో జరిగితేనే వినియోగించుకొనే వారికి సౌకర్యవంతంగా ఉంటుంది. వారికి సులభంగా, అర్థమయ్యే రీతిలో దేశభాషలలో అందించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. వారి అవసరాలను గుర్తించి వారి వారి ప్రత్యేక అవసరాలను తీర్చడానికి పటిష్టమైన ఒక భాషావిధానం ఏర్పడటం అవసరం. ఈ రంగంలో పని చేసే వారందరికీ వారికి కావలసిన సమాచారాన్ని తెలుగులో పొందే హక్కు వారికి ఉంది. దానిని అందించే బాధ్యత ప్రభుత్వానిదే.

సూచనలు:

1. మాతృభాషాభివృద్ధి ఎంత కాదనుకున్నా భాషాభిమానం ద్వారానే సాధ్యం.
2. రాజకీయ, ఆర్థిక, సామాజిక కారణాల వల్ల కలిగే భాష పట్ల నిర్లక్ష్య వైఖరిని అరికట్టాలి.
3. వివిధ రంగాలలో మాతృభాషాప్రాముఖ్యం పెరిగితే భాషాభిమానమూ, అభివృద్ధి వాటంతట అవే పెరుగుతాయి.
4. మాతృభాషామాధ్యమానికీ ఉద్యోగాలకూ సహజసంబంధం ఏర్పరచాలి.
5. ఆంగ్ల భాషానైపుణ్యంతో మంచి కొలువులు దొరుకుతున్నాయి. ఈ పరిస్థితి తెలుగులో రావాలి. అన్ని రంగాలలోనూ మాతృభాషా నైపుణ్యాల రంగప్రవేశమే ఈ సమస్యకు పరిష్కారం. మాతృభాషా మాధ్యమవిద్య నేరుగా సేవారంగానికి సంబంధించినది. ప్రభుత్వ రంగాలలో పనిచేసేవారు (పాలన, వైద్య, ఆర్థికాది సేవలు) తెలుగు

మాధ్యమంలో చదివిగానీ తెలుగు భాషను మూడు సంవత్సరాలు ప్రత్యేక భాషగా నేర్చి గానీ ఉండాలి.

6. పాలన, సేవా వాణిజ్య రంగాలలోనూ తెలుగు వాడకంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలను అందించాలి.

6.0 సమస్యలు – పరిష్కారాలు

తెలుగుభాషను ప్రధానభాషగా వాడే రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆవిర్భవించాయి. రాష్ట్రాలు వేర్వైనా వ్యవహార బాష ఒక్కటే కాబట్టి రాబోయే కాలంలో ఏర్పడబోయే ప్రభుత్వాలు కలిసికట్టుగా భాషాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు.

ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక అవసరం. అందులో సంకుచితమైన ఆలోచనలకు తావు లేకుండా భాషా సమస్యల పట్ల దృష్టిసారించాలి. తెలుగు భాషాసమస్యను పరిష్కరించాలంటే రాజకీయాలకూ, ప్రాంతాలకూ, స్వార్థప్రయోజనాలకూ అతీతంగా ముందుకు సాగాలి. భాషాప్రగతికి రూపకల్పన చేసేవిధంగా, తెలుగుభాష నిత్యవ్యవహారంలో పరిఢవిల్లే విధంగా దీర్ఘకాలిక ప్రయోజనాల సాధన దిశగా భాషావిధానం ఉండాలి.

ఈ రాష్ట్రాలలో ప్రజలభాష తెలుగు. పరిపాలన, సేవ, వృత్తి, వ్యవసాయ, వాణిజ్య, విద్య, వైద్య తదితర రంగాలలో తెలుగు తెలియని వారు ఆయా సేవలను అందించలేరు. కాబట్టి విద్యార్హతలలో తెలుగులో నైపుణ్యం అభిలషణీయం/ఆవశ్యకంగా గుర్తించాలి.

సచివాలయం, న్యాయస్థానాలు సమాచార ప్రసార సాధనాల సంస్థలు తెలుగులో తమ కార్యకలాపాలను నిర్వహించడం ఎంతో అవసరం. తెలుగు భాష అమలు కోసం అధికార భాషా సంఘం గ్రంథాలనూ, నిఘంటువులనూ సాంఖ్యీకరించాలి.

తెలుగు మాధ్యమంలో విద్యా బోధన తెలుగు జాతి వికాసానికి దోహదకారి. అన్యభాషా మాధ్యమంద్వారా అభివృద్ధి కష్టసాధ్యం.

సహజమైన భావ ప్రేరణ, ప్రగతి, మాతృభాష వల్లనే వస్తుంది. మాతృభాషలో విద్యాబోధన వల్ల గ్రహణ సామర్థ్యం, సృజనాత్మకత పెరుగుతాయి.

భాషాసంక్లిష్ట భారతదేశంలో విద్యార్థుల భాషానైపుణ్యాలు, జీవనవికాసం వేగవంతమూ ప్రగతికారకమూ కావాలంటే, భారతదేశంలోని ప్రాంతీయభాషల అస్థిత్వం ప్రశ్నార్థకంగా మారకుండా ఉండాలంటే త్రిభాషా సూత్ర విధానం అమలు చేయడం ఎంతో ప్రయోజనకరం. దీన్ని గమనించి దాని అమలు దిశగా ఇరు ప్రభుత్వాలూ చిత్తశుద్ధితో కృషి చేయాలి.

పాలనాభాషగా తెలుగు అమలుపై రాష్ట్ర స్థాయి అవగాహనా సదస్సులు జరగాలి.

పోటీ పరీక్షలన్నింటిలోనూ తెలుగు భాషా నైపుణ్యాలను సాధించటం, తెలుగువారితో పాటు ఇతర మాతృభాషల వారికీ తప్పనిసరి చేయాలి.

ప్రజల వద్దకు పాలన అనేది తెలుగు భాషను పరిపాలనా బాషగా పూర్తిగా అమలు పరిచినప్పుడే సాధ్యం. అందుకు విధివిధానాలను రూపొందించుకొని ముందుకు సాగాలి.

ప్రజల భాషలో పాలన సాగడానికి సమాజంలో మార్పు మననుండే ప్రారంభం కావాలి. శాఖల వారీగా ప్రత్యేక పదకోశాలను రూపొందించుకుని, కంప్యూటర్ ద్వారా తెలుగు వాడకాన్ని అమలుచేయాలి.

తెలుగును అధికారభాష గా ప్రవేశపెట్టిన బిల్లు చట్టం అయింది. ప్రభుత్వ శాఖలు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నడపాలని ప్రభుత్వ ఉత్తర్వులూ ఉన్నాయి. పరిపాలనా భాషగా తెలుగు స్వరూపం ఎలా ఉండాలో పింగళి లక్ష్మీకాంతం, జి.ఎల్.పి. గ్విన్, భద్రిరాజు కృష్ణమూర్తి గార్ల అధ్యక్షతన ఏర్పడ్డ సంఘాలు నిర్ణయించాయి. తగిన సూచనలు చేశాయి. ఆ సూచనలు అనుసరిస్తూ ప్రజాస్వామ్య యుగంలో ప్రజల భాషలో పరిపాలన సాగించాలి. పాలకుల భాష ఒకటి, పాలితుల భాష మరొకటి కాకూడదు. అలా అయితే అవగాహనా పరిధి కుంచించుకుపోతోంది.

ప్రజలు తమ సమస్యలను తమ భాషలో వ్యక్తీకరించుకొనే హక్కును రాజ్యాంగం కల్పించింది. అర్థమయ్యేలా ప్రజలకు తెలుగులో వివరించే బాధ్యత అధికారులపై ఉంది. అయితే దీనికి కీలకం భాషను ఆధునికీకరించడం. ఆధునిక అవసరాలకు అనుగుణంగా భాషాభివృద్ధి జరగాలి.

తెలుగులో పాఠ్యగ్రంథాలను ప్రచురిస్తూ, వాటిని మధ్యమధ్యన పరిష్కరిస్తూ ఉండాలి సమగ్రమైన పారిభాషిక పద కోశాల్ని తయారుచేయించాలి. ప్రభుత్వం, తెలుగు అకాడమీ, విశ్వవిద్యాలయాల వంటి ద్వారా అన్ని స్థాయిలలో తెలుగు బోధనా బాషగా అమలు చేసేందుకు వీలుగా గ్రంథాలు రాయించాలి.

పత్రికలు నూతన పద నిర్మాణాలను చేయాలి. పత్రికా భాషా నిఘంటువులు రూపుదాల్చాలి.

వైజ్ఞానిక, సామాజిక విషయాలపై గ్రంథాలను విరివిరిగా అనువాదం చేయించాలి.

ప్రజల్లో చైతన్యం వచ్చి, దీక్షతో, పట్టుదలతో తెలుగును బోధనా భాషగా అమలు చేయటంలో సహకరించాలి.

తెలుగును బోధనా భాషగా చదివిన వారికి ప్రోత్సాహకాలు కల్పించాలి.

ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు పూర్తిగా తెలుగులోనే ఉండాలి.

ఇలాంటివి రెండు రాష్ట్రాలలోనూ జరగాలి. తెలుగు భాషా పరిరక్షణ ప్రస్తుత ప్రభుత్వాల ధ్యేయం కావాలి.

పాఠ్య పుస్తకాలలో, ప్రసార మాధ్యమాలలో వాడే భాష విషయంలో తెలుగు రాష్ట్రాలు కావాలనుకొంటే వ్యవహారిక ప్రామాణికతను అంగీకరించవచ్చు. మాండలిక వ్యవహార పరివర్తనాలను రూపొందించుకోవాలి. తర్వాత సంభవించే సమస్యలను ముందుగానే ఊహించి అన్ని ఉపమాండలికాలకూ ఆ ప్రామాణిక భాషలో ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి.

నచ్చిన భాషను అభ్యసించే స్వేచ్ఛ ప్రతిపౌరుడికీ భారత రాజ్యాంగం కల్పించింది. ఇది ప్రాథమిక హక్కు. దీనిని ఆసరాగా తీసుకొని మాతృభాషను పాఠ్యాంశంగా స్వీకరించకుండానే విద్యాభ్యాసం పూర్తి చేసే అవకాశమూ ఉంది. మాతృభాషా ప్రస్తావన లేకుండానే మొత్తం చదువు పూర్తిచేసే అవకాశమూ ఉంది. దీనికి ప్రధాన కారణం ఉద్యోగ భద్రత లేకపోవడం.. ఉద్యోగ భద్రత భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. ఐతే నచ్చిన మాతృభాషలో చదువు పూర్తిచేసిన పౌరులకు ఉద్యోగ భద్రత కల్పించని రాష్ట్రప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన హక్కులను విస్మరిస్తున్నాయన్నమాట. దీనికి విరుగుడుగా, మాతృభాషలో విద్యాభ్యాసం పూర్తి చేసినవారికి దామాషా పద్ధతిలో ఉద్యోగభద్రత కల్పించాలి. అలా కాని పక్షంలో అంటే, ఉద్యోగ భద్రతను కలిగించని భాషలు అతి త్వరగా తమ ఉనికిని కోల్పోతాయి.

7.0 ఉపసంహారం :

భాషలు అస్థిత్వాన్ని కోల్పోతే ఆ భాషా వ్యవహర్తల సామాజిక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను కోల్పోయినట్లే. అంటే తమ ఉనికినీ, సంస్కృతినీ, భాషనూ నిలుపుకునేందుకు దశాబ్దాలతరబడి నిర్వహించిన వందలాది ఉద్యమాలకూ చేసిన వేలాది త్యాగాలకూ విలువ లేనట్టే. పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు భాషావిధ్వంసాన్నీ దాని పర్యవసానంగా ఏర్పడే జాతి విధ్వంసాన్నీ ఆపాలి.

ఇటు తెలంగాణా, అటు ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలోనూ సత్వరం చేపట్టవలసిన చర్యలు కొన్ని ఎదురు చూస్తున్నాయి. సాంకేతికంగానూ, శాస్త్రీయంగానూ భాషాభివృద్ధిని వేగవంతం చేయాలి. అంతర్జాలంలోనూ, సంగణక ఉపకరణాల రూపకల్పనలోనూ, అనువాదాలలోనూ తెలుగును విస్తరించాలి. సమానార్థక పదాల తయారీ, అన్ని అవసరాలు తీర్చే మహానిఘంటు నిర్మాణం, వివిధ శాస్త్ర విషయాలకు సంబంధించిన పాఠ్యగ్రంథాల

తయారీ, ప్రభుత్వ, ప్రభుత్వేతర వెబ్ సైట్ల నిర్వహణ, ఆన్ లైన్ సేవల సౌకర్యాల కల్పన, పారిభాషిక పదకోశాల నిర్మాణం, విశ్వవిద్యాలయాల మధ్య పరిశోధన సమన్వయం, తెలుగు సాంకేతికపరికరాల సృష్టి వాటి వినియోగం, అలాగే ఉపాధి సృష్టి మొదలైన ఎన్నో అంశాలు ఉన్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయటం మానుకోవాలి. ప్రతిభాశూన్యత, అనవగాహన, సత్వరలాభాపేక్ష, దీర్ఘకాలిక దృష్టి లోపం వంటివి ఎన్నో కారణాల వల్ల వికసించవలసిన సహజవనరులు అరకొరగానే నేలరాలిపోతున్నాయి. ఇది మరింత జటిలమైన తీవ్ర సమస్యలలోనికి దారితీయకముందే రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ ముందుకు రావాలి. తెలుగు ప్రజలందరితో కలిసి సమష్టికార్యచరణను ఏర్పరుచుకోవాలి. ఈ ప్రక్రియ ఒక బాధ్యతగా భావించి అటు ప్రభుత్వమూ, ఇటు ప్రజలూ కృషి చేసినప్పుడే శాశ్వత ఫలితాలు లోకానికి అందుతాయి.

8.0 ఉపయుక్త గ్రంథ సూచిక

తెలుగు

1. ఉమామహేశ్వర రావు, గారపాటి. 2013. తెలుగు – సంగణనం — హైదరాబాద్: పొ.శ్రీ.తె.వి.వి. ప్రచురణ.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 1974. తెలుగు భాషాచరిత్ర — హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1999.
3. __________. భాష, సమాజం, సంస్కృతి — హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.
4. ధర్మరావు, సి.1980. అధికార భాష తెలుగు — హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్
5. నరసింహమూర్తి, యూ.ఏ., లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్. 2012. ప్రాచీనకాలంలో అధికారభాషగా తెలుగు — హైదరాబాద్: తెలుగు అకాడమీ
6. ప్రకాశం, వెన్నెలకంటి.2007. భాష – సాహిత్యం — హైదరాబాద్: ఎమెస్కో
7. రహంతుల్లా, నూర్బాషా. 2006. తెలుగు అధికారభాష కావాలంటే — హైదరాబాదు: తెలుగు ఇస్లామిక్పబ్లికేషన్స్, సందేశ భవనం, లక్కడ్కోట్.
8. రాధాకృష్ణ, బూదరాజు.1995. భాషాశాస్త్ర వ్యాసాలు — హైదరాబాద్: విశాలాంధ్ర ప్రచురణ,
9. రామయ్య, చుక్కా. 2004. ఇంటిభాష — హైదరాబాద్: స్పృహ సాహితీసంస్థ

10. శ్రీనివాస్, అద్దంకి. 2012. తెలుగు భాష – వ్యాకరణం (ప్రాచీన, అర్వాచీన దృక్పథాలు) — హైదరాబాద్: రచయిత, కాల్ట్స్, హైదరాబాదు విశ్వవిద్యాలయం.

11. Venkata Ramamurty, Gidugu. 2006. A memorandam on Modern Telugu — Hyderabad: Vedagiri Publications.

9.0 అనుబంధాలు :

9.1 భారతరాజ్యాంగం – భారతీయభాషలు

భారతరాజ్యాంగం, విభాగం XVII, అధ్యాయము – 2: ప్రాంతీయ భాషలు అధికరణం :
345 : రాష్ట్రాల అధికార భాష లేదా భాషలు :

రాష్ట్రాలు, ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ భాషలను గానీ లేదా హిందీని గానీ తమ రాష్ట్ర అధికార భాష లేదా భాషలుగా ప్రకటించుకొని ఆ భాషలలో శాసనాలను చేసుకోవచ్చు, అయితే, 346, 347 అధికరణాలకు ఈ అధికరణం లోబడి ఉంటుంది.

అదే సందర్భంలో అధికార భాషకు సంబంధించి ఒక రాష్ట్రం శాసనం చేసే వరకూ ఆధికారిక వ్యవహారలన్నీ అంతకు ముందులాగే (రాజ్యాంగం అమలులోనికి రాకపూర్వం లాగే) ఆంగ్లంలోనే కొనసాగాలి.

అధికరణం : 346 : వివిధ రాష్ట్రాల/ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు.

కేంద్రంలో అధికార వ్యవహారాలు ప్రస్తుతం కొనసాగుతున్న భాషలోనే (అంటే ఆంగ్లంలోనే) జరగాలి. వివిధ రాష్ట్రాల మధ్య, రాష్ట్ర – కేంద్ర ప్రభుత్వాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఆంగ్లంలోనే జరగాలి.

అదే సందర్భంలో తమ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీలో ఉండాలని అయితే రెండుగానీ అంతకంటే ఎక్కువ రాష్ట్రాలుగానీ అంగీకరించినట్లయితే అవి హిందీలో ఉండవచ్చు.

ప్రకరణం: 347: రాష్ట్రాలలో అల్ప సంఖ్యాకుల భాషలకు ప్రత్యేక గుర్తింపు

ఏదయినా ఒక రాష్ట్రంలో గణనీయమైన సంఖ్యలోనున్న ప్రజలు (substantial proportion of the population) తాము మాట్లాడే భాషను కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించవలసిందిగా కోరవచ్చు. వారి కోర్కెను రాష్ట్రపతి ఆమోదించినట్లైతే ఆ భాషను కూడా ఆ రాష్ట్రమంతటా ఆధికారికంగా గుర్తించవలసిందిగా రాష్ట్రపతి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు.

అధ్యాయం– 3

ప్రకరణం: 348: సుప్రీంకోర్టు, హైకోర్టు శాసనాలలో ఉపయోగించే భాష

1) ఇంతవరకు పై అధికరణంలో ఏమీ పేర్కొనపోయిప్పటికీ, పార్లమెంటు భిన్నమైన శాసనాలు చేసే వరకూ ఈ క్రింది అంశాలకు సంబంధించిన ప్రక్రియ అంతా అంగ్లంలోనే కొనసాగాలి (shall be in English Language).

a) సుప్రీంకోర్టు / హైకోర్టులలో కొనసాగే మొత్తం న్యాయ ప్రక్రియ;

b) (i) పార్లమెంటు ఉభయసభలలో గానీ లేదా రాష్ట్రాల శాసనసభలలో గానీ ప్రవేశపెట్టబడే బిల్లులు, వాటి సవరణల అధీకృత మూలం;

(ii) కేంద్ర పార్లమెంటు / రాష్ట్రాల శాసనసభలు ఆమోదించే శాసనాలు, రాష్ట్రపతి లేదా గవర్నర్లచే జారీ చేయబడే ఆర్డినెన్సు;

(iii) ఈ రాజ్యంగం కింద గానీ లేదా పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలు చేసే శాసనాలకు అనుబంధంగా జారీచేయబడే అన్ని ఆదేశాలు, నియమ నిబంధనలు, బైలాస్.

2) క్లాజు (1) లోని సబ్ క్లాజు(a) లో ఏమీ ఉదహరింపబడనప్పటికీ, ఒక హైకోర్టులోని న్యాయప్రక్రియలో గానీ లేదా రాష్ట్రప్రభుత్వ అధికార వ్యవహారంలో గానీ హిందీ లేదా మరేదయినా భాషను ఉపయోగించడానికి రాష్ట్ర గవర్నరు ఆదేశించవచ్చు. అయితే ఈ విషయంలో గవర్నర్ ముందుగా రాష్ట్రపతి ఆమోదం పొందాలి. కానీ ఆ యా రాష్ట్ర హైకోర్టులు వెలువరించే తీర్పు, డిక్రీ, లేదా ఆదేశాలకు ఈ క్లాజు వర్తించదు.

3) క్లాజు (1) లోని సబ్ క్లాజు (b)లో ఏమీ ఉదహరింపబడనప్పటికీ, ఒక రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టబడే బిల్లులు గానీ, ఆమోదింపబడిన చట్టం గానీ, లేదా గవర్నరు జారీచేసే ఆర్డినెన్స్ గానీ ఆ క్లాజులో ని పేరాగ్రాఫ్ (iii) లో ఉదహరించబడిన ఆర్డరు, రూలు, రెగ్యులేషను, లేదా బైలాలు ఇంగ్లీషులో కాకుండా ఇతర భాషలో ఉండవచ్చు.

అటువంటి సందర్భంలో వాటి ఆంగ్ల అనువాదం (అధికార గెజిట్‌లో ప్రచురించబడే) అధీకృత మూలంగా (authoritative text) గా పరిగణింపబడుతుంది.

అధికరణం: 349: రాష్ట్రపతి అనుమతి లేకుండా అధికార భాషకు సంబంధించిన శాసనాలను మార్చకూడదు.

ఈ రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుండి 15 సంవత్సరాల వరకూ 348 వ అధికరణంలోని (1) వ క్లాజులో వాడుక భాషకు సంబంధించిన నిబంధనలను మార్చే విధంగా ఎటువంటి శాసనాన్నీ రాష్ట్రపతి అనుమతి లేకుండా శాసనసభలో ప్రవేశపెట్టరాదు.

ముందుగా అధికార భాషా సంఘం (అధికరణం 344 క్లాజు (1) కింద ఏర్పాటు చేయబడింది.) సిఫార్సులనూ పార్లమెంటరీ కమిటీ (అధికరణం 344 క్లాజు (4) కింద ఏర్పాటైంది) నివేదికనూ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

అధ్యాయం – 4: ప్రత్యేక ఆదేశాలు

అధికరణం : 350:

అర్జీలు, ఫిర్యాదులను ఏ భాషలోనైనా పంపవచ్చు. ఏ వ్యక్తి అయినా తన సమస్యలు, బాధలు, ఇబ్బందులకు సంబంధించి, సంబంధిత కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారి లేదా అథారిటీకి పంపుకొనే అర్జీ, ఫిర్యాదు లేదా వినతి పత్రాలు కేంద్ర లేదా సదరు రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించే ఏ భాషలో నైనా ఉండవచ్చు.

అధికరణం : 350– A:

భాషా పరమైన మైనారిటీలకు ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యాబోధన భాషా పరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రాథమిక స్థాయిలో వారి మాతృ భాషలోనే విద్యా భోదన జరిగేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను, అవకాశాలను కల్పించటం స్థానిక రాష్ట్ర ప్రభుత్వాల స్థానిక సంస్థల బాధ్యత. ఇందుకు సంబంధించి రాష్ట్రాలకు రాష్ట్రపతి తగిన ఆదేశాలు జారీ చేయవచ్చు.

ప్రకరణం: 350– B.

భాషా పరమైన మైనారిటీల కోసం ప్రత్యేక అధికారి నియామకం

1. భాషా పరమైన మైనారిటీల కోసం ఒక ప్రత్యేక అధికారిని రాష్ట్రపతి నియమించాలి.
2. భాషా పరమైన మైనారిటీల పరిరక్షణ కోసం ఈ రాజ్యాంగంలో పొందుపరచబడిన ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై పరిశీలన జరిపి రాష్ట్రపతికి నివేదించడం ఆ ప్రత్యేక అధికారి బాధ్యత. రాష్ట్రపతి ఆ రిపోర్టులను పార్లమెంటుకు సమర్పించాలి. ఆ రిపోర్టు ప్రతులను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా పంపాలి. (భాష గురించిన/ప్రస్తావన 137, 138, 265/272 lipc)

9.2 ఐరోపా సంఘ భాషా విధానం

ఐరోపాలోని పౌరులందరూ ఐరోపా రాజ్యాలలో ఎక్కడైనా, ఎప్పుడైనా పని చేసుకోవచ్చు, స్వేచ్ఛగా తిరగవచ్చు. ఏమైనా సరే స్వేచ్ఛగా నేర్చుకోవచ్చు. విదేశీ భాషల నైపుణ్యాలే దీనికి ఆధారం. ఈ స్వేచ్ఛ క్రమంగా నిరుద్యోగ సమస్యను తగ్గించడంలోనూ

జీవన ప్రమాణాలను ఉన్నతీకరించడంలోనూ ఉద్యోగావకాశాలను పెంచడంలోనూ అలాగే అభివృద్ధి సాధనలోనూ ప్రముఖపాత్ర వహించింది. అందుకు విదేశీ భాషలు ఎంతగానో దోహదం చేశాయి.

భాష అనేది ఎప్పటికీ సామాజిక ప్రాతినిధ్యానికి అవరోధం కాకూడదు. అట్టడుగు వర్గాలవారి భాషలకు కూడా సమాజంలో గుర్తింపు, ప్రాతినిధ్యం, భాగస్వామ్యం అవసరం. ఈ అంశాన్ని ఐరోపా సంఘ భాషా విధానం స్పష్టంగా చెప్తోంది.

విద్యా సాంస్కృతిక ప్రధాన నిర్దేశక కార్యాలయం (DG EAC), విధాన రూపకర్తలూ/ఐరోపావ్యాప్తంగా ఉన్న పౌర సమాజాలవారితో కలిసి బహుభాషీయ వ్యూహాలను సమర్థవంతంగా అమలయ్యే విధానాన్ని పటిష్టపరచడానికి సంయుక్తంగా పని చేస్తోంది. ఈ రంగంలో విద్యా సాంస్కృతిక ప్రధాన నిర్దేశక కార్యాలయం (DG EAC) ప్రాథమ్యాలు ఇలా ఉన్నాయి : ఐరోపా సంఘ సమాచారం ప్రకారం అధికార భాషలను గుర్తించడంలో ప్రాంతీయ / అల్పసంఖ్యాక భాషలు / సంకేత భాషలూ ఇందులో ఉండేలా చూడడం మొదటిది కాగా శీఘ్రభాషాభ్యసన విధానాన్నీ ద్విభాషీయ విద్యావిధానాన్నీ ప్రోత్సహించడం రెండవది.

9.3 చైనా లో భాషా ప్రణాళిక

చైనీస్ అనేది ఒక భాష కాదు, అది అనేక ప్రాంతీయ భాషా కుటుంబాలకు మారు పేరు. 1949 లో చైనా ప్రజా గణతంత్ర ప్రభుత్వ స్థాపన జరిగింది. అప్పటి నుండి ఇప్పటివరకు అనేక భాషా ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. కొనసాగుతున్నాయి కూడా.

చైనీస్ భాషాసముదాయంలో అనేక భాషలూ మాండలికాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిని ప్రామాణికీకరించడం, లిపి వ్యవస్థను సరళీకృతం చేయడం మొదలైన చర్యలను చైనా భాషాప్రణాళిక చేపట్టింది. అయితే చైనీయుల ప్రణాళికా రచన దీనికి మాత్రమే పరిమితమైనది కాదు. మాండరిన్ చైనీయ వర్ణమాలను ప్రామాణికీకరించడంతోపాటుగా మాండరిన్ భాషను చైనాదేశపు ఉమ్మడి భాషగా ప్రచారం చేయడమూ ఇందులో భాగమే.

చైనాలో 55 రకాల అల్ప సంఖ్యాకవర్గ సమూహాలున్నాయి, వీటితో కూడిన చైనా ఒక బహుళ జాతి దేశం. సుమారు 11 కోట్లమంది ప్రజలు జాతీయ అల్ప సంఖ్యాక వర్గాలుగా ఇక్కడ ఉన్నారు. వీటిలో హాన్ ఒకటి. మొత్తం జనాభాలో హాన్ దేశీయులు సుమారు 92 శాతం ఉన్నారని (Governance in China, 2005; Veek, Pannell, Smith, & Huang, 2007) అంచనా.

120 కి పైగా అల్ప సంఖ్యాక వర్గాలకు సొంత మాతృ భాషలు ఉన్నాయి (Zuo, 2007). వీటిలో కేవలం 30 అల్పసంఖ్యాకవర్గాల భాషలకు మాత్రమే లిపులు ఉన్నాయి (Sun, 2004). వెయ్యి కంటే తక్కువ వ్యవహర్తలు ఉన్న భాషలు 20 దాకా ఉన్నాయి. (Zuo, 2007).

జాతీయ స్థాయిలో ఒక జాతీయ భాషగా మాండరిన్ చైనీస్ ను వ్యాప్తి చేయడం 1956లో (Rohsenow, 2004; Zhou, 1999) ప్రారంభమయ్యింది. అయితే అల్పసంఖ్యాక వర్గాలు నివసించే ప్రాంతాల్లో 3వ తరగతి నుంచి మాండరిన్ చైనీస్ భాషా వ్యవహారానికి అవకాశం, ప్రచారం కల్పించబడింది. (Hu & Seifman, 1987; Zhou, 2004). దీనికి కారణం ప్రపంచీకరణ. ప్రపంచంతో చైనాకు గల వర్తక సంబంధాలు, చైనాలోని అల్పసంఖ్యాకవర్గ భాషలకు అననుకూల పవనాలను సృష్టిస్తున్నాయి (Zhou & Ross, 2004).

చైనాలో 120కి పైగా అల్పసంఖ్యాకవర్గ భాషలున్నాయి. వీటిని వాటివాటి సామాజిక స్థితిగతుల ఆధారంగా మూడు శ్రేణులుగా వర్గీకరిస్తున్నారు.

1. ప్రథమ శ్రేణి భాషలు

ఈ వర్గంలో ఏడు భాషలు ఉన్నాయి. అవి మంగోలియన్, టిబెటన్, యుగుర్ (Uygur), కజక్ (Kazak), కొరియన్, యీ, దాయ్ (Yi and Dai). ఈ భాషలన్నింటికీ వాటి వాటి సంప్రదాయ లేఖన వ్యవస్థలు ఉన్నాయి. ఈ భాషల గరిష్ఠ జనాభా మొత్తం 3.1 కోట్లు. ఇవి చైనాలో అల్పసంఖ్యాకవర్గ ఉపజాతీయ భాషలు గల వివిధ ప్రాంతాలలోనూ అన్ని రకాల జీవన విధానాలలోనూ వ్యవహరింపబడుతున్నాయి.

2. ద్వితీయ శ్రేణి భాషలు

ప్రథమ శ్రేణి భాషలు కాక జువాంగ్ వంటి మరో పన్నెండు భాషలు ద్వితీయ శ్రేణి భాషలు. ఈ భాషలు మొత్తం 3.5 కోట్ల జనాభాతో పరిమితి ప్రాంతాలలో మాత్రమే వ్యవహరింపబడుతున్నాయి.

3. తృతీయ శ్రేణి భాషలు

ఈ వర్గంలో 100కు పైగా భాషలు ఉన్నాయి. 33 అల్పసంఖ్యాక ఉపజాతీయ ప్రదేశాలలో 1.7 కోట్ల మంది వీటిని వ్యవహరిస్తున్నారు. ఈ వర్గంలో ఉన్న ఏ భాషకూ స్వీయ లిపి లేదు. ఉన్నా అవి అరుదుగానే సంప్రదాయ పద్ధతులనే ఉపయోగిస్తాయి. పై వర్గీకరణ ఆధారంగానే చైనీస్ ప్రభుత్వ భాషా ప్రణాళికలు రూపొందాయి. ప్రథమశ్రేణి

భాషలలోనే ప్రత్యేకమైన భాషాచేతనత్వం చేసే ప్రయత్నాలు, మార్గదర్శక సూత్రాలు, వ్యూహాలు, ప్రమాణాలు రూపొందించడం జరుగుతుంది. ద్వితీయ శ్రేణి భాషలలో ద్విభాషా బోధన ప్రయోగాలు జరుగుతాయి. తృతీయ శ్రేణి భాషలలోని కొన్ని భాషల పునరుద్ధరణ ప్రయత్నాలు సాగుతుంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఉపయోగించే భాషలకోసం సూచింపబడిన లేదా ఆ భాషలను ప్రభావితం చేసిన భాషా ప్రణాళిక వాటి విధాన రూపకల్పనలోనూ / ఆచరణలోనూ జోక్యం చేసుకుంటుంది.

పాఠనిధి ప్రణాళిక / స్థాయీ ప్రణాళిక

ఈ రెండూ పరస్పర సంబంధం ఉన్న భాషాంశాలు (Wiley, 1996). పాఠనిధి ప్రణాళిక నూతన నిబంధనల స్థిరీకరణ, ఉచ్చారణ, లిపి పరిష్కరణ వంటి కార్యకలాపాలు సూచిస్తుంది

రెండు ప్రధాన లక్ష్యాలకోసం చైనా చేసిన అపారమైన కృషి :

మాండరిన్ చైనీస్ కోసం సంప్రదాయ చైనీస్ లిపి వ్యవస్థను సరళం చేయడం కోసం రోమను ఉచ్చారణచిహ్నాలకు రూపకల్పన చేయడం.

స్థాయీ ప్రణాళిక

వివిధ భాషలకు జతపరచబడిన జాతీయ ప్రభుత్వ ఆధికారిక గుర్తింపుకు స్థాయీ ప్రణాళిక అనుసంధానింపబడింది (Cooper, 1989). ఇది మాండరిన్ చైనీస్ భాషను ప్రజా గణతంత్ర చైనాకి సంబంధించి (Zhou, 2001) సాధారణ వ్యవహృత భాషగా గుర్తించి దానిని ప్రామాణికీకరించడానికీ వ్యాప్తిచేయడానికీ కృషి చేస్తుంది.

భాషా పాఠనిధి ప్రణాళిక:

చైనీస్ లిపి చాలా క్లిష్టమైనది. ఇందులో వేల కొద్దీ రేఖా చిహ్నాలు ఉంటాయి. వీటిని చదవాలన్నా రాయాలన్నా అభ్యాసం అవసరం. చైనీస్ నేర్చుకునే సమయంలో 30 శాతం సమయాన్ని ఈ అక్షరాలు నేర్చుకోవడానికే వెచ్చించవలసి ఉంటుందని (Chen, 1999) ఒక అంచనా. చైనాలో ఉన్న అత్యల్ప అక్షరాస్యతను పెంచడానికీ బలహీనవర్గ ప్రజలలో సైతం నిరక్షరాస్యతను రూపుమాపడానికి చైనా ప్రభుత్వం సంప్రదాయ లిపి సరళీకరణ చేసింది. దీనితో చైనీస్ లిపిలో సంస్కరణ మొదలైంది.

చైనీస్ లిపిని సంస్కరించడమూ రోమనీకరణమూ చైనా పాఠనిధి ప్రణాళికలో భాగంగా ప్రారంభం అయ్యింది.

1951 లో చైర్మన్ మావో చైనీస్ లేఖన వ్యవస్థను తప్పక సంస్కరించాలని సూచించారు. సర్వసాధారణంగా ప్రపంచంలోని అనేక భాషల లేఖనవ్యవస్థలు అక్షరాత్మక లిపి మీద ఆధారపడినట్లుగా చైనీస్ లేఖన వ్యవస్థ కూడా రూపొందాలని మావో చెప్పారు (Zhou, 2004).

భాషా స్థాయి ప్రణాళిక :

చైనా జాతీయప్రభుత్వం మాండరిన్ ను అధికార భాషగా గుర్తించిన నాటినుండి దానిని అధికారభాషగా ప్రచారం చేస్తోంది. చైనీస్ జనాభాలో 70 శాతం మందికి పైగా మాండరిన్ భాషామాండలికాలు మాట్లాడతారు (Norman, 1988). ఇంత ఎక్కువ సంఖ్యలో వ్యవహర్తలు ఉండడం వల్ల మాండరిన్ భాష చైనాదేశపు జన సామాన్య భాష (Common Language) అనే భావన కలుగుతోంది.

'ప్యూపుల్స్ డైలీ' చైనీస్ భాషాలిపి సంస్కరణల వ్యాప్తికి ప్రయత్నించాలనీ, మాండరిన్ చైనీస్ భాషా ప్రామాణికతలను వ్యాప్తి చేయాలనీ ఒక సంపాదకీయాన్ని ప్రచురించింది.

1956లో మాండరిన్ చైనీస్ ఆధికారికంగా PRC (Guo, 2004) కోసం పుతోంగ్వా ను (Putonghua) జన సామాన్య భాషగా స్వీకరించింది.

'ప్యూపుల్స్ డైలీ' 'మాండరిన్ భాషా విస్తృత వ్యాప్తి' అనే ఒక పత్రాన్ని ప్రచురించింది. వివిధ పద్ధతుల ద్వారా ఈ భాషా ప్రణాళికలు భాషావ్యవహారంలో అమలుచేయబడ్డాయి. షోమీ అభిప్రాయం ప్రకారం (Shohamy 2005) విధాన చట్టాలలోనూ నియమ నిబంధనలలోనూ భాషా ప్రణాళికలలోనూ భాషా పరీక్షలలోనూ అలాగే బహిరంగ ప్రదేశాలలో భాషావినియోగాలలోనూ ఈ అమలు వర్తిస్తుంది. గణతంత్ర చైనాలో దేశవ్యాప్తంగా జన సామాన్య వ్యవహారంలో ఉన్న భాషా లిపులపై PRC లో మొదటి చట్టం వచ్చింది. ఇది ప్రజల చట్టం పేరుతో, జూలై 5, 2000 న ఆమోదించబడింది.

సూత్రీకరణలలోనూ పరిణామక్రమంలోనూ, సామాజిక తంత్రవిద్యా పరిధుల వాస్తవిక అవగాహనలోనూ స్థానికభాషల నిత్యవ్యవహారంలోనూ ఈ భాషా చట్టం ప్రతిఫలిస్తుంది. అలాగే మాండరిన్ భాషా వ్యాప్తి, అక్షరాల సరళీకరణ కూడా ఈ భాషా చట్టం కిందికే వస్తాయి. ఈ భాషా చట్టం ప్రభుత్వ ఆధికారిక కార్యకలాపాలలోనూ ప్రజా వినియోగంలోనూ మాండరిన్ భాషా వినియోగాన్ని పెంచడాన్ని ప్రోత్సహించడానికే గానీ బలవంతంగా, వాస్తవదూరంగా, అధిక ప్రమాణాలతో ప్రజలపై రుద్దడానికి ఉద్దేశించింది కాదు. తగిన సందర్భాలలో అవసరానుగుణంగా వివిధ మాండలికాలను వినియోగించడాన్నీ ఈ భాషా చట్టం అంగీకరించింది. అల్పసంఖ్యాక వర్గాలవారి హక్కులను, వారి వ్యవహార

భాషలను, లిపులను పరిరక్షించడానికీ ఈ భాషా చట్టం వర్తిస్తుంది. ప్రభుత్వ, ఆధికారిక వ్యవహారాలలో స్థానిక ప్రభుత్వాల చేత మాండరిన్ భాషావ్యాప్తి జరిగేలా ఈ భాషా చట్టం చూస్తుంది

కొత్త ప్రణాళిక ప్రకారం, ప్రభుత్వ ఆధికారిక కార్యకలాపాలలో మాండరిన్ భాషనే వాడాలి. ఈ నియమం కిందికి ప్రభుత్వ పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలు, రేడియో, టెలివిజన్ ప్రసారాలు, సినిమాలు, టీవీ నాటికలు మొదలైన సంస్థలు వస్తాయి (Pan, 2005). వీటిలో తప్పనిసరిగా మాండరిన్ భాషనే వాడాలి.

విద్యా విధానంలో భాష :

ఈ భాషా విద్యా ప్రణాళిక ఈ కింది విధంగా అమలులోనికి వచ్చింది.

1. 1956 నుండి అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మాండరిన్ బోధన తప్పనిసరిగా ఉండాలి. అల్పసంఖ్యాక వర్గాల ప్రాంతాలు దీనికి మినహాయింపు.
2. 1960 నుండి, మూడవ తరగతికి పైన ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థుల బోధనలోనూ, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లోనూ బోధన మాధ్యమంగా మాండరిన్ భాష ఉపయోగించాలి.
3. మాండరిన్ భాషా వ్యవహర్తలుకాని యువ ఉపాధ్యాయులూ, ఉన్నత విద్యా బోధన సహాయకులూ లఘు మాండరిన్ భాషా పాఠ్యాంశాల కోర్సుల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి.
4. వేసవిలోనూ శీతకాలంలోనూ ఏడాదికి రెండుసార్లు జరిగే జాతీయ కళాశాల ప్రవేశ పరీక్ష మాండరిన్ చైనీస్ లో నిర్వహించబడుతుంది. ఈ జాతీయ కళాశాల ప్రవేశ పరీక్షకు సంబంధించిన అనువాదాలు టిబెటన్, యుగుర్, మంగోలియన్, కొరియా, కజాఖ్, కిర్ఘిజ్ (Tibetan, Uyghur, Mongolian, Korean, Kazakh, and Kirghiz) అనే ఆరు అల్పసంఖ్యాకవర్గాలకు చెందిన భాషలలో కూడా అందుబాటులో ఉన్నాయి.

ఈ ఆరు అల్పసంఖ్యాకవర్గాల భాషావ్యవహర్తలు చైనాలోని కీలక సరిహద్దు ప్రాంతాలలో ఉన్నారు. యుద్ధాలలో విజయం సాధించాలంటే వారి మద్దతు, సహాయం అవసరం. కాబట్టే చైనా ప్రభుత్వం వీరికి ప్రత్యేక అవకాశాలు కల్పించిందని (Mackerras, 1994) అనుకోవాలి.

ఇతర అల్పసంఖ్యాకవర్గ భాషావ్యవహర్తల పరిస్థితి ఏమిటి? ఈ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ జాతీయ కళాశాల ప్రవేశ పరీక్షలో చైనీస్ అనువాదాన్నే ఎందుకు తీసుకోవాలి ?

చైనీస్ బోధనలో దేశంలోనే అగ్రగామిగా ఉన్న ఒక వర్గం చైనీస్ ను విదేశీ భాషాగా నేర్పేందుకు ఒక పరీక్షను రూపొందించింది. ఇది ఎందుకోసం అంటే చైనాకు లోపలా బయటా ఉన్న చైనీస్ మాతృభాష కాని వ్యవహర్తల కోసం.

1988లో ఈ జాతీయ ప్రామాణిక పరీక్ష ప్రారంభమయ్యింది. దీనిని 'హాన్యు ష్విపింగ్ కఓషి' (Hanyu Shuiping Kaoshi) HSK లేదా చైనీస్ భాషా సామర్థ్య పరీక్ష అని వ్యవహరిస్తారు. విదేశీయులకూ, ప్రవాసంలో ఉన్న చైనీయులకూ, చైనీస్ మాతృభాష కాని అల్పసంఖ్యాకవర్గాల వ్యవహర్తలకు చైనీస్ భాషా సామర్థ్యాన్ని పరీక్షించడానికే ఈ పరీక్ష (Lam, 2005).

మాండరిన్ చైనీస్ భాషా ఆధిపత్యం

అల్పసంఖ్యాకవర్గాల భాషా హక్కులపై మాండరిన్ చైనీస్ భాషా ఆధిపత్య ప్రభావం ఎక్కువగా ప్రతికూలంగానే ఉంది. 1956 లో ప్రధానప్రదేశాలలో అధికార భాషగా మాండరిన్ చైనీస్ భాషను వ్యాప్తి చేయడం ప్రారంభమయ్యింది. ఇది దేశంలోని ప్రభుత్వోన్నత స్థాయిలోనే జరిగింది (Zhou, 1999).

PRC కి చెందిన 1982 రాజ్యాంగ 19 వ ప్రకరణం (పైన పేర్కొన్న విధంగా అల్పసంఖ్యాక వర్గాల చట్టానికి సంబంధించిన 37వ ప్రకరణానికి విరుద్ధంగా) దేశవ్యాప్తంగా పుతోంగ్వా [మాండరిన్ చైనీస్] వినియోగాన్ని (బీజింగ్ ప్రామాణికం) సూచించింది. దీని ప్రభావం వల్ల మాండరిన్ చైనీస్ దేశవ్యాప్తంగా వ్యాప్తిలోనికి వచ్చింది. అల్పసంఖ్యాక వర్గాల వారి భాషలకు ఆ అవకాశం దక్కలేదు (Zhou, 2004).

9.4 జాపనీయ జాతీయ భాషా విధానం :

ప్రపంచీకరణ సందర్భంలో జాపనీయ భాషావిధానం జాపనీయ విద్యావ్యవస్థలో భాషా విధానం జాతీయ/అంతర్జాతీయ భాషావాదాలకు అతీతమైనదిగా కనిపిస్తోంది. ప్రస్తుతం మనం ప్రపంచీకరణ యుగంలో ఉన్నాం. చాలా దేశాల లక్ష్యం దేశీయ విపణిలో ఆర్థికోన్నతి సాధించడమే. అలాగే ప్రపంచ విపణిలో ఆర్థికపరమైన పనితీరును మెరుగుపరచుకోవడమే. దీనికోసం ఆంగ్లభాషావిధానం విద్యావ్యవస్థలో ఓ సాధనం అవుతోంది. చివరకు భాషల ఎంపికకూ ఆర్థిక అభివృద్ధికీ ప్రత్యక్ష సంబంధం కనిపిస్తోంది.

జాపనీయ భాషావిధానకర్తలు అమెరికా సంయుక్త రాష్ట్రాలు మరియు బ్రిటన్ చేస్తున్న ఆంగ్ల భాషావ్యాప్తిని వలసవాదానికి మారుపేరుగా గుర్తిస్తారు. తమ ప్రయోజనాలను ఆంగ్ల విస్తరణ ద్వారా సాధించడమే లక్ష్యమని బ్రిటిష్ కౌన్సిల్ చెబుతోంది. ఇలాంటి భాషా విధానాలు వలసవాద రాజకీయ స్వభావాన్ని స్పష్టం చేస్తున్నాయని అంటారు. ఆంగ్లవిద్య

ముఖ్య లక్ష్యం ఆర్థిక వనరుల ఉత్పత్తి రూపంలో దిగుమతి అవుతున్న సామ్రాజ్యవాదం అని స్పష్టమౌతోంది. ఆంగ్ల భాషా వ్యాప్తి వల్ల ప్రభావితమైన ఆయా దేశాలలో తీవ్రమైన రాజకీయ, సామాజిక సమస్యలు తలెత్తాయి. ఆంగ్ల భాషా సామ్రాజ్యవాద దృక్పథంలో ఈ ప్రపంచం “సహజంగానే అసమానతల మయం”. ఆంగ్లేతర దేశాలు ఆంగ్లం మాట్లాడే దేశాలతో ఉన్న ఆర్థిక సంబంధాలవల్ల వాటికి లోబడి చెప్పినట్లు వినేవిధంగా మారిపోయాయి. ఈ శక్తులు సాంస్కృతిక, శాస్త్రీయ, ప్రసార సామ్రాజ్యవాద భావనలకు తగినట్లుగానే జాతి, లింగ, వర్గ వివక్షతలను కల్పించి విద్వేషాలను పెంచుతున్నాయి. ఇలాంటి సంస్కృతిని నియంత్రించడం అలాగే వ్యాప్తిచేయడం వల్ల విశ్వవ్యాప్తంగా వలసవాదం కంటే కూడా బడుగు దేశాల స్వాతంత్ర్యానికే ఎక్కువ ముప్పు పొంచి ఉంది.

ఆంగ్లభాషా సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనేందుకు జపాన్ విద్యావ్యవస్థలోని భాషా విధానంలో జాతీయవాద లేదా విస్తరణవాద ఆధారిత ఆలోచనలు ప్రధానమైనవి కావు అల్పసంఖ్యాక వర్గాలభాషల వ్యాప్తి అనే ధ్యేయం మాత్రం ఉంది. ఆంగ్ల విద్యను విధిగా అభ్యసించాలన్న ఆలోచన రాకుండా చేయడమే దాని వెనుక ఉన్న సంకల్పం.

అందరూ జపాన్ ను ఒకే భాషాసమాజం గల దేశంగా భావిస్తారు. కానీ వాస్తవానికి 12.75 కోట్ల జపనీయులలో ఐనూలు (Ainus), ఒకినావాలు (Okinawans) అనే రెండు స్వదేశీ సమూహాలు ఉన్నాయి. చైనీస్, కొరియన్, ఫిలెప్పినో, లాంటి విదేశీయులూ ఉన్నారు. వారి భాషల హక్కుల పరిరక్షణ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని వహిస్తోంది. జపనీయుల జనాభాలో సుమారు 2% ఐను, ర్యుక్యువన్ మాట్లాడతారు. వారిలో ఐనూలు, ఒకినావా, కొరియన్లు / చైనీయుల వంటి కొన్ని అల్పసంఖ్యాక జాతులవారు ‘జాపనీయ’ వర్గంలో ప్రచ్ఛన్నంగా ఉండడానికి మొగ్గుచూపుతున్నారు.

జపాన్ విద్యా విధానాలు అంతర్జాతీయ సమాచార ప్రసరణపైనే దృష్టి సారిస్తున్నాయి. జాపనీయ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖలో ఒక సలహా సంఘమైన జాతీయ భాషా సంఘం, జాపనీయ భాష మీద ప్రస్తుత విధానం పేర్కొంది. ఆ నివేదికలో మూడు అంశాలు ఉన్నాయి. అవి:

1. జాపనీయ భాషా అభివృద్ధికి జపాన్ భాషను అంతర్జాతీయం చేయడం.
2. అంతర్జాతీయ ప్రసార వ్యవహారాల కోసం జాపనీయ భాషను మలుచుకోవడం
3. జాపనీయ భాషా వ్యాప్తిలో భాగంగా జాపనీయ భాషను విదేశీ భాషగా/రెండవ భాషగా నేర్చుకునే వారికి ప్రోత్సాహకాలను అందించడం;

జాపనీయ భాషాభివృద్ధికి మండలి నివేదిక చూపిన కారణాలు :

1. భాషా వ్యవహర్తల సంఖ్య పరంగా జపాన్ ప్రపంచంలో 10 వ స్థానంలో ఉంది.
2. జాపనీయ అభ్యాసకుల సంఖ్య పెరుగుదల.
3. జాపనీయ భాష ద్వారా సాంస్కృతిక ప్రసరణకు సౌలభ్యం;
4. ఆంగ్ల ఆధిపత్య ప్రపంచంలో బహు భాషా వ్యవహారానికి గల ప్రాముఖ్యత.

జాపనీయ భాషను అంతర్జాతీయ విస్తరణకు ఒక భూమికగా నిలిపేందుకు జాపనీయ దేశ సంస్కృతి గురించి ఇతర దేశాలకు తెలియజెప్పడం. అలా సమాచారాన్ని అందజేయవలసిన అవసరాన్ని మండలి నివేదిక ముందు సూచించింది.

జాపనీయ భాషావ్యాప్తి చేయాలన్న మండలి ఆలోచన యునైటెడ్ స్టేట్స్ మరియు బ్రిటన్ విధానాలతో పోలిస్తే చాలా భిన్నమైనది. ఆ దేశాలలాగా జపనీస్ భాషాభివృద్ధి ఆలోచనలో ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను పరోక్షంగా చొప్పించడం ఎంతమాత్రమూ ఉండదు. అదే మండలి నివేదికలోని ప్రత్యేకత. అయితే, పర్యావరణ వైవిధ్యపరమైన జాపనీయ భాషా విస్తరణద్వారా ఆంగ్ల ఆధిపత్యాన్ని అడ్డుకొనే వీలు ఉంటుందని మండలి నివేదిక వివరిస్తోంది.

రెండవ తరహా సూచనలలో మండలి నివేదిక ప్రపంచీకరణ గురించి చర్చించింది. అయితే ఇది అల్పసంఖ్యాక సమూహాల అంతర్గత జాతీయ అవగాహనపై పట్టుబట్టదు. విదేశాలలోకూడా జాపనీయ భాషా విస్తరణ ద్వారా ఆంగ్ల ఆధిపత్య ధోరణికి ప్రతి సవాలు విసరడానికి ప్రయత్నిస్తుంది.

ఈ గ్లోబల్ ప్రపంచంలో, సమాచార ప్రసారం, ప్రజల విదేశీయానాలూ, ఉత్పత్తుల రవాణాలూ ఒకరిపై ఒకరు ఆధారపడడం ఎక్కువయ్యాయి. ఇది అంతర్జాతీయ ఆర్థికపరమైన స్పర్థను తెచ్చిపెట్టింది. దీనినే మహాపోటీ అనవచ్చు. ఈ అవగాహన ఆధారంగా ఆంగ్లం "సాధారణ అంతర్జాతీయ భాషగా" భావించబడింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల విద్యవల్ల పిల్లలకు న్యాయం జరిగిందా అన్నది సందేహమే.

ఆధునికీకరణ అంటే అంతర్జాతీయాకరణ అని. అది పాశ్చాత్యీకరణకు అమెరికీకరణకు సమానమనే భావన సమర్థనీయం కాదు. జాపనీయ భాషా సామర్థ్యం కోసం ఆంగ్ల భాషా సామర్థ్యం పెరగాలనే వాదన సమస్యాత్మకం. స్థానిక, స్థానికేతర జాపనీయ భాషా వ్యవహర్తల కోసం, వారికి సంబంధించిన విదేశీ భాష అధ్యయనంలో జాపనీయ భాష ఒక సాధనం మాత్రమే.

జాపనీయ విద్యా విధాన పునస్సమీక్షకోసం భావనాత్మక ప్రణాళిక:

ఈ భాషా విధానం అల్పసంఖ్యాక వర్గాలనూ మిశ్రమ అస్తిత్వాలనూ గౌరవించడం ద్వారా భిన్నత్వాన్ని సమర్థిస్తుంది. ఇది రాజ్యాంగ లక్ష్యసాధన క్రమంలో మానవహక్కులకు అంతర్జాతీయ గౌరవాన్ని సాధించే ఉద్యమాలనూ సమర్థిస్తోంది.

భాషా సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించి, వర్తమాన అసమానతలను రూపుమాపడానికి సాంస్కృతిక విద్యామంత్రిత్వశాఖ ఉద్దేశించిన ప్రణాళికలో కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇది ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవడానికే పరిమితమయ్యింది. తగిన ఆంగ్లభాషా సామర్థ్యం లేకపోవడం వలన జపాన్ ప్రజలకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది నిజమే. అయితే ప్రపంచవ్యాప్తంగా మాతృభాషను గౌరవించాలని జరిగే ఉద్యమాలలో అల్పసంఖ్యాక వర్గాల భాషా పరిరక్షణల గురించిన ప్రస్తావనే ఉండదు.

ఆంగ్ల భాషా సమర్థనకు ప్రాథమిక ప్రేరణ ఆర్థికపరమైన పోటీ. ఇది ఒక పెను సవాలుగా కనిపిస్తోంది. ఏది ఏమైనా భాషావాద, జాతివాద, లింగవాదాలతో సారూప్యత ఒకవేళ ఉంటే పోటీ ప్రపంచంతో తలపడాలి అనుకొంటే మీరు ఆంగ్లం మాట్లాడాలి అనే తర్కానికి లోబడి ఉండాలి. ఇది మనకు అభిలషణీయం కాదు. రాజ్యాంగ లక్ష్యమైన మానవ హక్కుల గౌరవం విషయంలో జపాన్, సామ్రాజ్యవాదకుట్రలో భాగస్వామి కాకూడదు. ఆంగ్ల భాషా సామ్రాజ్యవాదం భాషా హక్కులను కాలరాసి, జాతిస్వేచ్ఛను హరించి లింగవివక్షను పెంచుతోంది. ఇది మానవ మనుగడకు హానికరం.

అల్పసంఖ్యాక వర్గాల భాషా హక్కుల నిరాకరణ హక్కుల ఉల్లంఘనే. ఇది ఐరాస గుర్తించిన నూతన మానవ హక్కులను గుర్తించడంలోనూ ఒక వైఫల్యమే. అలాగే, అంతర్గత అల్పసంఖ్యాక వర్గాల సమస్యల పట్ల శ్రద్ధ లేకపోవడం సంప్రదాయవాదానికి దారితీస్తుంది. భవిష్యత్తులో రాజకీయ, ప్రజా జీవనంలో సంప్రదాయ వాదం తీవ్ర జాతీయవాదానికి దారి తీస్తుంది.

ఆంగ్ల సామ్రాజ్యవాద నిరోధానికి ప్రతిరూపంగా *బహుభాషిత్వం* మెరుగుపడుతోంది. ఆంగ్ల ఆధిపత్య శక్తికి ఒక ఎదురుదాడి అవసరం అవుతోంది. ఇది యూరోపియన్ యూనియన్ లో ఇప్పటికే అందరికీ తెలిసిన ఒక ఉదాహరణ. బహుభాషిత్వాన్ని ప్రోత్సహించడానికి, భాషాద్వేషాలకు సంబంధించి ఏకభాషిత్వం సాధారణంగా ప్రమాదంగా పరిణమించిన చోట బహుభాషిత్వం అవసరం అవుతాయి (Skutnabb – Kangas, Philipson, 2001 లో ప్రకటితం). పారిశ్రామిక సమాజాల్లో భాషా వైవిధ్యాన్ని ఇది సంరక్షిస్తుంది.

భాషావిధానం సంకుచితమైన జాతీయవాదం వైపు దారితీసే ప్రమాదం లేకుండా సమానత్వమూ, ఉత్పత్తీ లక్ష్యాలుగా ఒక కొత్త విధానం రూపొందించటం కోసం ఈ కింద సూచించిన ఐదు రకాల కార్యక్రమాలు నిర్ణాయకాలుగా ఉన్నాయి :

1. ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్ల విద్యను అమలుచేయడాన్ని నిరోధించడం
2. అన్ని ప్రవేశ పరీక్షల నుండి ఆంగ్లాన్ని మినహాయించడం
3. అంతర్జాతీయ, జాతీయాంతర్గత అవగాహన కోసం ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించి ఐను, ఒకినోవా భాషలతో సహా అల్పసంఖ్యాక వర్గాలభాషల పరిచయం;
4. పాఠశాల / కళాశాలలలో అల్పసంఖ్యాక వర్గాలభాషలను చదువుతూ అదనంగా వారికి మూడవ భాషగా ఆంగ్ల విద్యకు అవకాశం ఇవ్వడం. అంటే తప్పనిసరి ఆంగ్ల విద్యను రద్దుచేయడం.
5. భాషా బోధనలో విమర్శనాత్మకమైన బోధన శాస్త్రాన్ని ప్రచారంలోనికి తీసుకురావడం.

జపాన్ పాఠ్య ప్రణాళిక :

విద్యావ్యవస్థలో జాపనీయ పాఠశాల వ్యవస్థ సమీక్ష

1. ప్రాథమికపాఠశాల

ఆరు సంవత్సరాలు: **జాపనీసు లేక ప్రాంతీయభాష** మాత్రమే.ఆంగ్లం ఉండదు.

2. జూనియర్ హైస్కూల్ (ఉన్నత పాఠశాల)

మూడు సంవత్సరాలు: **జాపనీసు + ఆంగ్లం** ప్రాథమిక బోధన.

3. సీనియర్ హైస్కూల్ (ఉన్నత పాఠశాల)

మూడు సంవత్సరాలు. **జాపనీసు + ఆంగ్లం** సాధారణ బోధన.

4. విశ్వవిద్యాలయం

నాలుగు సంవత్సరాలు **ఆంగ్లం ఐచ్ఛికంగా ప్రత్యేక బోధన.**

మొదటి తొమ్మిది సంవత్సరాల విద్యాభ్యాసం (ప్రాథమిక పాఠశాల / జూనియర్ ఉన్నత పాఠశాల) తప్పనిసరి. అదనంగా, కిండర్ గార్టెన్లు (పూర్వ ప్రాథమిక పాఠశాల) కూడా ఉన్నాయి;

శారీరక, మానసిక వికలాంగులకూ తంత్ర విద్యాసక్తి కల వారికీ ప్రత్యేకంగా పాఠశాలలూ కళాశాలలూ ఉన్నాయి.

ఆంగ్లాన్ని సూత్రప్రాయంగా విదేశీ భాషా తరగతి కోసం ఎంపిక చేసుకొన్నట్లయితే జూనియర్ / ఉన్నత పాఠశాల స్థాయిలలో విదేశీ భాష తప్పనిసరి అని జాపనీయ పాఠ్యప్రణాళికలోఉంది.

ప్రాథమిక పాఠశాలల పాఠ్యప్రణాళికలో ఆంగ్ల విద్య అవసరం లేదు, ఎందుకంటే వైశ్విక అధ్యయనాలలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో పుష్కలంగా విదేశీ భాషా సంవాదాలను నేర్పిస్తున్నారు. పైగా 2008 మార్చిలో వారానికి ఒక తరగతి కింద విదేశీ భాషా కార్యకలాపాలను పరిచయం చేయాలని దానిని 5, 6 తరగతులలో మాత్రమే 2011లో పరిచయం చేశారు.

విద్యా లక్ష్యాలు, సాధించిన లక్ష్యాలు :

జూనియర్ ఉన్నత పాఠశాల ఆంగ్ల తరగతి కోసం 2001 విద్యా లక్ష్యాలు

1. సాధారణ ఆంగ్లంలో వక్త భావాన్ని అర్థం చేసుకోనేలా విద్యార్థులను తీర్చి దిద్దడం
2. ఆంగ్లంలో చదివే అభ్యాసాన్ని పరిచయం చేయడం,
3. ఆంగ్లంలో రాసే అభ్యాసాన్ని పరిచయం చేయడం, సాధారణ ఆంగ్లంలోవిద్యార్థులు తమ భావాలను వ్యక్తం చేయడం

ఇవి అన్నీ ఆంగ్లభాషలో పఠన లేఖన సామర్థ్యాలను పెంపొందించేవే. అప్పటికే ఆంగ్లభాషా సామర్థ్య అభ్యాసాలు ప్రాథమిక విద్యాస్థాయిలో ఉన్న వాటిని పాఠ్యప్రణాళికల నుండి తొలగించారు. సీనియర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాధారణ ఆంగ్లం అంటే 1200 పదాలు, వాటి వ్యవహారం, కొన్ని జాతీయాలు నేర్పడం. అలాగే కొన్ని వ్యాకరణ అంశాలను పరిచయం చేయడం.

9.5 రాజ్యాంగం గుర్తించిన భాషలు

9.6 తెలుగు వ్యవహారంలో ఉన్న రాష్ట్రాలలో భాషా విధానం

1. తెలుగు వ్యవహర్తలు అధిక సంఖ్యాక వర్గాలుగా ఉన్న రాష్ట్రాలు

		2001
1.	ఆంధ్ర ప్రదేశ్	6, 39, 04, 791
2.	తెలంగాణ	

2. అల్ప సంఖ్యాక వర్గాలు తెలుగు వ్యవహర్తలుగా ఉన్న రాష్ట్రాలు

1. తమిళనాడు	35, 27, 594
2. కర్ణాటక	36, 98, 657
3. పాండిచ్చేరి	50, 908
4. మహారాష్ట్ర	14, 05, 958
5. ఒడిశా	712, 614
6. అండమాన్/నికోబార్ దీవులు	45, 631
7. చత్తీస్ గడ్	1, 48, 131
8. మధ్య ప్రదేశ్	26, 602
9. పశ్చిమ బెంగాల్	2, 08, 769

2011భాషాసంబంధిత జనాభా లెక్కల ఫలితాలు ఇంకా విడుదల కాలేదు.

9.7 కొన్ని ప్రధానమైన భాషాశాస్త్ర గ్రంథాలు

1. కృష్ణమూర్తి, భద్రిరాజు. 1974. తెలుగు భాషాచరిత్ర. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 1999. భాష, సమాజం, సంస్కృతి.హైదరాబాద్: నీల్ కమల్ పబ్లికేషన్స్.
3. గోపాలకృష్ణయ్య, వడ్లమూడి. 1955. ధ్వని – లిపి – పరిణామం, పడమటలంక: ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు,
4. _____________. 1958. వ్యావహారిక భాషా వ్యాకరణం. రాజమహేంద్రవరము: అద్దేపల్లి అండ్ కో, సరస్వతీ పవర్ ప్రెస్.
5. దొణప్ప, తూమాటి. 1972. భాషాచారిత్రక వ్యాసావళి. హైదరాబాదు: అభినందన సమితి.

6. ___________. 1987. వైకృతపద స్వరూప నిరూపణము. హైదరాబాదు: అభినందన సమితి.
7. ___________. 1957. ఆంధ్రలక్షణ సంగ్రహము. మదరాసు: సాహిత్యమందిరము,
8. బూదరాజు, రాధాకృష్ణ.1995. భాషాశాస్త్ర వ్యాసాలు. హైదరాబాదు: విశాలాంధ్ర ప్రచురణ,
9. రామకృష్ణయ్య, కోరాడ. 1968. సంధి. మదరాసు: త్రివేణీ పబ్లిషర్స్.
10. రామారావు, చేకూరి. 1975. తెలుగు వాక్యం.హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
11. సుబ్రహ్మణ్యం, పి.యస్.1997. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.హైదరాబాద్: పొ.శ్రీ.తె.వి.వి.
12. Arden, A. H. 1921. A Progressive Grammar of Telugu Language, Madras.
13. Krishnamurti, Bh. 1972.Telugu Verbal Bases. New Delhi: Motilal Banarsidass Publications.
14. Mahadevasastry, K.1969. Historical Grammar of Telugu. Tirupati: SVU.
15. Suryanarayana, J.1957. A Study of Telugu Compounds. Tirupati: SVU.
16. Ranganadhacharyulu, K.K. 1987. A Historical Grammar of Inscriptional Telugu (1401 AD to 1900 AD). Hyderabad: Center for Advanced Study in Linguistics, O.U.
17. Suryanarayana, J. 1957. A Study of Telugu Compounds. Tirupati: SVU.

9.8 కొన్ని ప్రధానమైన నిఘంటువులు

1. కోదండరామిరెడ్డి, మరుపూరు (సం.). 1970. మాండలికపదకోశం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
2. చలం., జి. యస్. (సం.). కళింగాంధ్ర మాండలికం – 1. శ్రీకాకుళం: శ్రీకాకుళ సాహితి.

3. నరసింహారావు, అత్తలూరి. 1977. రావిశాఖీయం. విశాఖపట్నం.
4. భాస్కర్, నలిమెల. (సం.). 2010. తెలంగాణా పదకోశం. హైదరాబాదు,
5. పురుషోత్తం, బొడ్డుపల్లి, శ్రీహరి రవ్వా (సంకలన కర్తలు) 1997. వ్యాకరణ పద కోశం. (పరిష్కర్త. దువ్వూరి వేంకట రమణ శాస్త్రి)హైదరాబాద్: తెలుగు అకాడమీ.
6. రమాపతిరావు, అక్కిరాజు. 1985. మాండలికపదకోశం.
7. రామయ్య పంతులు, జయంతి.1979. సూర్యరాయాంధ్ర నిఘంటువు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
8. లక్కంసాని చక్రధరరావు (సం.) 1978. తెలుగు వ్యుత్పత్తి కోశం. వాల్తేరు: ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రచురణ.
9. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2010. శబ్ద రత్నాకరం.న్యూ ఢిల్లీ: ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్.
10. Burrow, T., & Emeneau, M.B.1984. A Dravidian Etymological Dictionary (Revised). Oxford: Clarendon press.

9.9 మాండలిక వృత్తి పదకోశాలు, మాండలికభాషా పరివర్తనాల తయారీ

ప్రజలూ సృజనకారులూ, ప్రభుత్వమూ ప్రసారమాధ్యమాలూ పారిభాషిక, మాండలిక పదాలను వ్యాప్తిలోకి తేవడానికి కృషిచేయాలి. తెలుగు భాషకు ఉన్న అన్ని మాండలికాలకూ ఒక మాండలికం నుంచి మరో మాండలికానికి పరస్పరం స్వయంచాలకంగా త్వరితగతిన మార్చుకొనేలా పరివర్తనాలు తయారవ్వాలి. తెలుగు నిఘంటువుల తయారీ కూడా అవసరాలకు తగినంతగా లేదు. అన్ని మాండలికాలకు సమ ప్రాధాన్యం కల్పించేలా నిఘంటునిర్మాణం జరగాలి. దీనికి ముందుగా ప్రాచీన సాహిత్యంలోని భాషకు కవులవారీగా కావ్యాలవారీగా యుగాలవారీగా నిఘంటువులు రావాలి. శాసనపదకోశాల ఆవశ్యకతా అంతా ఇంతని చెప్పలేం. అందుకని శాసనాలలోని సహజసిద్ధమైన వ్యావహారిక, మాండలిక పదాలను సేకరించేందుకు ఆధునిక భాష ఆవసరాలను తీర్చుకొనేందుకు శాసనపద నిఘంటువులు రావాలి.

అనేక సామాజిక రాజకీయ కారణాల చేత తెలుగులో నిఘంటు రచన వెనుకబడింది. ఆ వెనుకబాటుతనమే ఇప్పటికీ తెలుగుభాషలో కొనసాగుతూ వస్తోంది.

ప్రాచీన కాలంలో వచ్చిన తద్భవకోశాలు, ద్వైరూప్యకోశాలు, ఆ యా కాలాలలో కావ్యరచనలకోసం కవులను దృష్టిలో పెట్టుకొని తయారయినవే. వీటి కొనసాగింపులో భాగమే తెలుగులో వెలసిన మొట్టమొదటి నిఘంటుత్రయం. వీటి తర్వాత వచ్చిన

నిఘంటువులూ తెలుగుభాషకు కాలానుగుణంగా వచ్చే అవసరాలను తీర్చేదిశగా రూపొంద లేదు. ఒక్కొక్క అవసరానికి ఒకొక్క నిఘంటువుని ఆశ్రయించవలసిన పరిస్థితి ఉంది. వ్యుత్పత్తులకోసం తెలుగు వ్యుత్పత్తికోశాన్ని, మాండలికపదాలకోసం మాండలికపదకోశాలనూ వెతుక్కొనే అగత్యం ఏర్పడింది. అన్ని అవసరాలూ తీర్చే నిఘంటువు తెలుగులో లేదు. మాండలికవృత్తిపదకోశాలపై విశేషమైన కృషే జరిగింది.

భద్రిరాజు కృష్ణమూర్తిగారి సంపాదకత్వంలో వివిధ మాండలిక వృత్తిపద కోశాల నిర్మాణంలో భాగంగా వ్యవసాయ, వాస్తు, చేనేత, కుమ్మరం, కమ్మరం, మత్స్య, వేట, అడవులు, గీతపరిశ్రమ, మేదర, లోహకారాది వృత్తులకు సంబంధించిన కోశాలు రూపొందాయి.

మాండలికపదాలపై ఇంత కృషి జరిగినప్పటికీ అది జనబాహుళ్యానికి అందలేదు. ఇంకా తెలుగుభాషలో నిఘంటువులకు ఎక్కని పదాలు సంఖ్యాధికంగా ఉన్నాయి. కొన్ని సంప్రదాయ వృత్తి పద కోశాల తయారీ విషయంలో అకాడమీలు చేసిన కృషి గణనీయమయినది. తెలుగు మాటాడే ప్రజలతో సంబంధం ఉన్న సంప్రదాయ, సంప్రదాయేతర ఆధునిక వృత్తులపై కూడా పరిశోధన జరగవలసి ఉంది. తెలుగువారికి ఎన్నో ఆటలు ఉన్నాయి. ఆ ఆటలలో ఉన్న ఎన్నో పదాలు నిఘంటువులకు ఎక్కలేదు. వీటిని కోశస్థం చేయకపోతే కొన్నాళ్ళకు నశించిపోయే ప్రమాదమూ ఉంది.

మాండలికభాషా పరిశోధనల వల్ల భాషాసంపద వృద్ధి చెందుతుంది. వివిధ మాండలికపదాలపై కేవలం భాషావిషయికంగానే కాక సామాజిక సాంస్కృతిక నేపథ్యాలనుంచి కూడా పరిశోధనలు జరగాలి. ప్రాచీన కవిప్రయోగాలలో ఉన్న మాండలిక పదపరిశీలన ద్వారా నాటి సామాజిక చరిత్ర తెలుస్తుంది. ఆధునికంగా అధికమవుతున్న అన్యభాషావినియోగాన్ని తగ్గించడానికి మాండలిక పదాలే శరణ్యం. ప్రకృతిని, పరిసరాలను పరిశీలించి సమాజంలో ఉండే ఒక వ్యక్తిగా వ్యవహర్త సృష్టించిన సహజసిద్ధమయిన పదాలు మాండలికాలలోనే దొరుకుతాయి. ప్రాంతాలు వేరైనా మానవ జీవనం, ఆలోచన ఒక్కటే. ఇప్పుడు అన్యభాషలనుంచి వస్తున్న పదజాలానికి తగిన పదాలు మన మాండలికభాషలలో వెతికితే తప్పకుండా దొరుకుతాయి. పదవ్యుత్పత్తులను అధ్యయనం చేయడం ద్వారా వివిధ భాషాసమస్యలకు కూడా పరిష్కారాలు దొరుకుతాయి. నిఘంటు విస్తృతి పెరుగుతుంది. మాండలిక పద వివేచన ద్వారా భాషాశాస్త్ర పరిశోధనలకు మౌలిక ఆధారాలు లభిస్తాయి.

సామాజిక భాషా శాస్త్ర విశ్లేషణ, సాంఘిక – రాజకీయ నేపథ్యాలనుంచి చరిత్రనూ, సంస్కృతినీ, ప్రజాజీవితాన్ని అధ్యయనం చేయటం, భాషా సామరస్యాన్నీ, వర్గసామరస్యాన్నీ సాధించటం మాండలిక అధ్యయనం వల్ల సాధ్యమవుతుంది.

వివిధ ప్రాంతాల మానవ జీవన పరిశీలనకు అవకాశం ఏర్పడుతుంది. భావవినిమయం, సంస్కృతి వినిమయం తద్వారా విశాల దృక్పథమూ అలవడుతుంది.

సృజన రంగాలలోనూ భాష ప్రధానపాత్ర పోషిస్తుంది. ఎంతగా ప్రయత్నించినా కవి తన ప్రాంతీయతనూ, ప్రాంతీయ భాషనూ ప్రదర్శించకుండా ఉండలేడు. ఆయా కవులు ప్రయోగించిన మాండలిక పదాలను అధ్యయనం చేయటం వల్ల కేవలం సాహిత్య చరిత్రకు సంబంధించిన కొత్త ఆధారాలూ, ఆలోచనలూ లభించవచ్చు.

మాండలికపద అధ్యయనం ఇటు భాషావినియోగానికే కాక మానవజీవనాభివృద్ధికి దోహదం చేస్తుంది.

ఎంతో కష్టపడి అకాడమీలు సేకరించిన మాండలికపదాలను వ్యాప్తిలోకి తీసుకురాకపోతే దాని వల్ల ప్రయోజనం శూన్యం. పదసంపద కేవలం భాషాప్రియులకూ, పరిశోధకులకూ ఉపయోగపడితే చాలదు. సామాన్య ప్రజలకు అందాలి. వ్యవహారంలోకి రావాలి.

ఆధునికంగా తెలుగు భాషలో ఎన్నో నూతనపదనిర్మాణాలు అవసరమవుతున్నాయి. వాటికి తగిన పదాలు మాండలికభాషలలో వెతికితే కచ్చితంగా దొరుకుతాయి. తెలుగులో అన్యభాషాపదానికి కొత్తపదాన్ని ఖరారు చేయవలసివచ్చినప్పుడు వచ్చే ఇబ్బందుల్ని మాండలిక పదాధ్యయనం వల్ల పరిహరించవచ్చు.

9.9 భారతదేశంలోని అధికార భాషల పట్టిక

ఎనిమిదవ షెడ్యూల్

[Articles 344 (1) and 351]

1. అస్సామీ	2. బెంగాలీ
3. బోడో	4. డోగ్రి
5. గుజరాతీ	6. హిందీ
7. కన్నడం	8. కాశ్మీరీ
9. కొంకణి	10. మైథిలీ
11. మలయాళం	12. మణిపురి
13. మరాఠీ	14. నేపాలీ
15. ఒడియ	16. పంజాబీ
17. సంస్కృతం	18. సంతాలి
19. సింధీ	20. తమిళం
21. తెలుగు	22. ఉర్దూ

9.10 తెలుగు మాన చిత్రం

This is a royalty free image that can be used for your personal, corporate or education projects.
It can not be resold or freely distributed, if you need an editable PowerPoint or Adobe Illustrator version of this map please visit www.bjdesign.com or www.mapsfordesign.com.
This text can be cropped off. © Copyright Bruce Jones Design Inc. 2010

9.11 తెలుగు లిపి పరిణామ క్రమం చిత్రం



9.12 తెలుగు రోమను లిపి

a	ā	i	ī	u	ū	
అ	ఆ	ఇ	ఈ	ఉ	ఊ	
ṛ	ṝ	e	ē	ai		
ఋ	ౠ	ఎ	ఏ	ఐ		
o	ō	au	~	M	H	
ఒ	ఓ	ఔ	ఁ	ం	ః	
ka	kha	ga	gha	ṅa		
క	ఖ	గ	ఘ	ఙ		
ca	cha	ja	jha	ña		
చ	ఛ	జ	ఝ	ఞ		
ṭa	ṭha	ḍa	ḍha	ṇa		
ట	ఠ	డ	ఢ	ణ		
ta	tha	da	dha	na		
త	థ	ద	ధ	న		
pa	pha	ba	bha	ma		
ప	ఫ	బ	భ	మ		
ya	ra	ṛa	la	ḷa	ḻ	va
య	ర	ఱ	ల	ళ	ఴ	వ
śa	ṣa	sa	ha			
శ	ష	స	హ			

9.13 తెలుగు wx notation

a	A	i	I	u	U	q	Q
అ	ఆ	ఇ	ఈ	ఉ	ఊ	ఋ	ౠ

eV	e	E	oV	o	O	M	H
ఎ	ఏ	ఐ	ఒ	ఓ	ఔ	ం	ః

ka	Ka	ga	Ga	fa
క	ఖ	గ	ఘ	ఙ

ca	Ca	ja	Ja	Fa
చ	ఛ	జ	ఝ	ఞ

ta	Ta	da	Da	Na
ట	ఠ	డ	ఢ	ణ

wa	Wa	xa	Xa	na
త	థ	ద	ధ	న

pa	Pa	ba	Ba	ma
ప	ఫ	బ	భ	మ

ya	ra	rYa	la	lYa	va	Sa	Ra	sa	ha
య	ర	ఱ	ల	ళ	వ	శ	ష	స	హ

9.14 యూనికోడ్ పటం

	0C0	0C1	0C2	0C3	0C4	0C5	0C6	0C7
0	◌ఀ 0C00	ఐ 0C10	ఠ 0C20	ర 0C30	◌ీ 0C40		ౠ 0C60	
1	◌ఁ 0C01		డ 0C21	ఱ 0C31	◌ు 0C41		ౡ 0C61	
2	◌ం 0C02	ఒ 0C12	ఢ 0C22	ల 0C32	◌ూ 0C42		◌ౢ 0C62	
3	◌ః 0C03	ఓ 0C13	ణ 0C23	ళ 0C33	◌ృ 0C43		◌ౣ 0C63	
4		ఔ 0C14	త 0C24	ఴ 0C34	◌ౄ 0C44			
5	అ 0C05	క 0C15	థ 0C25	వ 0C35		◌ౕ 0C55		
6	ఆ 0C06	ఖ 0C16	ద 0C26	శ 0C36	◌ె 0C46	◌ౖ 0C56	౦ 0C66	
7	ఇ 0C07	గ 0C17	ధ 0C27	ష 0C37	◌ే 0C47		౧ 0C67	
8	ఈ 0C08	ఘ 0C18	న 0C28	స 0C38	◌ై 0C48	ౘ 0C58	౨ 0C68	౸ 0C78
9	ఉ 0C09	ఙ 0C19		హ 0C39		ౙ 0C59	౩ 0C69	౹ 0C79
A	ఊ 0C0A	చ 0C1A	ప 0C2A		◌ొ 0C4A		౪ 0C6A	౺ 0C7A
B	ఋ 0C0B	ఛ 0C1B	ఫ 0C2B		◌ో 0C4B		౫ 0C6B	౻ 0C7B
C	ఌ 0C0C	జ 0C1C	బ 0C2C	◌఼	◌ౌ 0C4C		౬ 0C6C	౼ 0C7C
D		ఝ 0C1D	భ 0C2D	ఽ 0C3D	◌్ 0C4D		౭ 0C6D	౽ 0C7D
E	ఎ 0C0E	ఞ 0C1E	మ 0C2E	◌ా 0C3E			౮ 0C6E	౾ 0C7E
F	ఏ 0C0F	ట 0C1F	య 0C2F	◌ి 0C3F			౯ 0C6F	౿ 0C7F

■ తొలిగించవలసినవి (0C55, 0C56)

▒ కొత్తగా చేర్చవలసినవి (0C3C)

The Unicode Standard 7.0, Copyright © 1991-2014 Unicode, Inc. All rights reserved.

9.15 తెలుగు అధికారభాషా చట్టాలు మరికొన్ని మైలురాళ్ళు

1955 సెప్టెంబర్ 29న తెలుగులో పాలనకోసం విధాన సభ తీర్మానం.

1959 సమస్యల అధ్యయనానికి ప్రభుత్వ ప్రత్యేక అధికారి నియామకం.

1960 27 శాఖలలోఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగు వినియోగ ఉత్తర్వు.

1961 మరో 4 శాఖలకు విస్తరింపు ఉత్తర్వు.

1962 అధికారిక ముసాయిదాలు వాటి తెలుగు పాఠాల పుస్తకాల ప్రచురణ. 1964 కొఠారీ కమీషన్.

1964 రాష్ట్ర ప్రభుత్వం అనువాద సంఘం, న్యాయశాఖలో ఒక అనువాద విభాగం ఏర్పాటు.

1965 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాష (తెలుగు) ఆధికారిక పత్రాల రచనలపై శ్వేతపత్రం విడుదల.

1966 అధికారభాషా చట్టం 1966 ఈ చట్టం 14.05.1966లో అమలులోకివచ్చింది.

1968 డా. కొఠారీ అధ్యక్షతన కమిటీనియామకం.

1968 శ్వేతపత్రం ప్రచురణ.

1968 జాతీయ విద్యా విధాన ప్రణాళిక,

1969 విద్యా పరిశోధన శిక్షణా మండలి బహిరంగ చర్చానివేదిక.

1974 అధికార భాషా సంఘం ఏర్పాటు.

1978 ఎన్సిఇఆర్టీ విద్యాప్రణాళికలో త్రిభాషా సూత్ర అమలు నిర్ణయం.

1986 జాతీయ విద్యావిధానం త్రిభాషా సూత్రానికి ఆమోదం.

1986 విద్యా విధాన ప్రణాళిక

1986 విద్యావిధానంపై పునరుద్ఘాటన

1988 అక్టోబర్ 2 అధికార భాషగా తెలుగు వాడకంపై ప్రభుత్వం ఉత్తర్వు

1988 నవంబరు 1 1988 అక్టోబర్ 2 ఉత్తర్వు అమలు వర్తింపు తేది

1992 త్రిభాషాసూత్రంఅమలుకోసంభారతఉభయసభలుచేసినకార్యాచరణప్రణాళిక

2010 సాంస్కృతిక శాఖలో విలీనం

2012 అక్టోబర్ లో పునరుద్ధరణ

9.16 మాండలిక వృత్తిపదకోశాలు

వ్యవసాయం	1974	సంపాదకులు భద్రిరాజు కృష్ణమూర్తి (తొలి కూర్పు 1962)
చేనేత	1971	సంపాదకులు : భద్రిరాజు కృష్ణమూర్తి, సహాయ సంపాదకులు, పోరంకి దక్షిణామూర్తి
మత్స్యపరిశ్రమ	1991	సంపాదకులు : తూమాటి దొణప్ప
వాస్తు	1968	సంపాదకులు : బూదరాజు రాధాకృష్ణ
కుమ్మరం	1976	సంపాదకులు : జి. ఎన్. రెడ్డి (వీరే కమ్మరం కంసాలి వృత్తులకూ కోశాలు చేశారు.) సహాయ సంపాదకులు జి. నాగయ్య
మేదర	1992	సంపాదకులు : పోరంకి దక్షిణామూర్తి
లోహకార	1991	సంపాదకులు : జి. నాగయ్య.
		జిల్లాలవారీగా తెలుగు అకాడమీ
విశాఖ	1977	సంపాదకులు : అత్తలూరి నరసింహారావు (రావిశాఖీయం పేరుతో)
నల్గొండ	1986	సంపాదకులు : రవ్వా శ్రీహరి (నల్గొండజిల్లా మాండలిక పదకోశం పేరుతో)
తెలంగాణా	2003	సంపాదకులు : నలిమెల భాస్కర్ (తెలంగాణా పదకోశం పేరుతో)
కళింగాంధ్ర	2006	సంపాదకులు : జి.యస్.చలం. (కళింగాంధ్ర మాండలికం పేరుతో)

9.17 కొన్ని ప్రధానమైన వ్యాకరణ గ్రంథాలు

అథర్వణుడు. 1955. వికృతి వివేకము. మద్రాసు: వావిళ్ళవారి ప్రచురణ.

అనంతామాత్యుడు.1996. ఛందో దర్పణము.రాజమండ్రి: రోహిణీ పబ్లికేషన్స్,

అప్పకవి, కాకునూరి. 1970. అప్పకవీయము.మద్రాసు: వావిళ్ళవారి ప్రచురణ.

ఆంధ్రశబ్ద చింతామణి 1956. మద్రాసు: వావిళ్ళవారి ప్రచురణ.

కేతన, మూలఘటిక.1953. ఆంధ్ర భాషా భూషణము. తెనాలి :అజంతా ఆర్ట్స్

గోపాలకృష్ణయ్య, వడ్లమూడి. 1958. వ్యావహారిక భాషావ్యాకరణం. రాజమండ్రి: సరస్వతీ ప్రెస్

జోగి సోమయాజి, గంటి. 1971. ఆంధ్రభాషా వికాసము. మచిలీపట్నం:

పురుషోత్తం, బొడ్డుపల్లి.1969. తెనుగు వ్యాకరణ వికాసము. గుంటూరు: శ్రీ గిరిజా ప్రచురణలు, బాలసరస్వతి, ఎలకూచి.1971. బాలసరస్వతీయం. మద్రాసు: వావిళ్ళవారి ప్రచురణ.

రాజేశ్వరశర్మ, అమరేశం.1973. ఆంధ్ర వ్యాకరణ వికాసము (ప్రథమ, ద్వితీయ భాగములు). కామారెడ్డి: నిజామాదుజిల్లా, ప్రాచ్యవిద్యాపరిషత్తు ప్రచురణ.

వేంకటేశ్వర్లు, వజ్ఝల. 1982. ఆధునిక ప్రామాణి కాంధ్రవ్యాకరణం – రాజమండ్రి : సరస్వతీ పవర్ ప్రెస్సు

సీతారామాచార్యులు, బహుజనపల్లి 1972. ప్రౌఢవ్యాకరణం. మద్రాసు: వావిళ్ళవారి ప్రచురణ.

9.18 అధికార భాషాసంఘం చేపట్టవలసిన లక్ష్యాలు

ఇతరరాష్ట్రాల జనాభాలో కనీసం 15 శాతం జనాభా తెలుగు వారు ఉంటే ఆ ఉన్న ప్రాంతాలలో తెలుగును రెండవ అధికార భాషగా గుర్తించేలా రెండవ జాతీయ అధికార భాషగా తెలుగును గుర్తించడానికి కృషి చేయడం పాఠశాల విద్యలో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడం ప్రభుత్వ శాఖలలో తెలుగు వాడటానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం నిఘంటువులు, పారిభాషిక పదకోశాలు, సాంకేతిక ఉపకరణాలు, తెలుగు సాఫ్ట్వేర్లు, తెలుగు యాప్స్ మెదలైన వాటి తయారీ, పంపిణీ మొదలైనవి.

9.19 అధికార భాషాసంఘం అధ్యక్షుల జాబితా

1.	వావిలాల గోపాలకృష్ణయ్య	1974–1977
2.	టి. అనసూయమ్మ	1977–1978
3.	వందేమాతరం రామచంద్రరావు	1978–1981
4.	సి. నారాయణరెడ్డి	1981–1985
5.	కొత్తపల్లి వీరభద్రరావు	1985–1986
6.	నందూరి రామకృష్ణమాచార్య	1987–1990

7.	పి. యశోదారెడ్డి	1990–1993
8.	అబ్బూరి వరదరాజేశ్వరరావు, గజ్జల మల్లారెడ్డి	1993–1995
9.	తూమాటి దోణప్ప	1995–1999
10.	మాదుగుల నాగఫణిశర్మ	1999–2002
11.	పరుచూరి గోపాలకృష్ణ	2003–2005
12.	ఏ.బి.కె. ప్రసాద్	2005–2009
13.	మండలి బుద్ధ ప్రసాద్	2012– 2014

9.20 మంత్రిత్వ శాఖలు సత్వరం చేపట్టవలసిన భాషా విధానాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను వాడుక భాషలోకి తెచ్చేలా కేంద్రప్రభుత్వం కృషి చేయాలి. అలాగే ఎనిమిదో ప్రకరణంలో పేర్కొన్న భాషలన్నిటికీ అప్పటికప్పుడు తర్జుమా జరిగే ఏర్పాటు చట్టసభలలోఉండాలి. అందుకు తగిన విధంగా అభివృద్ధి చేసిన భారతీయ భాషల యంత్రానువాదాలనూ హిందీ – ఆంగ్లం – తెలుగు బహుదిశాత్మక యంత్రానువాద వ్యవస్థలు వినియోగంలోనికి తెచ్చుకోవాలి. దానికి కావలసిన యంత్రానువాద వ్యవస్థల నిర్మాణాలను కేంద్ర ప్రభుత్వాలు తమ ప్రణాళికలో పొందుపరుచుకోవాలి. బహుళవ్యవహారంలో ఉన్న ఆంగ్లం ఎప్పటికప్పుడు పరిష్కరణలు చేసుకోవడంవల్లనే విస్తృతప్రచారం పొందింది. సజీవభాషగా నిల్చి ఉంది. అటువంటి పరిష్కార ప్రక్రియ నేటి తెలుగుకు చాలా అవసరం. అందుకోసం పరిశోధనాత్మకమయిన అధ్యయనం చేసి పరిష్కారాల్ని కనుక్కోవాలి. ఈ పరిష్కరణ పదస్థాయిలోను, వాక్యస్థాయిలోనూ జరగాలి.

సుమారు 30 కి పైగా ప్రధాన శాఖలూ చిన్నా చితకా మరో 30 శాఖలూ ఉన్నాయి. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలలోనూ 1. రోడ్లు–భవనాల శాఖ, 2. ప్రచురణల నమోదు శాఖ, 3. ఉద్యానవనాల శాఖ, 4. ప్రజారోగ్యశాఖ, 5. జాగీర్ల నిర్వహణ శాఖ, 6. దేశీయవిద్య–హోమియోపతి శాఖ, 7. ఓడరేవుల శాఖ, 8. గిరిజన సంక్షేమ శాఖ, 9. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, 10. పట్టణ ప్రణాళిక శాఖ, 11. రవాణాశాఖ, 12. మత్స్య శాఖ, 13. పోలీసు శాఖ, 14. ప్రాచ్య లిఖిత గ్రంథాలయ శాఖ, 15. వ్యవసాయ శాఖ, 16. విద్యాశాఖ, 17. పరిశ్రమలు, వాణిజ్య శాఖ, 18. సహకార శాఖ. 19. ఆర్థిక ప్రణాళిక శాఖ, 20. హోం శాఖ, 21. సాగునీటి శాఖ, 22. ప్రధాన పరిపాలన శాఖ, 23. శాసనమండలి (శాసన నిర్మాణ) శాఖ, 24. ప్రధాన పరిపాలన శాఖ25. అటవీ శాఖ 26. సమాచార ప్రసార సాంకేతిక శాఖ 27. విద్యుత్ శాఖ 28. పాడి, పశుపాలన శాఖ 29. వైద్య శాఖ, 30. న్యాయశాఖ మొదలైన శాఖల కోసం కార్యాలయ పదావళి, నమూనా లేఖలు, ప్రభుత్వ

ఉత్తర్వు నమూనాలు ముందుగా సిద్ధంచేసి ప్రభుత్వ ఉద్యోగులకూ అధికారులకూ అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా పాలన పరిభాష సమగ్రంగా తయారు కావాలి.

అన్ని శాఖల ఆధికారిక వెబ్సైట్లు తెలుగులో ఉండాలి. తెలుగు అకాడమీ, సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరులు మొదలైన సంస్థలలతో సంయుక్తంగా పాలనలో, విద్యావ్యవస్థలో పెంచే దిశగా వ్యూహరచన చేయాలి.

కంప్యూటర్లలో తెలుగు వాడకం గురించి వివిధ సాఫ్ట్ వేర్లను తెలుగు ఉపకరణాలను వాడే విధంగా ఉద్యోగులకు తర్ఫీదు ఇవ్వాలి.

మంత్రిత్వ శాఖలన్నింటా తెలుగుభాష వెలుగుల్ని విరజిమ్మాలి. అందుకు ముందుగా ఆధికారిక, పాలనా వ్యవహాలన్నింటిలోనూ తెలుగుభాషా వినియోగం సంపూర్ణంగా జరగాలి.

వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుగులో అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలి. ఆధికారిక వెబ్ సైట్లు, అందులోని సమాచారమూ ఆంగ్లంతో పాటుగా తెలుగులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలి.

ముఖ్యమైన కొన్ని మంత్రిత్వ శాఖలు తెలుగుభాషా వినియోగం, వ్యాప్తి, అభివృద్ధి మొదలైన విషయాలకు సంబంధించిన సత్వరం చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళిక ఇది.

9.20.1 వ్యవసాయ శాఖ:

వివిధ వృత్తులకూ అలాగే వ్యవసాయానికి సంబంధించీ సమగ్ర వృత్తి పదకోశాలు తయారు కావాలి. ఇవి కూడా అన్ని మాండలిక భేదాలనూ కలుపుకొంటూ సాగాలి.

రైతులకు, వ్యవసాయ ఆధారిత వృత్తులవారికీ, ఇతర వృత్తుల వారికీ వారి వారి ఉత్పత్తుల గురించిన సమగ్ర సమాచారాన్ని చరవాణులలో శ్రవణ విధానం ద్వారా అందించే సదుపాయం నేడు అత్యవసరం.

రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలు, విధానాలూ అందినప్పుడే పంటలో అధిక దిగుబడి సాధ్యం. అందుకే రైతులలో అత్యధికులు మాతృభాషా వ్యవహర్తలు, నిరక్ష్యరాస్యులు. అందుకే వారికి ఈ సమాచారమంతా చరవాణిలో అందించాలి. ప్రభుత్వ వెబ్ సైట్లలో తెలుగులోనే పొందుపరచాలి.

స్థానికీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో పంటలకు సంబంధించిన ఎరువులు, విత్తనాలు వ్యవసాయ పరికరాలు ఇంకా చేనేత, చేతివృత్తులు, పాడి, పశుపాలనకు

సంబంధించిన వ్యాపార ప్రకటనలు తెలుగులోనే ఉండాలి. ఇంకా చెప్పాలంటే ప్రాంతీయ మాండలికాలలో ఉండాలి. ఇది అవసరం. అలా ఉండాలనే నియమం ప్రభుత్వమే పెట్టాలి.

ప్రభుత్వం రైతుల గురించి చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, వాతావరణ వివరాలు, సాగుబడికి సంబంధించిన సూచనలు, నాణ్యమైన ఎరువులు, పరికరాలు ఎక్కడ లభ్యమవుతాయన్న విషయాలను ప్రభుత్వం ప్రజలకు చరవాణులలోనూ, ప్రభుత్వ వెబ్ సైట్లలోనూ, ఎప్పటికప్పుడు అందించాలి. అలా అందించడం వల్ల ఆ ప్రభుత్వం రైతు సంక్షేమకారి అయిన ప్రభుత్వంగా వారి అభిమానాన్ని చూరగొంటుంది.

ఇక వృత్తుల విషయానికి వస్తే ప్రపంచీకరణ నేపథ్యంలో ఎన్నో వృత్తులు చితికిపోతున్నాయి. కొన్ని చిక్కి శల్యమయ్యే స్థితిలో ఆదరణకు నోచుకోక అవస్థల పాలవుతున్నాయి.

వృత్తిసేవలు కోరుకొనే వారికీ, వృత్తి నిపుణులకూ మధ్య ఒక చక్కని అనుసంధాన వ్యవస్థను ఏర్పరచాలి. అందుకు ప్రభుత్వం రూపొందించిన తెలుగు వెబ్ సైట్లు వేదిక కావాలి. ఆయా వృత్తులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుగులో అందుబాటులో ఉండాలి.

వ్యవసాయదారులకు, వృత్తి నిపుణులకు ఉపయోగపడేలా సులభంగా ఉండేలా ఆధునిక భాషా ఉపకరణాలు తయారుచేసి వారికి అందుబాటులో ఉంచాలి. తెలుగుకు సంబంధించి ఇప్పటికే ఎన్నో ఉపకరణాలు అందుబాటులోనికి వచ్చాయి (చూ. www.caltslab.uohyd.ernet.in).

9.20.2 పర్యాటక శాఖ:

భాషతో ప్రత్యక్ష సంబంధం ఉండే శాఖలలో ఇది ఒకటి. భాషా వ్యాప్తికి ప్రభుత్వానికి ఇదో చక్కని మార్గం. ఈ శాఖలో భాషా సంస్కరణలు, ఆచరణలు చేపట్టటం ద్వారా మాతృభాషా వ్యవహర్తల అభిమానాన్ని అన్య భాషా వ్యవహర్తల ఆదరణనీ ప్రభుత్వం చూరగొంటుంది.

పర్యాటకులకు సమాచారాన్ని తెలుగులో తప్పనిసరిగా అందించాలి. ఆంగ్లం, హిందీలలో అందించి తెలుగులో లేకపోతే తెలుగు భాషా వ్యవహర్తలు ఇబ్బంది పడతారు. ప్రభుత్వం పట్ల అసహనం వ్యక్తం చేస్తారు.

తెలుగేతర విదేశీ పర్యాటకులకు మనం చూపే మాతృభాషాభిమానమే తెలుగు భాష పట్ల వారికి మక్కువ ఏర్పడేలా చేస్తుంది.

వివిధ పుణ్యస్థలాలు, సందర్శన స్థలాలకు సంబంధించిన చారిత్రక నేపథ్యాలతో కూడిన కథనాలను పర్యాటక వెబ్ సైట్లో తెలుగులోనూ ఇతరభాషలలోనూ అందించగలగాలి.

ఆయా ప్రాంతాలకు సంబంధించిన అత్యవసరమైన సమాచారాన్ని సంక్షిప్త సందేశాలలోనూ అందించవచ్చు.

భిన్న భాషల వారికి సౌకర్యవంతంగా ఉండేందుకు ఒక భాషనుంచి మరో భాషకు అనువర్తనాలను వాడవలసిన అవసరం పర్యాటక శాఖవారికే అధికంగా ఉంది. ఇప్పటికే హిందీనుంచి తెలుగుకు సమాచార పరివర్తనానికి యంత్రానువాద ఉపకరణం అందుబాటులో ఉంది (చూ. www.).

9.20.3 విద్యాశాఖ:

మాతృ భాషాభివృద్ధి బాధ్యత పూర్తిగా విద్యాశాఖదే. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడం. ఉన్నత పాఠశాల స్థాయివరకూ తెలుగును తప్పనిసరి చేయటం, తెలుగు మాధ్యమ బోధనకు శాస్త్ర సాంకేతిక రంగాల విద్యా ప్రణాళికలను విస్తరింపజేయడం. అధికార భాషా సంఘాలు చురుకుగా భాషాభివృద్ధి దిశగా అడుగులు వేసేలా చూడటం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే అన్ని ప్రవేశపరీక్షలూ తెలుగుభాషలో కూడా ఉండేటట్లు నిర్ణయాలు తేయాలి.

తెలుగు భాషకు రాష్ట్ర బడ్జెట్లో ఎక్కువ నిధులను కేటాయించేలా చూసుకొని వాటిని సద్వినియోగించటం.

విద్యాశాఖ అనుసరించవలసిన భాషా విధానం

స్థాయి	**తరగతి**	**భాషల సంఖ్య**	**భాషలు**
ప్రాథమిక స్థాయి	1–3	1	1. మా.భా./ ప్రా.భా.
ప్రా.ఉన్నత స్థాయి	4–5	2	1. మా.భా./ప్రా.భా. 2.ఆంగ్లం
ఉన్నత స్థాయి	6–10	3	1..మా.భా./ప్రా.భా.2.ఆంగ్లం 3. హిందీ
మాధ్యమిక స్థాయి	11–12	3	1. మా.భా./ ప్రా.భా.2. ఆంగ్లం3. హిందీ

అన్ని వృత్తి (ఇంజనీరింగ్, వైద్య, వ్యవసాయ పశువైద్య వాణిజ్యాది) విద్యాపాఠ్యాంశాలలో తెలుగు తప్పనిసరిగా ఉండాలి. తెలుగు మాతృభాషగా కాని వారికి ఉర్దూ హిందీ మరోది కావచ్చు

9.20.4 ఆర్థిక శాఖ:

ఆర్థిక లావాదేవీలు జరిగే ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ప్రయివేటు సంస్థలలోనూ తెలుగు వినియోగం సత్వరం పెరగాలి.

బ్యాంకులలో చలానాలు తెలుగులో ఉండాలి. తెలుగు సంతకాలు, బ్యాంకు పాసుపుస్తకాలు తెలుగులో ఉండటం వల్ల మాతృభాష మాత్రమే తెలిసిన వినియోగదారులకు మేలు జరుగుతుంది.

ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఆర్థిక సమాచారం, షేర్ మార్కెట్, అంతర్జాతీయ విపణి ఇత్యాది అంశాలకు సంబంధించిన సమాచారం తెలుగులో తక్కువ.

బ్యాంకులు అందించే సేవలు వాటి వివరాలు తెలుగులో ఉంటే వ్యాపారమూ పెరుగుతుంది భాషాభివృద్ధీ జరుగుతుంది.

ఎటిఎమ్‌లలో నిరక్షరాస్యులు, అంధులు సులభంగా వినియోగించే విధంగా తెలుగులో శ్రవణ రూపంలో పరికరాలు వినియోగంలోనికి రావాలి. నగదు చీటిలూ తెలుగులో ముద్రించాలి.

సిఎ, ఐసిడబ్ల్యూఏ వంటి కోర్సులను తెలుగులో చదివే అవకాశం కల్పించాలి. ఎందుకంటే ఇంటర్మీడియెట్ స్థాయివరకు ఎందరో విద్యార్థులు తెలుగులో చదివి అకస్మాత్తుగా ఆంగ్ల మాధ్యమానికి మారలేక అవస్థలు పడుతున్నారు. పారిభాషిక పదాల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. అందుకని సర్వసమగ్రమైన ఆర్థికశాస్త్ర నిఘంటువు రూపొందాలి.

9.20.5 రోడ్లు భవనాల శాఖ:

భవన నిర్మాణరంగానికి చెందిన పారిభాషిక పదకోశాన్ని నిర్మించాలి. భవన నిర్మాణంలో ఆధునికంగా వస్తున్న సదుపాయాలు, నాణ్యమైన వస్తువులు ఇత్యాది విషయాలన్నింటినీ ఏర్పరచిన ప్రభుత్వ వెబ్ సైట్లు తెలుగులోనే ఉండాలి.

రోడ్లపైన భవన నిర్మాణంలోనూ పనిచేసే కార్మికుల భద్రత దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలను చరవాణులలో వినిపిం జేయవచ్చు.

జాతీయ రహదారులపై టోల్ గేట్ల వద్ద తెలుగులో సమగ్ర సమాచారం ఉండాలి. జాతీయ రహదారులపై తీసుకోవలసిన జాగ్రత్తలను అందుబాటులో ఉన్న సేవలను తెలుగులో అందించాలి.

ప్రమాదాలను సూచించే విధంగా సూచనలిచ్చే పరికరాలను తెలుగులో అందించాలి.

9.20.6 పశు సంవర్ధక శాఖ:

పశు పక్ష్యాదులకు సంబంధించిన పదాలను సమగ్రంగా సమీకరించి ఒక పారిభాషిక పదకోశం తయారు చేయాలి. వివిధ మండలాలలో వాటికి గల పదాలు, వాటి రూపాంతరాలు, పశువులకు వచ్చే రోగాలు వాటికి సంబంధించిన పదాలను సంకలనం చేయాలి.

ప్రతి పశువుల వైద్యశాలలోనూ, ప్రభుత్వ వెబ్ సైట్లలోనూ పశువుల పాలన, పోషణ, రోగాల వివరాలు, రోగనివారణకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండాలి.

అత్యాధునికంగా అంతర్జాతీయంగా వస్తున్న వైద్యసదుపాయాలు, చికిత్సలూ ప్రజల భాషలోనే అందుబాటులో ఉంచినట్లయితే అభివృద్ధి కరతలామలకం అవుతుంది.

పశువులపై ఆధారపడి ఉన్న వృత్తులకు సంబంధించిన సమాచారమూ తెలుగులో ఉండాలి. ఆధునిక పరిశోధనలకు ఎప్పటికప్పుడు తెలుగులోకి అనువదించి ప్రజలకు అందించాలి.

9.20.7 ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ

ఇప్పటికీ దేశంలో నిరక్షరాస్యులలో అధికశాతం స్త్రీలే. కేవలం మాతృభాష మాత్రమే మాట్లాడేవారు చదవటం, రాయటం వరకే వచ్చిన వాళ్ళు స్త్రీలలో అధికం.

ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు, వైద్యసేవలు, చికిత్సలు, ముందస్తు రోగనివారణలు, గర్భిణులకు ఇచ్చే సూచనలూ సలహాలు తెలుగులో అందించటం, అలాగే శ్రవణ మాధ్యమం ద్వారా చరవాణులలో అందించటం ప్రభుత్వ కర్తవ్యం.

గర్భిణులకు, గర్భస్థ శిశువులకు, పుట్టిన తర్వాత శిశువుకు ఇప్పించవలసిన టీకాల సమాచారం తెలుగులో అందించాలి.

అలాగే ప్రాణాంతక వ్యాధులు, వైరస్, బాక్టీరియాల వల్ల వ్యాపించే వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలభాషలో అందించటం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు.

ఆధికారిక వెబ్ సైట్లలో ప్రభుత్వ పథకాల ద్వారా వర్తించే రాయితీ వివరాలు, సేవలు అందించే వేతన వివరాలు తెలుగులో ఉండాలి.

అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్స మొదలైన వివిధ రకాలైన వైద్య విధానాలు అవి లభించే స్థలాలు, అయ్యే ఖర్చులు చికిత్సా పద్ధతులూ ఇవన్నీ తెలుగులో అందరికీ అందుబాటులో ఉండాలి.

నిరక్షరాస్యులకు రకరకాల అంటురోగాల పట్ల అప్రమత్తంగా ఉండేలా చరవాణుల ద్వారా సూచనలు, సలహాలు అందించాలి.

9.20.8 **పరిశ్రమల శాఖ:**

చిన్నతరహా, భారీ పరిశ్రమలు, అందులో దొరికే ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ప్రభుత్వ వెబ్ సైట్లలో అందుబాటులో ఉండాలి.

కుటీర పరిశ్రమల వివరాలు, పెట్టుబడులు, అంచనాలు, రాబడులు, ప్రభుత్వ రాయితీలు, విధానాలూ ఇవన్నీ తెలుగులో అందించటం ద్వారా సమాచారం ఎక్కువమందికి చేరి రాష్ట్రం పారిశ్రామిక అభివృద్ధి సాధించేందుకు వీలవుతుంది.

పారిశ్రామికవేత్తలు వారివారి కంపెనీల లావాదేవిలలోనూ, టెండరు ప్రతిపాదనలలోనూ, రాష్ట్రస్థాయి వ్యక్తుల, కార్యాలయాలలో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలలోనూ తెలుగు భాషకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం నియమాలు విధించాలి. అలా పాటించిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి. ఇలా చేస్తే తెలుగు చదివిన వారికి ఉపాధి లభిస్తుంది.

9.20.9 న్యాయశాఖ:

గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ న్యాయపాలనలో తెలుగు వాడకం తప్పనిసరిగా ఉండాలి.

ఫిర్యాదుల నమోదులు, వాద ప్రతివాదనలు, తీర్పులు మొదలైనవి తెలుగులోనే జరిగేలా చూడాలి. సమగ్రమైన న్యాయపాలనా పారిభాషిక పదకోశం తయారుకావాలి. అది అంతర్జాలంలో అందరికీ అందుబాటులో ఉండాలి.

9.20.10 పంచాయితీ గ్రామీణాభివృద్ధి శాఖ :

గ్రామాలలో అత్యధికులు మాతృభాష తప్ప అన్యభాషలో వ్యవహారం చేయలేరు. గ్రామీణ సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం చేపట్టే అన్నీ కార్యక్రమాలు తెలుగులో

ఉండాలి. ప్రభుత్వ వెబ్ సైట్లను తెలుగులో రూపొందించాలి. గ్రామాలలోని పాఠశాల విద్యలో మాతృభాషా మాధ్యమం కచ్చితంగా అమలయ్యేలా చూడాలి.

9.20.11 గిరిజన అల్పసంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ:

గిరిజనుల భాషలను సమగ్రంగా అధ్యయనం చేయడం, నిఘంటువులను, వాచకాలను రూపొందించటం, వారి సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే మౌఖిక వాఙ్మయాన్ని భద్రపరచటం ఈ శాఖ ప్రధాన కర్తవ్యం.

ఏ ఒక్క భాషా అంతరించి పోకుండా వర్ణనాత్మక వ్యాకరణాలను రచింపజేసి వాటిని తెలుగు భాషలలోనికి మార్చి చదువుకొనే రీతిలో పరివర్తనాలను సిద్ధం చేయించాలి.

గిరిజనులకు వారివారి మాతృభాషలలో ప్రాథమిక విద్య నేర్చుకొనే అవకాశం కల్పించి నాలుగవ తరగతి నుండి తెలుగు మాధ్యమంలోనికి మారే అవకాశం కల్పించాలి. గిరిజనుల భాషల నేపథ్యం లోంచి సామాజిక, సంస్కృతిక దృక్కోణంలో భాషా పరిశోధనలు జరిగేలా ప్రోత్సహించి వాటికి అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయాలి.

9.20.12 కార్మిక ఉపాధి శాఖ:

కార్మికులలో అధికశాతం నిరక్షరాస్యులే. కొద్దో గొప్పో చదువుకొంటే అది మాతృభాషలోనే. మాట్లాడేదీ మాతృభాష ఒక్కటే. అందుకే కార్మికుల సంక్షేమాలు, వారికి గల ఉపాధి అవకాశాలు ఇవన్నీ తెలుగులో వారికి అందుబాటులో ఉంచాలి.

నిరక్ష్యరాస్యులకు చరవాణులలో ఈ కింది సమాచారం అందించటం సముచితం.

1. ఉపాధి అవకాశాలు
2. ఆరోగ్య పరిరక్షణ
3. ప్రమాద నివారణ
4. నాణ్యమైన పరికరాల లభ్యత మొ.

9.20.13విద్యుత్ అణుశక్తి శాఖ:

విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తగిన సూచనలూ, సలహాలు తెలుగులో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచాలి. వివిధ ప్రాంతాలలో జరిగే ప్రమాదాలకు సంబంధించిన సమాచారం తెలుగులో ఎప్పటికప్పుడు అందులోని ఉద్యోగులకు అందించాలి.

వృత్తివిద్యా పాఠ్యాంశాలలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ద్వారా నైపుణ్యాలు పెరుగుతాయి. విద్యుద్ఘాతాలు, ప్రాకృతిక ప్రమాదాలకు సంబంధించిన సమాచారం తెలుగులో అందించడం ద్వారా ప్రమాదాలను ముందుగా ఊహించి నివారించుకోవచ్చు. సాంకేతిక పరికరాలలో తెలుగు వాడటం ద్వారా ఈ ప్రమాదాల నివారణ వేగవంతమై అపారమైన ధన నష్టం, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

9.20.14రెవెన్యూ వాణిజ్యశాఖ:

ప్రభుత్వానికి ఆదాయం వచ్చే ఈ శాఖ ద్వారా తెలుగు భాషకు మేలు చేకూర్చవచ్చు. ప్రభుత్వ ప్రభుత్వేతర కార్యాలయాలన్నింటా తెలుగును తప్పని సరి చెయ్యాలి. తెలుగులో వ్యవహారాలు, నామఫలకాలు, వస్తువుల పేర్ల ముద్రణ, నగదు రసీదులు తెలుగులో లేని దుకాణాలపై అలా చేయడానికి కావలసిన చర్యలు తీసుకోవటం. భూ లావాదేవీలకు సంబంధించి పత్రీకరణ, ఒప్పంద పత్రీకరణలు పూర్తిగా తెలుగులో ఉండే విధంగా చర్యలు తీసుకోవటం మొ.

9.20.15 హోం మంత్రిత్వ శాఖ:

పాలనాపరంగానూ, పౌరభద్రతపరంగానూ ఈ శాఖ ఎంతో ముఖ్యమైనది. కావలి యంత్రాంగం రాతకోతలు పూర్తిగా తెలుగులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. పోలీసు వారినుండి ప్రజలకూ, ప్రజలనుండి పోలీసువారికి సమాచార వ్యవస్థ అనుసంధానంలో తెలుగు భాష ప్రాధాన్యం ఉంటే చర్యలు, నిర్ణయాలు సత్వరం తీసుకొనేందుకు వీలుంటుంది. పోలీసు ఠాణాలలో కేసుల స్వీకరణ, నమోదు, ఎఫ్.ఐ.ఆర్ నమోదు వంటివన్నీ తెలుగులోనే జరగాలి.

9.20.16 భాషా సాంస్కృతిక శాఖ:

పై శాఖలన్నింటిలో తెలుగుభాష స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించటం, అవసరమైన చర్యలను సత్వరం చేపట్టడం ఈ శాఖ కర్తవ్యం.

1. వివిధ రంగాలకు సంబంధించిన పారిభాషిక పదకోశాల తయారీ;
2. వివిధ వృత్తులకూ, మాండలిక పదాలకూ కోశాల తయారీ;
3. భాషను ఆధునికీకరించటం;
4. పత్రిక, ప్రసార మాధ్యమాల, అంతర్జాలాలలో భాషను మెరుగుపరచడం, సమస్యలను పరిష్కరించడం;

5. ఆధునిక పరికరాలలో తెలుగు ఉండేలా వాడేలా చూడటం;

6. తెలుగు భాషనుండి ఇతర భాషలకూ, అలాగే తెలుగులోని మాండలికాలకు కావలసిన పరివర్తనాలను తయారు చేయించడం;

7. అన్యభాషాభ్యసనంలో తెలుగు భాషను వాహికగా తీర్చిదిద్దడానికి కావలసిన పరికరాలను తయారుచేయడం;

8. ప్రాచీన భాషా రూపాలను, సాహిత్య ప్రక్రియలను వ్యాప్తిలోనికి తెచ్చి ప్రజలకు భాషపట్ల అభిమానం పెంపొందేలా చేయడం;

9. ఆధునిక పరికరాలను తెలుగువారికి ప్రజలభాషలో అందుబాటులో ఉంచి, తెలుగు వినియోగాన్ని పెంచడం;

10. తెలుగు బోధన వినియోగరంగాలలో ఉపాధి అవకాశాలు పెరిగే దిశగా నిర్ణయాలు చేపట్టడం;

11. అంతర్జాతీయ ప్రమాణాలతో తెలుగు భాషను సాంకేతికంగా అభివృద్ధి పరచడం;

12. అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల వెబ్ సైట్లూ, ప్రకటనలు, వాణిజ్య ప్రకటనలు, ప్రసారమాధ్యమాలు ఇలా అన్ని రంగాలలోనూ తెలుగు ప్రాధాన్యాన్ని పెంచేవిధంగా సత్వరచర్యలు చేపట్టడం;

13. విస్మృత కవుల కావ్యాలు, తాళపత్ర గ్రంథాలు, లిఖితప్రతులు మొదలైన ప్రాచీన వాఙ్మయాన్ని సాంఖ్యీకరణద్వారా భద్రపరచటం, వాటిని ఆధునిక వ్యవహారభాషలలోనికి మార్చి చదువుకొనే విధంగా ఇంకా చెప్పాలంటే ఎవరి భాషలోనికి వారే మార్చి చదువుకొనే విధంగా పరివర్తనాలను తయారుచేయించటం;

14. అంతర్జాలంలో తెలుగు పుటల సంఖ్యను పెంచేలా చేయటం;

15. తెలుగు భాషకు పద విశ్లేషిణులను, పదజనకాలను, గుణింత పరిష్కరిణులను, వాక్య విశ్లేషిణులను వ్యవహారభాషకే కాక, వివిధ కాలాలలో ఉన్న ప్రాచీన భాషారూపాలకూ, ప్రాంతీయ భాషలకూ తయారుచేయించటం;

16. యంత్రానువాద వ్యవస్థను పటిష్టపరచటం మొదలైనవి.

17. విశ్వవిద్యాలయాలన్నింటిలోనూ తెలుగు శాఖలు ఉండేలా చర్యలు తీసుకోవడం భాషావ్యాకరణాంశాలను పాఠ్యప్రణాళికల నుండి తప్పించే తెలుగు శాఖలపై చర్యలు తీసుకోవటం.